ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుల గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 299 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | ఆదివారం 25 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar


## సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళుతున్న వెండి!

వెండి ధరలు దూసుకెళుతున్నాయి. పెట్టుబడిదారుల ఆసక్తిని ఆకర్షిస్తూ ఈ తెల్లని లోహం సరికొత్త రికార్డులను తాకుతోంది. ఈ జనవరి నెలలోనే ఇప్పటివరకు 22 శాతం మేర వెండి ధర పెరిగింది. ప్రధాన పెట్టుబడి సాధనాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోంది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 3 లక్షల మైలురాయికి అత్యంత చేరువలో ఉంది.గత శుక్రవారం ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ. 2,87,762 వద్ద ముగిసింది.

## భారత కంపెనీలకు పోటీతత్వమే కీలకం

అయిదు రోజుల పాటు దావోస్ జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలకు భారత్ నుంచి వ్యాపార ప్రముఖులు హాజరు కానున్నారు. కంపెనీలకు ఖర్చు, స్థాయి, సామర్థ్యాల్లో పోటీతత్వాన్ని తీసుకురావడమే కీలకంగా మారిందని కన్సల్టెన్సీ సంస్థ బీసీజీ ఇండియా అధిపతి రాహుల్ జైన్ తెలిపారు. 2030 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచే అవకాశం ఉందన్నారు.



## గవర్నర్ పదవిని అవమానించారు

- తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్
- సమావేశాలు ప్రారంభమైన మొదటిరోజున ఆర్ఎన్ రవి ప్రసంగించకుండా గవర్నర్ పదవిని అవమానించారు.
- గతంలో ఏ గవర్నర్లు కూడా ఇలా ప్రవర్తించలేదు
- మాజీ సీఎంలు అన్నాదురై, కరుణానిధి, ఎం.జి.రామచంద్రన్, జయలలిత చూడని రాజకీయ సంక్షోభాన్ని తాను ఎదుర్కొంటున్నా



## అమెరికాలో మంచు తుపాను విలయతాండవం

- 16 రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ, 8,000 విమానాలు రద్దు!
- అమెరికాను ముంచెత్తుతున్న భారీ మంచు తుపాను
- దాదాపు 20 కోట్ల మంది ప్రజలపై తీవ్ర ప్రభావం
- 16కు పైగా రాష్ట్రాల్లో స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ విధింపు
- వారాంతంలో 8,000కు పైగా విమాన సర్వీసులు రద్దు
- పలు ప్రాంతాల్లో విపత్తు స్థాయి మంచు పేరుకుపోయే ప్రమాదం

## ఎన్నికల షెడ్యూల్ విడుదలకు

# రంగం సిద్ధం




- తెలంగాణ పురపాలక ఎన్నికలు.. ఈ నెల 27న షెడ్యూల్!
- ఎన్నికల షెడ్యూల్ ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్న ఎస్ఈసీ
- ఈ నెల 27న షెడ్యూల్ ప్రకటించే అవకాశం
- ఎన్నికల షెడ్యూల్ విడుదలైన 15 రోజుల్లో పోలింగ్
- ప్రస్తుత ఓటర్ లిస్ట్‌లో లేని వారిని గుర్తించి కొత్తగా ఓటర్లను నమోదు చేసేందుకు ఆశావహులు కసరత్తు
- ఇతర ప్రాంతాలు, గ్రామాల్లో ఉన్న వారిని పట్టణాల్లోకి మార్చే పనిలో వారంతా తలమునకలై ఉన్నారు.
- అభ్యర్థి ఎన్నికల బరిలో పోటీ చేయాలంటే అర్హతలు, వ్యయ పరిమితి ఇతర అంశాలపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల మార్గదర్శకాలు జారీ

హైదరాబాద్

రాష్ట్రంలోని ఏడు నగరపాలక సంస్థలు, 116 పురపాలక సంఘాలకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ విడుదలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 27వ తేదీన సాయంత్రం షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సన్నాహాలు చేస్తోంది. ఆ రోజున ఉదయం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సమావేశాన్ని నిర్వహిస్తారు. ఎన్నికల తుది ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన అనంతరం షెడ్యూలును విడుదల చేసే అవకాశం ఉంది. ఫిబ్రవరి 15లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విషయం - మిగతా3లో



## కేసీఆర్, కేటీఆర్ నా ఛాలెంజ్‌కు సిద్ధమా?

- కేంద్రమంత్రి బండి సంజయ్
- ఫోన్ ట్యాపింగ్ దొంగలను సాక్షులుగా పిలవడమేంటి
- ప్రభుత్వ ఒత్తిడికి లొంగితే సిట్ అధికారులకు ఉన్న క్రెడిబిలిటీ పోతుంది
- కేటీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదు
- మావోయిస్టుల జాబితాలో హీరోయిన్లు, వ్యాపారులతోపాటు బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోన్ నెంబర్లను చేర్చింది నిజం కాదా?

## జపాన్‌లోనూ మన యూపీఐ సేవలు

- భారత పర్యాటకులకు శుభవార్త!
- జపాన్‌లోనూ త్వరలో యూపీఐ చెల్లింపుల సేవలు
- పెరుగుతున్న భారత పర్యాటకుల కోసం కీలక నిర్ణయం
- ఎన్‌పీసీఐతో కలిసి ఎన్‌టీటీ డేటా ట్రయల్స్ నిర్వహణ
- 2026 ఆర్థిక సంవత్సరం నుంచి సేవలు ప్రారంభించే యోచన

## సింగరేణి ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని

# దెబ్బతీసే యత్నం

- 'సైట్ విజిట్' అనే నిబంధనను కోల్ ఇండియా 2018లో పెట్టింది
- "సైట్ విజిట్ అనే నిబంధన దేశంలో ఎక్కడా లేదన్నట్లు దుష్ప్రచారం చేశారు
- టెండర్లు రద్దు చేయకపోతే ప్రజల్లో అపోహలు పెరుగుతాయని వెంటనే రద్దుకు ఆదేశించాను
- సింగరేణిలో మొత్తం 25 కాంట్రాక్టులు జరిగితే.. 20 టెండర్లు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయి"
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




హైదరాబాద్


తెలంగాణకు ఆత్మగా ఉన్న సింగరేణిపై కొన్ని కట్టుకథలు వస్తున్నాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. సింగరేణి ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. 'సైట్ విజిట్' అనే నిబంధనను కోల్ ఇండియా 2018లో పెట్టిందని చెప్పారు. దీని ప్రకారమే సింగరేణి 2021లో సైట్ విజిట్‌ను తప్పనిసరి చేసిందన్నారు. 2018, 2021లో తాము అధికారంలో ఉన్నామా? అని ప్రశ్నించారు. సింగరేణి అనేది స్వయంప్రతిపత్తి సంస్థ అని, సంస్థలో ప్రతి నిర్ణయం మంత్రిమండలి వద్దకు రాదని చెప్పారు. ప్రజాభవన్‌లో భట్టి మీడియాతో మాట్లాడారు. "సైట్ విజిట్ అనే నిబంధన దేశంలో ఎక్కడా లేదన్నట్లు దుష్ప్రచారం చేశారు. టెండర్లు రద్దు చేయకపోతే ప్రజల్లో అపోహలు పెరుగుతాయని వెంటనే రద్దుకు ఆదేశించాను. - మిగతా3లో

## భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది



- ప్రధాని నరేంద్ర మోదీ
- ప్రపంచంలో అత్యధిక యువత మన దేశంలోనే ఉందన్న ప్రధానమంత్రి
- యువతకు అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్న మోదీ
- వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాల ద్వారా విదేశాల్లోని భారత యువతకు అవకాశాలు లభిస్తాయని వెల్లడి

## అమ్మాయిలంటే పవర్, బాధ్యత కాదు



- హోంమంత్రి అమిత్‌షా
- దేశ నిర్మాణంలో బలమైన శక్తి..
- మహిళలు భారతదేశ ప్రగతికి ముందుండి నడిపిస్తున్నారు
- మోడీ ప్రభుత్వ మహిళా నేతృత్వ అభివృద్ధి మంత్రం నారీ శక్తిని ప్రగతిలో అగ్రస్థానంలో నిలబెట్టింది
- ఆధునిక సమాజంలో ఇప్పటికీ బాలికలకు సమ ప్రాధాన్యత లభించంలేదు.



- దావోస్‌లో ముగిసిన సీఎం రేవంత్‌రెడ్డి బృందం పర్యటన
- భారీ పెట్టుబడులతో రానున్న బడా సంస్థలు
- మౌలిక సదుపాయాలు ఉపాధి, మెరుగైన జీవనం
- నగరానికి రానున్న మొదటి అంతర్జాతీయ బ్యూటీ టెక్ హబ్

## దావోస్ వేదికగా

# రాచబాట

## భాగ్యనగరానికి బడా సంస్థలు

హైదరాబాద్

తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లక్ష్యాలను ప్రపంచానికి వివరించడంతో పాటు పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంతో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం పర్యటన ముగిసింది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం, పారిశ్రామికవేత్తలు, నిపుణులతో చర్చలు జరిపింది. ఏఐ, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించింది. మూడు రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పారిశ్రామికవేత్తలతో 12 ముఖాముఖి సమావేశాలు, రెండు కీలక సెషన్లలో - మిగతా3లో

## సంపాదకీయం

# 'కాల్' యముళ్లతో కాలం వృథా

నిరంతర కనెక్టివిటీ ఉన్న ఈ యుగంలో అనవసర ఫోన్ కాల్స్ వెల్లువలా వస్తూ విసుగు, చిరాకు కలిగించే విషయం మరొకటి లేదు. ఆటోమేటెడ్ డయలర్లు ఉపయోగించి ముందుగా రికార్డ్ చేసిన సందేశాలను పంపే రోబోకాల్‌లు ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులను వేధిస్తూనే ఉన్నాయి. యూ మెయిల్ రోబోకాల్ ఇండెక్స్ ప్రకారం ఒక్క అమెరికాలోనే 2025లో 52.5 బిలియన్ రోబోకాల్‌లు వచ్చాయి; డిసెంబర్ 2025లోనే దాదాపు 4.1 బిలియన్ కాల్స్ నమోదయ్యాయి. నియంత్రణ చర్యలు ఉన్నప్పటికీ, ఇటీవలి సంవత్సరాలలో ఈ సంఖ్య సంవత్సరానికి 50–55 బిలియన్ మధ్యే ఉండి, గణనీయంగా తగ్గలేదు. ఈ కాల్స్‌లో కొన్ని న్యాయమైన అపాయింట్‌మెంట్ రిమైండర్లు, విమాన రద్దులు, లేదా మందుల రీఫిల్ సమాచారం వంటి సేవలు. కానీ చాలా కాల్స్ అసౌకర్యం కలిగించేవి లేదా మోసపూరితమైనవే. సాధారణ మోసాల్లో నకిలీ ఐఆర్ఎస్ బెదిరింపులు, వాహన వారంటీ ముగిసిందని చెప్పే కాల్స్, అప్పుల నుంచి విముక్తి ఆఫర్లు ఉన్నాయి. చాలా సందర్భాల్లో కాలర్ ఐడీని నకిలీగా (స్పూఫింగ్) చూపించి స్థానిక లేదా నమ్మదగిన నంబర్లలా కనిపించేలా చేస్తారు. అమెరికాలో అన్ని రోబోకాల్‌లు అక్రమం కావు. పాఠశాలల మూసివేతలు, వైద్య రిమైండర్లు వంటి సమాచార కాల్స్, చట్టబద్ధమైన అప్పు వసూలు ప్రయత్నాలు, ఆరోగ్య సేవా సంస్థల నోటిఫికేషన్లు, అలాగే మూడో పక్ష సేవలు ఉపయోగిస్తే కేవలం గత దాతలకు మాత్రమే చేసే దాతృత్వ కాల్స్ వంటి వాటికి అనుమతి ఉంది. అయితే అమ్మకాల (సేల్స్) సంబంధిత రోబోకాల్‌లు ముందస్తు లిఖితపూర్వక సమ్మతిలేకుండా సాధారణంగా నిషేధితమే. ఆ సమ్మతి స్పష్టంగా ఉండాలి; సేవకు షరతుగా కంపెనీలు దాన్ని కోరలేవు. మోసం లేదా మభ్యపెట్టే ఉద్దేశంతో చేసే స్కామ్ రోబోకాల్‌లు ఎక్కడైనా అక్రమమే. రోబోకాల్‌ల పెరుగుదలకు ప్రధాన కారణం వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రోటోకాల్ సాంకేతికత. ఇది తక్కువ ఖర్చుతో భారీ సంఖ్యలో కాల్స్ చేయడానికి, కాలర్ ఐడిని నకిలీగా చూపించడానికి అవకాశం ఇస్తుంది. కాల్స్ క్లిష్టమైన అంతర్జాతీయ నెట్‌వర్క్‌ల ద్వారా వెళ్లడం వల్ల ట్రేస్ చేయడం కష్టం. కాల్ కంటెంట్‌ను ఉద్దేశ విశ్లేషణ కోసం క్యారియర్‌లు చూడలేకపోవడం, ఆసుపత్రుల వంటి చట్టబద్ధ కాల్స్‌ను పొరపాటున బ్లాక్ చేస్తే బాధ్యత ప్రమాదం ఉండటం, కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్‌వల్ల పరోక్ష లాభం ఉండటం వంటి సవాళ్లు ఉన్నాయి. మోసగాళ్లు కొత్త నంబర్లు, ప్లాట్‌ఫారమ్‌లు, తంత్రాలతో వేగంగా మారిపోతుంటారు. కాలర్ ఐడి నిజత్వాన్ని నిర్ధారించే స్టిర్/షేకేన్ వంటి వ్యవస్థలు అమల్లోకి వచ్చాయి; 2025లో మరింత ప్రభావం కోసం, అధిక నమ్మక కాల్స్‌కు ధ్రువీకరించిన కాలర్ పేర్లు తప్పనిసరి చేయడం వంటి మెరుగుదలలు ప్రతిపాదించబడ్డాయి. స్పూఫింగ్ తగ్గినప్పటికీ, రోబోకాల్‌ల పరిమాణం ఇంకా అధికంగానే ఉంది; పూర్తి పరిష్కారానికి విస్తృత వ్యవస్థాగత మార్పులు అవసరం. భారతదేశంలో ఈ సమస్య అనవసర వాణిజ్య కమ్యూనికేషన్లు, స్పామ్ కాల్స్ రూపంలో కనిపిస్తుంది. సర్వేలు చెబుతున్నదేమిటంటే, ప్రతి పది మంది భారతీయుల్లో ఆరుగురు రోజుకు కనీసం మూడు స్పామ్ కాల్స్ పొందుతున్నారు; నియంత్రణలు ఉన్నప్పటికీ చాలామంది నిరంతర ప్రమోషనల్ లేదా మోసపూరిత కాల్స్‌తో బాధపడుతున్నారు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ సమస్యను నేషనల్ కస్టమర్ ప్రిఫరెన్స్ రిజిస్టర్, డూ నాట్ డిస్టర్బ్, టెలికాం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్, 2018 ద్వారా నియంత్రిస్తుంది. 2025లో చేసిన ముఖ్య సవరణలతో ఫిర్యాదు చేసే గడువు 3 నుంచి 7 రోజులకు పెంచడం, నమోదు కాని టెలీమార్కెటర్లపై చర్య తీసుకునే సమయాన్ని 30 నుంచి 5 రోజులకు తగ్గించడం, కఠిన శిక్షలు విధించడం, స్పష్టమైన కాలర్ గుర్తింపును తప్పనిసరి చేయడం జరిగింది. యాప్ ద్వారా వచ్చిన పౌరుల ఫిర్యాదుల ఆధారంగా గత ఏడాదిలో 21 లక్షలకుపైగా మోసపూరిత నంబర్లు, సుమారు ఒక లక్ష సంస్థలను డిస్కనెక్ట్ చేసి బ్లాక్‌లిస్ట్ చేసింది. సాధారణ అలవాట్లు సాధనాల ద్వారా వినియోగదారుల చేతిలోనే పెద్ద శక్తి ఉంది. నిపుణుల సలహా ప్రకారం, తెలియని నంబర్లకు స్పందించకుండా వాయిస్‌మెయిల్‌కు వెళ్లనివ్వడం మంచిది–. ఎందుకంటే స్పందిస్తే మీ నంబర్ యాక్టివ్‌గా ఉందని మోసగాళ్లకు సంకేతం వెళ్తుంది. ఒకవేళ స్పందించి అది రికార్డింగ్ లేదా అనుమానాస్పదమని గ్రహిస్తే, వెంటనే కాల్ కట్ చేయాలి; బటన్లు నొక్కడం, అవును అని చెప్పడం వంటి వాటిని నివారించాలి–. మోసగాళ్లు అంగీకారాలను రికార్డ్ చేసి దుర్వినియోగం చేస్తారు. అకౌంట్ వివరాలు, సోషల్ సెక్యూరిటీ నంబర్లు, పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని అనవసర కాల్స్‌లో ఎప్పుడూ పంచుకోవద్దు. కాలర్ నిజమా కాదా తెలుసుకోవడానికి, కాల్‌కట్ చేసి అధికారిక స్టేట్‌మెంట్లు లేదా వెబ్‌సైట్లలో ఉన్న నంబర్ల ద్వారా సంస్థను స్వయంగా సంప్రదించాలి. కాల్‌లను బ్లాక్ చేయడానికి, ఫిల్టర్ చేయడానికి ఆండ్రాయిడ్ వినియోగదారులు ఫోన్ యాప్ సెట్టింగ్స్‌లో ఫిల్టర్ స్పాం కాల్స్, కాలర్ ఐడి స్పామ్ ఆప్షన్లను ఆన్ చేయాలి. ఐ ఫోన్ వినియోగదారులు సెట్టింగ్స్‌లో సైలెన్స్ అన్ నోన్ కాలర్స్ ఆన్ చేయాలి. డిఎన్‌డి కోసం 1909కి స్టార్ట్ అని ఎస్ఎంఎస్ చేయడం, 1909కి కాల్ చేయడం, లేదా ట్రాయ్ యాప్ ఉపయోగించి అభిరుచులు సెట్ చేసి వర్గాల వారీగా బ్లాక్ చేయవచ్చు. స్పూఫ్ చేసిన యాక్సెస్‌ను నివారించేందుకు వాయిస్ మెయిల్‌కు పాస్‌వర్డ్ సెట్ చేయండి.సర్వీస్ ప్రొవైడర్లు, నియంత్రణ సంస్థలు అంతర్జాతీయ సహకారం, అధునాతన ధ్రువీకరణ వంటి వ్యవస్థాగత పరిష్కారాలపై పని చేస్తున్నప్పటికీ, అత్యంత ప్రభావవంతమైన రక్షణ వ్యక్తిగత అప్రమత్తతే. తెలియని కాల్స్‌ను నిర్లక్ష్యం చేయడం, బ్లాక్ చేయడం, నిరంతరం రిపోర్ట్ చేయడం ద్వారా వ్యక్తులు రోబోకాల్‌ల వరదను గణనీయంగా తగ్గించవచ్చు, దోషులపై చర్యలు తీసుకోవడంలో అధికారులకు సహాయపడవచ్చు. మీ ఫోన్‌ను రోబోకాల్‌లు ముంచెత్తుతున్నాయంటే, మీరు ఒంటరి వారు కాదు. సమాజాల్లో అనుభవాలు, చిట్కాలు పంచుకోవడం బలమైన అమలుకు సమూహ ఒత్తిడిని పెంచుతుంది. అప్పటివరకు, ఈ నిరూపిత వ్యూహాలు కొనసాగుతున్న ఈ

# ప్రాచీన చారిత్రక సాక్ష్యాల ఆత్మఘోష



అవిభక్త కరీంనగర్ జిల్లా గత కీర్తికి ప్రాచీన చరిత్రకు నిలువుటద్దంగా నిలిచి ఉంది. రాష్ట్ర పురావస్తు శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి.వి. కృష్ణశాస్త్రి అపురూప పరిశోధనల ఫలితంగా, జిల్లా పాక్చరిత్ర 50వేల సంవత్సరాలకు పూర్వం ఉన్నదని రుజువైతే, అది సామాన్యమైన విషయమేమీ కాదు. గౌతమి నదీ దక్షిణ తీరమున పరి వ్యాప్తమై ఉన్న, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో, ఉత్తర దక్షిణ భారతీయులకు, సేతువై నిలిచిన ఈ ప్రాంత నాగరికత, కాల ప్రవాహంలో కొట్టుకుని పోయినా, ఉత్సాహ వంతులైన చారిత్రక పరిశోధకుల అవిరళ కృషి ఫలితంగా కథలుగా, గాథలుగా, నోళ్లలో, రాళ్లలో, ఆకులలో, రేకులలో అక్కడక్కడ నిక్షిప్తమై యున్న చరిత్ర కొంతవరకు వెలుగు లోనికి రాగలిగింది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు, శాతవాహనులు మొట్టమొదటి రాజ వంశం అనీ, అదీ మహారాష్ట్రలోని పైఠానో లేక నాసిక ప్రాంతము అనుకుంటే కాదని, అంతకుముందే పురాణాలలో పేర్కొనబడిన ఆంధ్ర భృత్యులని, తొలి ఆంధ్ర ప్రభువుల సేవకులనే విషయం, కోటిలింగాల తవ్వకాలలో బయల్పడడం విశేషం. కరీంనగర్ జిల్లాలోనే శాతవాహనుల మూలపురుషులకు ఆవాస స్థానమని చారిత్రక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. క్రీస్తుపూర్వం శతాబ్దాల క్రితమే ఆంధ్రరాజ్యం, శాతవాహనుల ఏలుబడిలో వర్ధిల్లిన, వారి అభిమాన పాత్రమైన బౌద్ధమతం, ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య మత మై విరాజిల్లింది. ప్రాచీనమైన ప్రతి గ్రామం పేరులో ప్రతి నిర్మాణ కౌశలంలో, ప్రతి కట్టడం లో వస్తువులు, మట్టి పాత్రలు, మతంతో పెన వేసుకున్న చరిత్ర పలుకుతుంది. శాతవాహన చక్రవర్తుల చత్రచ్ఛాయలలో, బౌద్ధమతం విస్తరించి, శాంతి అహింసలు, విశ్రమించిన ఈ ప్రాంతాల్లో, నాటి ప్రజల ఆరాధ్యాలైన స్థూపాలు, శిల్పాలు, కట్టడాలు, తవ్విన చోటల్లా దర్శనమిస్తూ, వెలకట్ట లేని వేల సంవత్సరాల చరిత్రకు, మౌన సాక్షీ భూతాలుగా నిరాదరణ నీడలో మగ్గుతూ, తమ దుస్థితికి చింతిస్తూ, అనాసక్తులైన, అధికారుల, ప్రజాప్రతినిధుల అశ్రద్ధ, నిర్లక్ష్యానికి క్రుంగి కృశిస్తు, ఆయువు తీరకముందే అస్తమిస్తున్నాయి. నిన్నటి వరకు ఆలనా పాలనా కరువై "బుద్ధం శరణం గచ్ఛామి" అంటూ దీనంగా విలపించిన ధర్మపురి నియోజకవర్గం లోని పాషాయిగాం బౌద్ధ స్తూపం, ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూలమట్టం అయింది. క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దంలో గంగా మైదానం ప్రాంతాలలో బౌద్ధమత వ్యాప్తి జరిగినా, అశోకుని కాలం కన్నా ముందే ప్రవేశించిన బౌద్ధమతం, శాత వాహనుల హయాంలో విశేష ఆదరణ పొందింది. అవిభక్త కరీంనగర్ జిల్లాలో మూడు ప్రాచీన బౌద్ధ కేంద్రాలు ఉండేవి. వాటిలోని ధర్మపురి సమీప క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల సంబంధిత పాశాయిగాం బౌద్ధ స్థూపానికి విశేష ప్రాధాన్యత ఉండేది. దీనికి 6 వృత్తాకారపు పలకలు ఉండేవి. వీటిపై ఒక పద్మం, ఏనుగు బొమ్మలు, స్థూపానికి ఇరువైపులా, స్తం భాకృతులు కలిగియున్న ఆ స్తూపం రెండవ శతాబ్దానికి చెందినదిగా "దూళికట్ట స్థూపం కన్నా ప్రాచీనమైనదిగా", "జిల్లాలోని మొట్టమొదటి రాతి కట్టడం"గా చరిత్రకారులు రుజువు పరిచారు. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం "నాగ సింపీయకాయ, జమజో రాగ బ్రహ్మ లేఖలు", స్తూపం వద్ద లభ్యమైనాయి. శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటిలింగాలకు మూడు కిలోమీటర్ల దూరంలో, ప్రస్తుత రాయపట్నం – కరీంనగర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని, పాశాయిగాం గుట్టపై చెన్న పూస అనే ఆచార్యుడు, బౌద్ధ స్థూపాన్ని నిర్మించినట్లు, సుప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు దిజ్ఞాగుడు, ఈ ప్రాంతం వాడేనని, చైనా యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ ఏడవ శతాబ్దంలో తన గ్రంథంలో పేర్కొన్నాడు. రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ వి.వి. కృష్ణ శాస్త్రి శాతవాహన కళా ఉత్సవాల సందర్భంగా, 2002 జనవరి 21న కరీంనగర్లో ప్రధాన ప్రాసంగికునిగా ప్రకటించడాన్ని బట్టి, పాషాయిగాం బౌద్ధ స్తూప ప్రాధాన్యత స్పష్టమౌతుంది. ఇంతటి ప్రాచీన చారిత్రక ఆధారమైన బౌద్ధ స్తూపం, రాష్ట్ర రహదారి రోడ్డు నిర్మాణంలో, కాంట్రాక్టర్ అయిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నిర్లక్ష్యానికి అనవసరంగా, అకారణంగా బలియై, 1999 డిసెంబర్ 25వ తేదీన నేల కూల్చ బడింది. ఆ తర్వాత ముక్కలైన ఆ స్తూప పలకలను చేర్చి, జిల్లా కేంద్ర పురావస్తుశాఖ మ్యూజియంలో భద్రపరిచి, తిరిగి స్థాపించడం జరిగింది. తత్ఫలితంగా పాశాయిగాంకు చెందిన బౌద్ధ స్తూపం, కనుమరుగై ఈ ప్రాంతం, చరిత్ర పుటల్లో నుంచి తొలగించబడి, ప్రాచీనత్వాన్ని కోల్పోయింది. అలాగే జూలపల్లి మండలంలోని క్రీస్తు పూర్వపు రెండవ శతాబ్ధికి చెందిన హుస్సే నియా వాగు – చిన్న వాగుల సంగమ స్థానంలో 47 శిల్పాలంకృత పలకలచే శోభితమై, ఐదు పడగల "ముచిలింద నాగం" బోధివృక్షం మహాభినిష్క్రమణం చెక్కబడిన దూళికట్ట స్థూపం విశేష ప్రాధాన్యతను కలిగి ఉంది. "కాలచక్ర నిర్వహణ"కై దూళికట్ట నుండి అపురూప ఫలకాలను, అమరావతికి కొద్దికాలం క్రితం అవిభక్త రాష్ట్రంలో తరలించారు. కోటిలింగాల ధూళికట్ట మరియు మీర్జంపేట మానేరు తీరాన చారిత్రక శిల్పాలను, స్తూపాలను, కోటలను, పరి రక్షించేందుకు నాటి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 38 లక్షలకు పైగా నిధులు అర్ధాంతరంగా మళ్లించ బడినాయి. ప్రాచీన కట్టడాలు, బౌద్ధ స్థూపాలు, ఆరామాలు, శిల్పీకరించిన అపురూప కళాకృతులు, ఈనాటి వారికి ప్రధానంగా చరిత్ర అంటే గౌరవం లేని సరైన అవగాహన లేని, పాలక అధికార వర్గాలకు తెలియక పోవచ్చు కాని, వాటి ప్రాశస్త్యానికి, వేల సంవత్సరాల వెలకట్టలేని, చారిత్రక నేపథ్యం ఉందన్న యతార్థాన్ని విస్మరించ రాదు. ఒకవైపు ప్రాచీనమైన బౌద్ధ వ్యాప్తికి సంబంధించిన, ఈ ప్రాంత చరిత్ర మరుగున పడుతుండగా... మరోవైపు ప్రాచీనత్వానికి ఆనవాళ్లు అయిన, అపురూప చారిత్రక సాక్ష్యాలను కనుమరుగు చేస్తుంటే, వారి ఆత్మ ఘోష వినిపిస్తుంటే, భారతీయ పురాతత్వ విభాగం ప్రపంచ పౌరుల ముందు తలదించుకోవాల్సిన దుస్థితి. గొప్పలు చెప్పుకోవడం కాదు గొప్పలు నిలబెట్టుకోవడమే గొప్ప తనం.

# కాలగర్భంలోకి శాతవాహనుల రాజధాని

చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు, శాతవాహనుల మొట్టమొదటి రాజవంశం, ఆదీ మహారాష్ట్రలోని పైఠానో లేక నాసిక ప్రాంతమో అనుకుంటే కాదని, అంతకు ముందే వీరు ఆంధ్రులని, కరీంనగర్ జిల్లానే వారి మూలపురుషులకు ఆవాస స్థానమని, చారిత్రక పరిశోధనలు స్పష్టం చేశాయి. శాతవాహన వంశానికి మూలపురుషుడు అని భావింపబడే శ్రీముఖుడు కోటిలింగాలను రాజధానిగా చేసుకుని పాలించాడని స్పష్టం అయినాక, ఆయన నాణేలు కోటిలింగాలలో లభ్యమైనాక చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. నాటి జిల్లా కేంద్రమైన కరీంనగర్ కు 65 కి.మీ .ల, నేటి జిల్లా కేంద్రమైన జగిత్యాలకు 27కి.మీల, ధర్మపురి క్షేత్రానికి 19 కి.మీ.ల దూరాన వెల్గటూరు మండలంలోని గోదావరి, పెద్దవాగు సంగమ స్థాన మందుగల కోటిలింగాలలోని పుట్ట కోట గోడలు (పూర్వపు కోటలు) ఆంధ్రదేశ పాలకులైన శాతవాహనుల తొలి రాజులకు ఆటపట్టయినవి. ఆంధ్రుల తొలిరాజుగా పురాణాలలో వర్ణించబడిన శ్రీముఖ చక్రవర్తి నాణాలను , కప్పారావు పేట సమీపాన, ధర్మపురి వాస్తవ్యులు ప్రముఖ చారిత్రక పరిశోధకులు , పురావస్తు శాఖలో ఎవి ట్రాఫిక్ అని సెంటు (శాసన వ్యాఖ్యాత)గా పనిచేస్తూ మరణించిన సంగనభట్ల నరహరిశర్మ సేకరించి, పురావస్తు శాఖకు అప్పగించడంతో , ఈ ప్రాంత ప్రాశస్త్యం వెలుగు చూడ గలిగింది. శాతవాహన కాలానంతర మైనట్టి వారికి ఉద్యోగ చెందిన "మహా తలవర, మహా సేనాధిపతి పతిస" అను నాణెములు ఇచ్చట లభించినవి. విదిశా నగరమును కేంద్రముగా ఏలిన చివరి శుంగరాజుల నాణెములు లభింపగా, వాటిపై బ్రాహ్మీ లిపిలో "రజోగో బదస, రజో సమగోపస" అని వ్రాసి ఉన్నవి. శుంగుల అనంతరం మగధను ఏలారని పురాణాలలో పేర్కొనిన కాణ్వరాజుల నాణెములు కూడా లభించాయి. వీటి ఆధారంగా పురాణములందు పేర్కొన్నట్లు, మగధ రాజ్యమును మౌర్యుల అనంతరం శృంగులు, కాణ్వులు పిదప ఆంధ్రులు వరుసగా పాలించినట్లు తార్కాణం ఇచ్చుచున్నదని పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ పుచ్చా వాసుదేవ పరబ్రహ్మ శా స్త్రీ సోదాహరణంగా నిరూపిం చారు. వీటిలో కొన్ని కోటిలింగాల పొలములలో బ్రాహ్మీ లిపి లోని శిలా ఫలకాలు వెలుగు చూశాయి. ఇచట లభించినట్లు అపురూప నాణెములు వేరెచ్చటా లభించని కారణంగా , కోటిలింగాల శాతవాహనుల తొలి రాజధాని అని, పరిసర ప్రాంత కేంద్ర స్థానమని స్పష్టమైంది. కోటిలింగాలలో నే నరహరిశర్మ పంచమార్క్ నాణేలు , ఇతర అపు రూప నాణేలు సేకరించి పురావస్తు శాఖకు హస్తగతం చేశారు. వానిలో "రజో శాతవాహ , రజో సాతకం నిస" అని బ్రాహ్మీ లిపిలో వ్రాయ బడింది. లిపి ప్రకారం శ్రీముఖుని కన్నా ఇవి ప్రాచీనమైనవి. సహజం గా ఉండవలసిన ఉజ్జయిని చిహ్నం వీటిలో లేదని నరహరి పరిశోధనలో పేర్కొన్నాడు. శాతవాహన కాలపు పొరల్లో అనేక శాతవాహన నాణేలు లభించాయి. లభ్యమైన నాణెములను బట్టి శాతవాహన వంశ మూల పురుషుడైన శాతవాహనుడు ఆంధ్రగోపులను , శబరులను, మహా తలవరులను, తదితర ఆంధ్ర రాజులను ఓడించి శాతవాహన



సామ్రాజ్యాన్ని స్థాపించాడు. శాతవాహనులు తొలుత ఆంధ్రుల పాలనలో భాగమై, ఆంధ్ర భృత్యు లుగా ఉండి, బలవంతులై సామ్రాజ్య స్థాపనకు పూనుకు న్నారని, శ్రీముఖుడు చివరి కాణ్వరాజును అంతమొందించి, స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పరచి, విస్తరించారని జగిత్యాలకు చెందిన ప్రముఖ చారిత్రక పరిశోధకులు , రిటైర్ రీడర్ డాక్టర్ జైశెట్టి రమణ య్య కరీంనగర్ చారిత్రక సంస్కృతి గ్రంథంలోని వర్ణించారు. హాల చక్రవర్తి గాథా సప్తశతి లోని గోదా వరి వర్ణన ఆధారంగా , లభ్యమైనట్లు ముఖనాణాలను బట్టి కోటిలింగాల, శాతవాహనుల బలిష్ట దుర్గమని తెలియు చున్నది. కోటి లింగాల సమీపమున గల గుట్టజైన మునులకావాస స్థానముగ నుండే దని తెలుస్తున్నది. సమీపాన క్రీ.పూ.రెండవ శతాబ్దపు బౌద్ధ స్తూపం పాపాయిగాం గుట్టపైన ఉండేది. ప్రస్తుతం మధ్య యుగానికి చెందిన దేవాలయం గ్రామంలో ఉంది. రెండు గర్భగృహాలకు ఉమ్మడి మంటపముంది. ప్రతి గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధానాలయంలో కోటీశ్వరుడు లింగ రూపుడుగా ప్రతిష్ఠితుడు కాగా, దక్షిణ దిశలో ఉత్తర ముఖ గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధాన ఆలయంలో కోటీశ్వరుడు లింగరూపుడై ఉన్నాడు. ఆలయం చాళుక్య రీతులలో నుండి, గోదావరి ఒడ్డున అనేక శిల్ప ప్రతిమలున్నాయి. పురావస్తు శాఖచే త్రవ్వకాలు జరపబడి, పర్యాటకశాఖ గుర్తింపు పొందింది ఈ ప్రదేశం. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాక్చరిత్రకు నిలువెత్తు నిలువుటద్దంగా నిలిచి, శాతవాహనుల తొలి రాజధానిగా చరిత్ర పుటలకెక్కి, జిల్లా సంతరించుకున్న జిల్లా చరిత్ర గతినేమార్చి, విశేష ప్రాధాన్యత కోటి లింగాల ఒడ్డు, గోదావరి నీటి వల్ల నానాటికీ కోతకు గురవు తున్నది. తవ్వకాలు జరిపితే చారిత్రక సత్యాలెన్నో వెలికి తీయగల చరిత్రకు పూర్వపు గ్రామం, ప్రమాదపు టంచున పయని సున్నది. స్థానికుల, దాతల చేయూత, ధర్మకర్తల మండళ్ళ కృషితో, ప్రత్యేక నిధులను ప్రోగు చేసుకుని దేవస్థానాన్ని అభివృద్ధి పరుచుకుంది. పర్యాటక శాఖ ఈ గ్రామంపై చాలా కాలం చిన్నచూపే చూసింది. గతంలో చాలా సందర్భా లలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రముఖ పర్యాటక స్థలంగా తీర్చిదిద్ద గలమని ఇచ్చిన హామీలు, చేసిన ప్రకటన – నీటిమూటలు గానే మిగిలిపోయాయి. జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర సాయి నాయకులు, ఉన్నతాధికారులు , చారిత్రక విషయాసక్తులైన వ్యక్తులు, రాష్ట్ర చరిత్రలో ప్రధాన ప్రదేశమైన కోటిలింగాలలో ప్రత్యేక అభివృద్ధి పనులు, ప్రాచీన చారిత్రక అవశేషాల సంరక్షణా చర్యలను చేపట్టడంపై, నిర్ణయాత్మక కార్యక్ర మాలను చేపట్టడంలో ఆలసత్వా న్నే ప్రదర్శించారు. ఈ కారణంగానే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాచీన చరిత్రకు సాక్షీభూతంగా నిలిచిన కోటిలింగాల నేడు కాలగర్భంలో కలిసి పోయే ప్రమాదంలో ఉంది. శ్రీపాద పాజెక్టు నిర్మాణ చర్యలలో భాగంగా చారిత్రక గ్రామానికి వరద ముప్పు భయభ్రాంతులకు గురి చేస్తున్నది. దీనితో ఈ గ్రామ చరిత్ర పుటల నుంచి కనుమరుగు అయ్యే ప్రమాదమూ లేకపోలేదు. ఈ విషయాన్ని ఆలస్యంగా నైనా గ్రహించిన జిల్లా మేధావి వర్గం, కోటి లింగాలను పరిరక్షించే చర్యలు గైకొనాలని గత ప్రభుత్వానికి విన్నవించింది. రాష్ట్ర రాజధాని నుండి సైతం ఈ అంశంపై అవగాహన కలిగిన దివంగత ప్రభుత్వ సలహాదారు విద్యాసాగర్ రావు, మల్లేపల్లి లక్ష్మయ్య, ఆచార్య జయధీర్ తిరుమల రావు, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజిరెడ్డి, ఐకాస కన్వీనర్ కోదండరాం, తెలంగాణ జాగృతి వ్యవస్థాపకులు కవిత, కుర్రా జితేంద్ర బాబు, జైకిషన్, కవి గాయకులు దేశపతి శ్రీనివాస్ లాంటి మేధావులను రప్పించి, కోటిలింగాల పరిస్థితిని ప్రత్యక్షంగా చూపించి, తద్వారా గత ప్రభుత్వం దృష్టి ఆకర్షించి, పరిరక్షిం చే ప్రయత్నం చేసింది. అపురూప నాణేలు లభ్యమైన కోటిలింగాల గ్రామం ఖాళీ అయితే, త్రవ్వకాలకు మరింత సానుకూలత ఉండగలదనే ప్రతిపాదన అందుకున్న రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ చెన్నారెడ్డి అందుకు సానుకూలంగా స్పందించి, కోర్ కమిటీ నిర్ణయాన్ని అనుసరించి తవ్వకాలు జరిపేలా కృషి సల్పగలమని ప్రకటించి నామమాత్రపు తవ్వకాలు చేపట్టి చేతులెత్తేయడం జరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు ముంపుకు గురికాకుండా ఆలంపూర్ లో నిర్మించినట్లు, కోటిలింగాల పరిర క్షణ గోడలు నిర్మించాలనే ప్రతిపా దన చాలా కాలంగా కాగితాలకే పరిమిత మైంది. గతంలో నాటి సంబంధిత మంత్రి పొన్నాల లక్ష్మయ్య వద్ద ప్రతిపాదనలు ఉన్నా, పట్టించు కోలేదు. తెరాస ప్రభుత్వ సంబంధిత కార్యదర్శి వెంకటేశం దర్శించి, తగు చర్యలు తీసుకునేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. ఇలా ఉంటే తెరాస ప్రభుత్వంలో నాటి మంత్రి, ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ చొరవ కృషి, కృత నిశ్చయం ఫలితంగా, పర్యాటక శోభను సంతరింప చేయాలనే తపన కారణంగా, 2018 జనవరి 6వ తేదీన నాటి ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ ల చేతుల మీదుగా రెండు బోట్లను ప్రారంభించారు. 50 సీట్ల కెపాసిటీతో "శాతకర్ణి", 25 సీట్లు కెపాసిటీ గల "పులోమావి" తో పాటు 4 సీటర్ల స్పీడ్ బోట్ ను ప్రారంభించారు. పర్యాటక సంబంధంగా ఎంతో చేయాల్సి ఉంది. రాష్ట్ర చరిత్రతో విడదీయ రాని సహస్రా బ్దుల సంబంధాన్ని కలిగిన అపు రూప చారిత్రక బంధాన్ని తత్సం బంధ ఆధారాలను పరిరక్షిం చి, గోదావరి వద్ద రక్షణ గోడ నిర్మిం చి, కోటిలింగాల ఉనికిని కరు మరుగు కాకుండా ఉండగలం దులకు ప్రత్యేక చర్యలు చేపట్టా ల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉన్నాయి.

# అమ్మాయిలంటే పవర్, బాధ్యత కాదు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. బాలికలు కేవలం బాధ్యత మాత్రమే కాదని,వారు దేశ నిర్మాణంలో బలమైన శక్తి అని, మహిళలు భారతదేశ ప్రగతికి ముందుండి నడిపిస్తున్నారంటూ ఎక్స్‌లో ఒక సందేశాన్ని పోస్ట్ చేశారు. అందరికీ జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన హోంమంత్రి బాలికలు కేవలం మన బాధ్యతలు మాత్రమే కాదు, వారు అపారమైన శక్తి అన్నారు. రాణి లక్ష్మీబాయి, రాణి వేలు నాచియార్, మూలా గభారు , ప్రీతిలత వాడేదార్ వంటి వారు ప్రతి భారతీయుడి హృదయాన్ని గర్వంతో ,స్ఫూర్తితో నింపుతారు.” అని ట్వీట్ చేశారు. భారతదేశ అభివృద్ధి గాథలో మహిళల పాత్రను ప్రశంసిస్తూ మోడీ ప్రభుత్వ మహిళా నేతృత్వ అభివృద్ధి మంత్రం నారీ శక్తిని ప్రగతిలో అగ్రస్థానంలో నిలబెట్టిందనీ, నేడు మహిళలు దేశ అభివృద్ధికి నాయకత్వం వహిస్తున్నారని పేర్కొన్నారు.



**నేషనల్ గర్ల్ ఛైల్డ్ డే- లక్ష్యాలు**

ఆధునిక సమాజంలో ఇప్పటికీ బాలికలకు సమ ప్రాధాన్యత లభించంలేదు.ఈ వివక్షను తొలగించి, ఆడపిల్లలకు కూడా అబ్బాయిలతో సమానంగా ఆహారం, విద్య, గౌరవం దక్కాలనేది ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం.

బాలికల డ్రాపౌట్ రేటును తగ్గించి, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడం ఈ కాన్సెప్ట్‌లో కీలక భాగం. విద్యాపరంగా వారు సాధికారత సాధించినపుడే ఆర్థికంగా కూడా వారు సాధికారత సాధించగలరు.

ఆడపిల్లలపై జరుగుతున్న దాడులు, వేధింపులు మరియు బాల్య వివాహాలను అరికట్టడం.

ఉద్యోగం, వివాహం, ఆరోగ్యం తదితర అంశాలో స్వయం నిర్ణయం తీసుకునేలా తామే తీసుకునేలా వారిని శక్తివంతులను చేయడం. స్వతంత్రులుగా తీర్చిదిద్దడం.

లింగ నిష్పత్తి ఆడపిల్లల సంఖ్యను పెంచడం మరియు భ్రూణహత్యలను అరికట్టడం.

“బేటీ బచావో - బేటీ పఢావో“ అనే నినాదం ఇందులోభాగంగా వచ్చిందే.

అలాగే బాలికల రక్షణ కోసం, వారి సంక్షేమం కోసం కొన్ని చట్టాలు కూడా ఉన్నాయి.

బాల్య వివాహాల నిషేధ చట్టం, 2006

లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ (పోక్సో) చట్టం, 2012

జువైనల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ మరియు రక్షణ) చట్టం, 2015

వీటితోపాటు చైల్డ్ హెల్ప్‌లైన్ మరియు ట్రాక్ చైల్డ్ పోర్టల్ వంటి సేవలను అందిస్తుంది, ఇది తప్పిపోయిన పిల్లలను రక్షించేందుకు ఉద్దేశించినవి.

# అమెరికాలో మంచు తుపాను విలయతాండవం



అమెరికా చరిత్రలోనే అత్యంత తీవ్రమైన మంచు తుపానుల్లో ఒకటి దేశాన్ని అతలాకుతలం చేస్తోంది. టెక్సాస్ నుంచి న్యూ ఇంగ్లాండ్ వరకు సుమారు 2,000 మైళ్ల విస్తీర్ణంలో ఈ తుపాను ప్రభావం చూపుతుండటంతో అగ్రరాజ్యం గజగజ వణికిపోతోంది. దాదాపు 20 కోట్ల మందికి పైగా ప్రజలు శీతల వాతావరణం, మంచు హెచ్చరికల నీడలో జీవిస్తున్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాషింగ్టన్ డీసీతో పాటు అలబామా, జార్జియా, కెంటకీ, న్యూయార్క్, టెక్సాస్ సహా 16కు పైగా రాష్ట్రాలు ఇప్పటికే ‘స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ‘ని ప్రకటించాయి. ఆర్కిటిక్ ప్రాంతం నుంచి పోలార్ వోర్టెక్స్ కారణంగా దూసుకొస్తున్న అతి శీతల గాలులు, శక్తివంతమైన తుపాను వ్యవస్థతో కలవడంతో ఈ విపత్కర పరిస్థితి ఏర్పడింది. దీని ఫలితంగా దేశంలోని తూర్పు భాగమంతా భారీ హిమపాతం, గడ్డకట్టే వర్షం (ఫ్రీజింగ్ రెయిన్), స్లీట్ (మంచుతో కూడిన వర్షం)తో అల్లకల్లోలంగా మారింది. ముఖ్యంగా సదరన్ ప్లెయిన్స్, లోయర్ మిసిసిపీ వ్యాలీ, టెన్నెస్సీ వ్యాలీ, ఆగ్నేయ రాష్ట్రాల్లో కొన్నిచోట్ల “విపత్తు స్థాయి“లో మంచు పేరుకుపోయే ప్రమాదం ఉందని జాతీయ వాతావరణ సేవల విభాగం (ఎన్‌డబ్ల్యూఎస్) హెచ్చరించింది. “ఇది చాలా తీవ్రమైన తుపాను“ అని యూఎస్ వెదర్ ప్రిడిక్షన్ సెంటర్ వాతావరణ శాస్త్రవేత్త జాకబ్ ఆషర్‌మాన్ అభివర్ణించారు. ఈ మంచు తుపాను కారణంగా దేశవ్యాప్తంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. విమాన ప్రయాణాలపై తీవ్ర ప్రభావం పడింది. ఫ్లైట్ అవేర్ డేటా ప్రకారం, ఈ వారాంతంలో (శని, ఆదివారాలు) ఇప్పటివరకు 8,000కు పైగా విమానాలను రద్దు చేశారు. డెల్టా, అమెరికన్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ వంటి ప్రధాన సంస్థలు ప్రయాణ హెచ్చరికలు జారీ చేసి, టికెట్ మార్పు రుసుములను రద్దు చేశాయి. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) కూడా టెక్సాస్ నుంచి ఈశాన్య రాష్ట్రాల వరకు పలు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోవచ్చని హెచ్చరించింది. మంచు ప్రభావం కేవలం ప్రయాణాలకే పరిమితం కాలేదు. గడ్డకట్టే వర్షం కారణంగా విద్యుత్ తీగలపై అంగుళం మందం వరకు మంచు పేరుకుపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల విద్యుత్ లైన్లు తెగిపోయి, చెట్లు కూలిపోయి సుదీర్ఘకాలం పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెక్సాస్‌లో ఇప్పటికే దాదాపు 20,000 మంది, ఓక్లహోమా, ఆర్కాన్సాస్‌లలో వేలాది మంది విద్యుత్ లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. 2021 నాటి విద్యుత్ సంక్షోభం నుంచి పాఠాలు నేర్చుకున్నామని, ఈసారి విద్యుత్ గ్రిడ్‌ను సిద్ధంగా ఉంచామని టెక్సాస్ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ దాదాపు 30 సహాయక బృందాలను సిద్ధంగా ఉంచింది. ఆహారం, దుప్పట్లు, జనరేటర్లను కీలక ప్రాంతాలకు తరలించింది. పలు రాష్ట్రాల్లో నేషనల్ గార్డ్ దళాలను మోహరించారు. వాషింగ్టన్ డీసీ మేయర్ మురియల్ బౌజర్ మాట్లాడుతూ, “మేము అధికారికంగా స్నో ఎమర్జెన్సీ, స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీని ప్రకటించాం“ అని తెలిపారు. చికాగోలో పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, లూసియానాలో కార్నివాల్ పరేడ్‌లు, నాష్‌విల్లేలో పలు కార్యక్రమాలు రద్దయ్యాయి. ఈ తుపాను సోమవారం వరకు కొనసాగి, న్యూయార్క్, బోస్టన్ వంటి ప్రధాన నగరాలపై ప్రభావం చూపనుంది. తుపాను తగ్గుముఖం పట్టినా, ఆ తర్వాత కూడా అత్యంత శీతల గాలులు, ప్రమాదకరమైన వాతావరణం కొనసాగుతుందని, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ఈసారి రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్ డెర్ లేయెన్



భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ శనివారం ఢిల్లీకి చేరుకున్నారు. ఆమెతో పాటు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో లూయిస్ శాంటోస్ డా కోస్టా కూడా ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటన ఇరుపక్షాల సంబంధాలలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది. ఢిల్లీ విమానాశ్రయంలో ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌కు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద స్వాగతం పలికారు. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్యాలైన భారత్, ఈయూల మధ్య పరస్పర విశ్వాసం, భాగస్వామ్య విలువలతో బంధం బలపడుతోందని భారత విదేశాంగ శాఖ ఈ సందర్భంగా ఎక్స్ లో పేర్కొంది. ఈ పర్యటనలో భాగంగా ఈయూ విదేశాంగ విధాన చీఫ్ కజా కల్లాస్ కూడా ఢిల్లీకి వచ్చారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అనిశ్చితి నెలకొన్న తరుణంలో ఈయూ నేతల పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. కొద్ది రోజుల క్రితం విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈయూ దేశాల రాయబారులతో సమావేశమయ్యారు. బలమైన భారత్–ఈయూ భాగస్వామ్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించగలదని, సరఫరా గొలుసులను పటిష్టం చేయగలదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు వస్తున్న ఈయూ నేతలు.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అవుతారు. జనవరి 27న జరగనున్న 16వ భారత్–ఈయూ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీతో కలిసి పాల్గొంటారు. ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య వాణిజ్యం, భద్రత, సాంకేతికత వంటి అంశాలపై కీలక చర్చలు జరగనున్నాయి. దీంతో పాటు భారత్–ఈయూ బిజినెస్ ఫోరమ్‌ను కూడా నిర్వహించనున్నారు.

## ‘సర్’తో బీజేపీకే లాభం..

## తగినంత సమయం ఇవ్వాలి: అమర్త్య సేన్

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)తో ముస్లింలకు అన్యాయం జరుగుతుందని, దీనివల్ల బీజేపీకే లాభం కలుగుతుందని నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్య సేన్ అన్నారు. శనివారం ఆయన ఒక మీడియా సంస్థతో మాట్లాడారు. ఈ సందర్భంగా సర్ చేపడుతున్న తీరును తప్పుబట్టారు. నకిలీ ఓట్లను తొలగించేందుకు, అర్హులైన ఓటర్లను గుర్తించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే (సర్) చేపట్టిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ఓటర్లు తమకు సంబంధించిన డాక్యుమెంట్లను సమర్పించాలి. అన్ని డాక్యుమెంట్లు సరిగ్గా ఉంటేనే ఓటరుగా నమోదు చేస్తారు. లేకుంటే ఓట్లను తొలగిస్తారు. దొంగ ఓట్లను గుర్తించేందుకు ఈ పని చేస్తున్నామని కేంద్ర ఎన్నికల సంఘం చెబుతుంటే.. బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించేందుకు ఈసీ ఈ పని చేస్తోందని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇప్పుడు ‘సర్’ అంశంపై ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీత అమర్త్య సేన్ స్పందించారు. ఆయనకు కూడా ఈసీ ఇటీవల ‘సర్’ గురించి నోటీసులు జారీ చేసింది. అంటే.. ఆయన వయసుకు, తన తల్లి వయసుకు మధ్య 15 ఏళ్లు మాత్రమే తేడా ఉండటంపై ఈసీ వివరణ కోరింది. ఇందుకు తగిన డాక్యుమెంట్లు సమర్పించాలని సూచించింది. ఈ నేపథ్యంలోనే ‘సర్’పై అమర్త్య సేన్ స్పందించారు. “పశ్చిమ బెంగాల్ లో ‘సర్’ వేగంగా చేపట్టడం వల్ల ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఉంది. ప్రజలు వేగంగా తగిన డాక్యుమెంట్లు సమర్పించాలని సూచించారు. ఇది అందరికీ వీలుకాదు. చాలామంది దగ్గర డాక్యుమెంట్లు లేవు. గ్రామీణ ప్రాంతాల్లో నా దగ్గరే బర్త్ సర్టిఫికెట్ లేదు. డాక్యుమెంట్లు సమర్పించకపోతే ఓటు హక్కు కోల్పోతారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయలేరు. దీనివల్ల ముస్లింలు, ఇతర అణగారిన వర్గాలు అన్యాయానికి గురయ్యే అవకాశం ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ‘సర్’ ప్రక్రియ మంచిదే. కానీ, దీనికి తగినంత సమయం ఇవ్వాలి.

## భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది



భారతదేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం మనదని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో 18వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశం సంస్కరణల దిశగా ముందుకు సాగుతోందని, ఇందుకోసం వివిధ దేశాలతో వాణిజ్య, మొబిలిటీ రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు. తద్వారా భారతీయ యువతకు ప్రభుత్వం అనేక అవకాశాలను సృష్టిస్తోందని ఆయన అన్నారు. యువతకు ఉద్యోగం లక్ష్యంగా ప్రారంభమైన రోజ్‌గార్ మేళా కార్యక్రమం ఇప్పుడు ఒక సంస్థగా రూపాంతరం చెందిందని అన్నారు. రోజ్‌గార్ వేదికగా దేశంలోని లక్షలాది మంది ఉద్యోగాలు పొందారని ఆయన వెల్లడించారు. యువతకు సరైన, సమగ్ర అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని, దీని ద్వారా దేశ, విదేశాల్లో ఉన్న భారతీయ యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

## గవర్నర్ పదవిని అవమానించారు



తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి పై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ విమర్శలు చేశారు. తమిళనాడు అసెంబ్లీలో స్టాలిన్ ప్రసంగిస్తూ.. సమావేశాలు ప్రారంభమైన మొదటిరోజున ఆర్ఎన్ రవి ప్రసంగించకుండా గవర్నర్ పదవిని అవమానించారన్నారు. గతంలో ఏ గవర్నర్లు కూడా ఇలా ప్రవర్తించలేదని అసహనం వ్యక్తంచేశారు. మాజీ సీఎంలు అన్నాదురై, కరుణానిధి, ఎం.జి.రామచంద్రన్, జయలలిత చూడని రాజకీయ సంక్షోభాన్ని తాను ఎదుర్కొంటున్నానని అన్నారు. ఇటువంటి సంక్షోభాలు తనకు కొత్త కాదని, ఎన్నో సవాళ్లు ఎదురైనా వాటన్నింటినీ అధిగమించానని వెల్లడించారు. అసెంబ్లీ సమావేశం ప్రారంభంలో ప్రసంగాన్ని చదవకుండా, జాతీయ గీతాన్ని ప్లే చేయాలని గవర్నర్ పట్టుబట్టారని స్టాలిన్ పేర్కొన్నారు. ప్రసంగం ముగింపులో జాతీయ గీతాన్ని ప్లే చేస్తామని చెప్పినా వినకుండా సభ మధ్యలో వెళ్లిపోయారన్నారు. తన స్థానాన్ని గౌరవించని వారు దేశభక్తి గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దేశభక్తి గురించి తమకు ఎవరూ పాఠాలు చెప్పనక్కర్లేదన్నారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదం.. ఎయిరిండియాకు రూ.1,100కోట్ల బీమా సొమ్ము..! ఇటీవల జరిగిన తమిళనాడు తొలి శాసనసభ సమావేశంలో తన ప్రసంగాన్ని చదవకుండానే గవర్నర్ ఆర్.ఎన్.రవి సభ నుంచి నిష్క్రమించారు. తమిళ తల్లి ప్రార్థనా గీతం పూర్తవగానే జాతీయగీతం ఆలపించకుండా ఆ గీతాన్ని, ప్రసంగ సమయంలో పలుమార్లు మైక్ కట్ చేసి తనను అవమానించారని గవర్నర్ పేర్కొన్నారు. అందుకే సభ నుంచి బయటకు వచ్చేసినట్లు వివరణ ఇచ్చారు. కాగా ఆర్.ఎన్.రవి శాసనసభ సమావేశాల నుంచి బయటికెళ్లడం వరసగా ఇది నాలుగోసారి.

## జపాన్‌లోనూ మన యూపీఐ సేవలు

భారతదేశపు విజయవంతమైన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) తన సేవలను మరో దేశానికి విస్తరించనుంది. నిక్కీ ఆసియా నివేదిక ప్రకారం, త్వరలో జపాన్‌లో కూడా యూపీఐ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం జపాన్‌కు చెందిన ప్రముఖ ఐటీ సంస్థ ఎన్‌టీటీ డేటా... నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. జపాన్‌కు వెళ్లే భారత పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో వారికి చెల్లింపులను సులభతరం చేయడమే ఈ చర్య ముఖ్య ఉద్దేశం. 2025లో సుమారు 3.15 లక్షల మంది భారతీయులు జపాన్‌ను సందర్శించారు. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 35 శాతం అధికం. ఈ క్రమంలో, 2026 ఆర్థిక సంవత్సరంలో జపాన్‌లో యూపీఐ ట్రయల్స్ నిర్వహించాలని ఎన్‌టీటీ డేటా, ఎన్‌పీసీఐ ప్రణాళికలు రచిస్తున్నాయి. ఈ వ్యవస్థ అమల్లోకి వస్తే, భారత పర్యాటకులు జపాన్‌లోని దుకాణాల్లో తమ యూపీఐ యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నేరుగా చెల్లింపులు చేయవచ్చు. ఈ మొత్తం వారి భారత బ్యాంకు ఖాతాల నుంచి డెబిట్ అవుతుంది. భారత్, జపాన్ పేమెంట్ నెట్‌వర్క్‌లను అనుసంధానించే ప్రక్రియపై ఇరు సంస్థలు పనిచేస్తున్నాయి. 2016లో ప్రారంభమైన యూపీఐ, భారత్‌లో అత్యంత ప్రజాదరణ పొందింది. ఇప్పటికే భూటాన్, సింగపూర్, ఫ్రాన్స్, యూఏఈ సహా 8 దేశాల్లో యూపీఐ సేవలను ప్రవేశపెట్టారు. ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ పేమెంట్ సిస్టమ్‌గా అంతర్జాతీయ ద్రవ్య నిధి యూపీఐని అభివర్ణించిన విషయం తెలిసిందే.

## ఒకటి నుంచి 50 వరకూ రాయలేదని..



ఫరీదాబాద్: హర్యానాలోని ఫరీదాబాద్‌లో సభ్య సమాజం తలదించుకునే అమానుష ఘటన వెలుగు చూసింది. కేవలం హోంవర్క్ చేయలేదన్న చిన్న కారణంతో ఓ కసాయి తండ్రి తన నాలుగేళ్ల కూతురిని అతి కిరాతకంగా హతమార్చాడు. బల్లబ్‌గఢ్‌కు చెందిన కృష్ణ జైస్వాల్ (31) తన కుమార్తె వంశిక (4) హోంవర్క్‌లో ఒకటి నుండి 50 వరకు అంకెలు రాయలేకపోయిందన్న కోపంతో విచక్షణ కోల్పోయాడు. చపాతీలు చేసే కర్రతో విచక్షణారహితంగా కొట్టడంతో ఆ చిన్నారి కుప్పకూలిపోయింది. అనంతరం, నిందితుడు ఈ హత్యను ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించాడు. తీవ్రంగా గాయపడిన కుమార్తెను బల్లబ్‌గఢ్‌లోని సివిల్ ఆసుపత్రికి తీసుకువెళ్లి, మెట్లపై నుంచి జారిపడిందని వైద్యులను నమ్మించే ప్రయత్నం చేశాడు. ఆమె శరీరంపై పలు గాయాలు, ఫ్రాక్చర్లు, తలకు తీవ్రమైన దెబ్బలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తొలుత ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ మార్చురీకి తరలించారు. ఈ ఘాతుకం జరిగిన సమయంలో ఇంట్లోనే ఉన్న నిందితుని ఆరేళ్ల కుమారుడు నిజాన్ని బయటపెట్టాడు. తన సోదరి అంకెలు రాయలేకపోయినందుకు తండ్రి ఎలా కొట్టాడో ఆ బాలుడు తన తల్లికి, ఆపై పోలీసులకు వివరించాడు. భార్య ఫిర్యాదు, బాలుని వాంగ్మూలం ఆధారంగా నిందితుడు కృష్ణ జైస్వాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, అరెస్టు చేసిన పోలీసులు అతనిని ఫరీదాబాద్ కోర్టులో హాజరుపరిచారు. తదుపరి విచారణ నిమిత్తం న్యాయస్థానం అతడిని ఒక రోజు పోలీస్ రిమాండ్‌కు పంపింది.

# ఎన్నికల షెడ్యూల్ విడుదలకు రంగం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

తెలిసిందే. ఫిబ్రవరి 11 తేదీ పోలింగ్‌కు అనుకూలంగా భావిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ మేరకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన 15 రోజుల్లో ఎన్నికలు జరుగుతాయి. ఆ తర్వాత రెండు రోజులకు ఫలితాలను వెల్లడించనున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లాల వారీగా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎన్నికల సంఘం, చివరగా శుక్రవారం ఉమ్మడి రంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలోని జిల్లా కలెక్టర్లతో సమావేశమై ఏర్పాట్లపై దిశానిర్దేశం చేసింది. శనివారం సాధారణ ఎన్నికల పరిశీలకులతో, సాయంత్రం ఎన్నికల వ్యయ పరిశీలకులతో ఎస్ఈసీ సమావేశం కానుంది.

**ఎన్నికల బరిలో నిలించేందుకు అర్హతలు**

అభ్యర్థి ఎన్నికల బరిలో పోటీ చేయాలంటే అర్హతలు, వ్యయ పరిమితి ఇతర అంశాలపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. పోటీలో నిలిచే వారు భారత పౌరులై ఉండాలి. వారికి కనీసం 21 ఏళ్లు నిండి ఉండాలని తెలిపింది. కార్పొరేటర్‌గా పోటీ చేస్తుంటే కార్పొరేషన్ పరిధిలోని ఏదైనా డివిజన్, కౌన్సిలర్‌గా పోటీ చేస్తుంటే ఆ మున్సిపాల్టీ పరిధిలోని ఏదైనా వార్డులో ఓటరుగా ఉండాలని వెల్లడించింది. పోటీ చేసే అభ్యర్థి ఆయా నగర లేదా మున్సిపాలిటీల్లో కాంట్రాక్టర్‌గా ఉండకూడదు. నగర లేదా పురపాలికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఆదాయం వచ్చే లాభదాయక పదవులు చేపట్టకూడదని స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు నుంచి తొలగించి ఉంటే ఎన్నికల్లో పోటీకి అనర్హులని ఎన్నికల సంఘం పేర్కొంది. గతంలో పోటీ చేసి ఎన్నికల వ్యయ వివరాలు సమర్పించనందుకు ఎన్నికల సంఘం అనర్హులుగా ప్రకటించిన వారు, ఐపీ పెట్టిన వారు పోటీ చేయరాదని తెలిపింది. పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థికి సంబంధిత పార్టీ నుంచి బీఫామ్ ఉండాలని చెప్పింది. నామినేషన్ల ఉపసంహరణ చివరి తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు రిటర్నింగ్ అధికారికి బీఫాంను అందించాల్సి ఉంటుందని స్పష్టం ఎస్ఈసీ చేసింది. పార్టీ అభ్యర్థిని స్థానిక వార్డు లేదా డివిజన్‌లోని ఒక ఓటరు ప్రతిపాదించాల్సి ఉండగా, ఒక అభ్యర్థికి ప్రతిపాదించిన వ్యక్తి మరో అభ్యర్థికి ప్రతిపాదించరాదని మార్గదర్శకాల్లో పేర్కొంది.

**కొత్త ఓటర్ల నమోదు**

పుర ఎన్నికలు వచ్చే నెల రెండో వారంలో ఉంటాయనే ప్రచారం నేపథ్యంలో ప్రస్తుత ఓటర్ లిస్ట్‌లో లేని వారిని గుర్తించి కొత్తగా ఓటర్లను నమోదు చేసేందుకు ఆశావహులు కసరత్తు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలు, గ్రామాల్లో ఉన్న వారిని పట్టణాల్లోకి మార్చే పనిలో వారంతా తలమునకలై ఉన్నారు. ఆధార్ తదితర వివరాలను సేకరించి మీసేవ కార్యాలయాలు, ఆన్‌లైన్ సెంటర్లలో నమోదు చేసుకుంటున్నారు. అయితే దీనికి ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వాల్సి ఉంది. దీనికి అదనంగా ఓటరు జాబితా వస్తోంది. దాని ఆధారంగానే కొత్తగా నమోదు చేసుకున్న వారు ఓటు వేసేందుకు వీలు ఉండనుంది. పల్లె ప్రాంతాల్లో, సొంతూరులో ఉన్న వారికి సంబంధించి పట్టణాల్లోనూ రెండు చోట్ల ఓటరుగా ఉన్నారు. ఉద్యోగ, పిల్లల చదువులు, వ్యాపారాలు చేసుకునే వారికి సొంతంగా ఇళ్లు, అద్దె ఇళ్లలో ఉంటున్నారు. వీరంతా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అక్కడ ఓటు వేస్తున్నారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో ఇక్కడా ఓటు వేయనున్నారు.

# దావోస్ వేదికగా రాచబాట

-మొదటిపేజీ తరువాయి

పాల్గొన్నారు. ప్రతి ఏటా హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దావోస్ పర్యటన ముగియడంతో అమెరికాకు సీఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్‌కు మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి బయలుదేరారు.
దావోస్ వేదికగా జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో ప్రభుత్వ ఒప్పందాలు నగర ప్రతిష్ఠను మరింత పెంచనున్నాయి. రాష్ట్రంలో భారీ పెట్టుబడులతో ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు భాగ్యనగరంలో నెలకొల్పనున్న కార్యాలయాలు, ఆర్థిక కార్యకలాపాలను విస్తృతం చేయడంతో పాటు ఉపాధి, ఉద్యోగావకాశాలను భారీగా పెంచనున్నారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో పెట్టుబడుల ఆకర్షణలో నగరం ప్రత్యేకతను చాటుకుంది.

**ఆర్‌ఆర్‌ఆర్ పనులు వేగవంతం**

దీంతో ప్రముఖ సంస్థలు పరిశోధన, ఉత్పాద కేంద్రాల ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవంతో పాటు అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన తోడ్పాటు అందించేందుకు ఆసక్తి చూపాయి. నగర ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు ఉపయోగపడే అంశాలతో పాటు మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఆర్‌ఆర్‌ఆర్ పనులూ వేగవంతం అవుతాయని ప్రభుత్వం తెలిపింది. అలాగే స్కిల్ యూనివర్సిటీతో కలిసి పని చేసేందుకు విదేశాలు ముందుకు వచ్చాయి. అయితే ప్రధానంగా కృత్రిమ మేధకు సంబంధించి పరిశోధన కేంద్రాల ఏర్పాటుపై ఎక్కువ ఆసక్తి చూపాయి.

**గ్లోబర్ ఏఐ వేదికగా పలు సంస్థలతో ఒప్పందాలు**

దావోస్‌లో తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ వేదికగా ప్రభుత్వం పలు సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న గ్లోబల్ ఏఐ అకాడమీతో కలిసి పని చేసేలా బ్రిటన్‌కు చెందిన ప్రముఖ విద్యా, పబ్లిషింగ్ సంస్థ పియర్సన్ ఎంఓయూ కుదుర్చుకుంది. ఏఐ శిక్షణ, పాఠ్య ప్రణాళిక, లెర్నింగ్ కంటెంట్, అంచనా విధానాలు, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్లలో తన నైపుణ్యాన్ని పియర్సన్ ఉపయోగించనుంది. జార్జ్‌టౌన్ యూనివర్సిటీకి చెందిన ఏఐ కోల్యాబ్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఆరోగ్య రంగంలో ఏఐ ఆధారిత పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆరోగ్య సంరక్షణ, ప్రజారోగ్యం, లైఫ్




సైన్సెస్ రంగాల్లో అనువర్తిత పరిశోధనలకు ఇది దోహదపడనుంది. దుబాయ్ మల్టీ కమోడిటీస్ సెంటర్‌తో కుదిరిన ఎంఓయూ ద్వారా స్టార్టప్‌ల అభివృద్ధికి అవకాశాలు అన్వేషించనున్నారు. రెండు దేశాల మార్కెట్లు, ఎకోసిస్టమ్‌లపై అవగాహన కల్పించడంతో పాటు, అంతర్జాతీయ సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించనున్నారు.

**ఏయే సంస్థలు రానున్నాయంటే :**

కాలిఫోర్నియా బ్లేజ్ సంస్థ నగరంలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) కేంద్రాన్ని విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఎలక్ట్రానిక్స్, చిప్ డిజైన్ రంగాలకు ఇది దోహదపడనుంది.
విమానయాన రంగంలో మెయింటనెన్స్ అండ్ రిపేర్ యూనిట్ ఏర్పాటుకు సర్గాడ్ సంస్థ ముందుకు వచ్చింది. మూడేళ్లలో రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.
దిగ్గజ సంస్థ యూనిలివర్ తన గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ ఏర్పాటుతో అంతర్జాతీయ కార్యకలాపాల కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది.
ప్రముఖ సౌందర్య సాధనాల సంస్థ లోరియల్ మొదటి అంతర్జాతీయ ఏఐ బ్యూటీ టెక్ హబ్‌ను స్థాపించనుంది. ఏఐ ఆధారంగా సౌందర్య సాధనాలు, చర్మంపై పరిశోధనలు చేస్తుంది. దాదాపు 2 వేల మంది ఏఐ నిపుణులు, టెక్ ఇంజినీర్లు, డేటా సైంటిస్టులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా.
దిగ్గజ సంస్థ యూనిలివర్ తమ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటుతో అంతర్జాతీయ కార్యకలాపాల కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది.
పియర్సన్ సంస్థ కాలేజీ విద్యార్థులకు, ఉద్యోగులకు ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్‌లో కోర్సులందిస్తుంది.
నివిడియా క్లౌడ్ మౌలిక సదుపాయాల కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది.
హైదరాబాద్‌లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను స్వచ్ఛమైన ఇంధనంతో తీర్చడానికి మార్గం సుగమం చేసేలా స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ ప్రాజెక్టులపై చర్చలు జరిగాయి.
క్రీడా మైదానాలను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు ఏఐ డేటా సెంటర్లు, సెమీ కండక్టర్, ఎలక్ట్రిక్ వాహన రంగాల్లో కొత్త పరిశ్రమల పట్ల టాటా సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది.
నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ-వోల్ట్ సంయుక్తంగా ఫ్యూచర్ సిటీలో రూ.5,000 కోట్లతో 100 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐ రెడీ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చాయి.

# హైదరాబాద్‌లో వాహనాల సరాసరి వేగం ఇది

**రద్దీ వేళల్లో 16.1 కి.మీలకు తగ్గుతున్న పరిస్థితి**
**లెక్కకట్టిన అంతర్జాతీయ సంస్థ టామ్ టామ్**
**ప్రపంచ వ్యాప్తంగా 500 సిటీల్లో కంజెక్షన్ సర్వే**
**హైదరాబాద్ నగరానికి 47వ ర్యాంక్**
**2025లో మెరుగుపడిన స్థితిగతులు**



**హైదరాబాద్:** పెరుగుతున్న వాహనాల సంఖ్య.. ఆక్రమణలతో కుంచించుకుపోతున్న రహదారులు.. వాహన చోదకులు, వ్యాపారుల్లో కొరవడిన స్పృహ.. ఇలా ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఉన్నా... నగరంలో ట్రాఫిక్ చిక్కులు (కంజెక్షన్) మాత్రం తగ్గుతున్నాయి. 2024తో పోలిస్తే 2025లో పరిస్థితులు కొంత మెరుగుపడ్డాయి. కంజెక్షన్ 1.6 పర్సెంటేజ్ పాయింట్స్ తగ్గింది. అలాగే సరాసరి వేగం సాధారణ సమయంలో గంటకు 18.4 కి.మీ, రద్దీ వేళల్లో 16.1గా నమోదైంది. అంతర్జాతీయ సంస్థ టామ్ టామ్ ఈ విషయం ప్రకటించింది. ఈ సంస్థ స్లో మూవింగ్ ట్రాఫిక్ ఇండెక్స్‌ను విడుదల చేసింది. హైదరాబాద్ 2024లో అంతర్జాతీయ స్థాయిలో 18వ ర్యాంక్‌లో ఉండగా.. నిరుడు 47వ స్థానానికి వెళ్లింది. ఎంత తక్కువ ర్యాంక్‌లో ఉంటే అంత ఎక్కువ ట్రాఫిక్ చిక్కులు ఉన్నట్లు లెక్క. ఈ కారణంగానే బెంగళూరు అంతర్జాతీయ స్థాయిలో రెండు, జాతీయ స్థాయిలో తొలి స్థానంలో నిలిచింది. హైదరాబాద్ రోడ్లపై ఓ వాహనం 10 కిలోమీటర్లు వెళ్లాలంటే సరాసరిన 32.37 నిమిషాలు పడుతోంది.

**విస్తృతంగా సర్వే**

62 దేశాల్లోని 500 నగరాల్లో టామ్ టామ్ సంస్థ సర్వే చేపట్టింది. ఆయా నగరాల జనాభా, అక్కడి వాహనాల సంఖ్య, రోడ్ల శాతం, ట్రాఫిక్ సిబ్బంది సంఖ్యను విశ్లేషించింది. ప్రపంచంలోని ఇతర నగరాలను పోలుస్తూ ర్యాంకింగ్స్ ఇచ్చింది. హైదరాబాదీలు ఏడాదికి 123 పని గంటలు నష్టపోతున్నట్లు లెక్కకట్టింది.

**ఆగస్టు 30... దారుణమైన రోజు..**

హైదరాబాద్‌లో 2025లో అత్యంత దారుణమైన రోజు ఆగస్టు 30. ఇతర రోజుల్లో సరాసరిన 15 నిమిషాల్లో ఓ వాహనం 4.6 కిమీ ప్రయాణిస్తే.. ఆ రోజు మాత్రం 3.3 కి.మీకే పరిమితమైంది. బేగంపేట, సోమాజిగూడ, పంజాగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేట, బంజారాహిల్స్, హిమాయత్‌నగర్, మెహిదీపట్నం తదితరాలు తీవ్రమైన ట్రాఫిక్ జామ్స్ ఉండే ప్రాంతాలుగా నమోదయ్యాయి. ఏదైనా నగరంలో ట్రాఫిక్ నిర్వహణ మెరుగ్గా ఉందా? లేదా? అనేది తేల్చడానికి వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. కేవలం వాహనాల సరాసరి వేగం ఆధారంగా ట్రాఫిక్ స్థితిగతుల్ని అంచనా వేయకూడదు. ఇందులో రోడ్ల వెడల్పు, బాటిల్‌నెక్స్, మౌలిక సదుపాయాలు.. ఇలా అనేకం ముడిపడి ఉంటాయి. కంజెక్షన్ శాతం ఆధారంగానే దీన్ని లెక్కకట్టాలి. ఇది ఎంత ఎక్కువ ఉంటే ట్రాఫిక్ చిక్కులు అంతలా ఉన్నట్లు. ఇది తక్కువగా నమోదవుతున్నప్పుడే పరిస్థితులు మెరుగుడుతున్నట్లు అంచనా వేయాలి.

## సింగరేణి ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే యత్నం

-మొదటిపేజీ తరువాయి

నైనీ కోల్‌బ్లాక్‌లకు బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పిలిచారు. సింగరేణిలో మొత్తం 25 కాంట్రాక్టులు జరిగితే.. 20 టెండర్లు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయి” అని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు రాతలు- విషపు రాతలు రాశారన్నారు. ఏ రాబందులు- గద్దలు- దోపిడీ దారుల ప్రయోజనాల కోసం కథనాలు వస్తున్నాయని ప్రశ్నించారు. తొలిపలుకుల రాతల వెనుక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయో చెప్పాలన్నారు. ప్రభుత్వంపై నిందలు మోపి రాష్ట్రానికి- సింగరేణికి నష్టం చేస్తున్నారని, రాధాకృష్ణ ఊహాగాన కథనాలు రాశారన్నారు. కథనం రాగానే ఒకాయన లేఖ రాశారు! ఇంకోగాయన స్పందించారన్నారు. వరుస ఎపిసోడ్స్ వెనుక ఆంతర్యం ఏంటి? అని భట్టి ప్రశ్నించారు. సింగరేణి నుంచి ఏ నిర్ణయంపై మంత్రి వద్దకు ఫైల్స్ రావని, సింగరేణి స్వతంత్ర బాడీ అని, సొంతంగా నిర్ణయాలు తీసుకుంటుదన్నారు. కనీస ఇంగితజ్ఞానం లేకుండా కథనం రాశారని భట్టి పేర్కొన్నారు. దీనిపై హరీశ్‌రావు లేఖ రాయడం, కిషన్ రెడ్డి విచారణ మొదలు పెట్టడం మంచిదయ్యిందన్నారు. కిషన్ రెడ్డి విచారణను తాను స్వాగతిస్తున్నానన్నారు. కొందరి ప్రయోజనాల కోసం పని చేసే వాళ్ల అన్ని విషయాలు బయటకు రావాలని భట్టి అన్నారు. సింగరేణి టెండర్లలో సైట్ విజిట్ తప్పనిసరి నిబంధన 2018లో కేంద్ర ప్రభుత్వమే పెట్టిందని, 2021లో సింగరేణి - కోల్ ఇండియా ఆధ్వర్యంలో టెండర్లు పిలిచారు సైట్ విజిట్ సర్టిఫికెట్ తప్పనిసరి చేశారని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లెకముందే సైట్ విజిట్ తప్పనిసరి అంటూ టెండర్లు పిలిచారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాత పద్ధతి ప్రకారమే టెండర్లు పిలిచారు. ఎన్ఎండీసీ 2021లో సైట్ విజిట్ తప్పనిసరి అంటూ టెండర్లు పిలిచారని భట్టి తెలిపారు. బిడ్డర్లు సైట్ విజిట్ చేయాలని నిబంధనలు ఉన్నాయి. హిందూస్తాన్ కాపర్స్ లిమిట్ ఆధ్వర్యంలో సైట్ విజిట్ తప్పనిసరి అంటూ టెండర్లు పిలిచారు. జీఐసీపీఎల్ సైట్ విజిట్ తప్పని అంటూ టెండర్లు పిలిచారు.గుజరాత్ లో సైట్ విజిట్ చేసినట్లు సర్టిఫికెట్ సబ్మిట్ చేసినట్లు సంతకాలు ఉన్నాయి. తమిళ నాడులో నవరత్న కంపెనీ సైట్ విజిట్ సర్టిఫికెట్ లతోనే టెండర్లు పిలిచారు. ఉత్తరాఖండ్‌లో సైనిక్ స్కూల్ టెండర్లలో సైట్ విజిట్ తప్పనిసరి చేస్తూ డిఫెన్స్ శాఖ లేఖలు ఉన్నాయని భట్టి పేర్కొన్నారు.

**రాధాకృష్ణపై భట్టి ఫైర్**

కేంద్ర ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన టెండర్లలో సైట్ విజిట్ తప్పనిసరి చేసిందని, మహారాష్ట్రలో డిపార్ట్మెంట్ ఎకనామిక్స్‌లో సైట్ విజిట్ తప్పనిసరి చేస్తూ టెండర్లు పిలిచారని, దీన దయాళ్ పోర్ట్ లో సైట్ విజిట్ అథారిటీ టెండర్లు పిలిచారని భట్టి తెలిపారు. జమ్ముకశ్మీర్ లో అక్కడి ప్రభుత్వం సైట్ విజిట్ తప్పనిసరి చేస్తూ టెండర్లు పిలిచిందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.

**ఆ విషయాన్ని స్వయంగా కేటీఆర్ అంగీకరించారు: జూపల్లి**

ఇదే మీడియా సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ అనేది ఎన్నో ఏళ్లుగా ఉందని.. కానీ, కేసీఆర్ హయాంలో మాత్రమే ఇది వివాదాస్పదమైందని చెప్పారు. నేతలు, వ్యాపారులు మాట్లాడుకున్నది కూడా దుర్మార్గంగా విన్నారని ఆరోపించారు. “కేసీఆర్ పాలనలో ఫోన్లలో మాట్లాడేందుకు బీఆర్ఎస్ నేతలే భయపడేవారు. ఫోన్ ట్యాపింగ్ చేస్తే.. చేసి ఉండొచ్చని స్వయంగా కేటీఆర్ అంగీకరించారు. ఈ కేసులో ఆయన్ను కేవలం సాక్షిగానే విచారణకు పిలిచారు. రాజకీయ కక్ష సాధించాలనుకుంటే.. ఇప్పటికే కేసీఆర్, కేటీఆర్ అరెస్టు అయ్యేవాళ్లు” అని మంత్రి జూపల్లి అన్నారు.


## కేసీఆర్, కేటీఆర్ నా ఛాలెంజ్‌కు సిద్ధమా?

**హైదరాబాద్:** కేటీఆర్, హరీశ్‌రావు సహా అందరినీ సాక్షులుగా పిలిస్తే... అసలు ఫోన్ ట్యాపింగ్ దోషులెవరని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ దొంగలను సాక్షులుగా పిలవడమేంటన్నారు. సిట్ విచారణను ప్రత్యక్షంగా, పరోక్షంగా మంత్రులు ప్రభావితం చేసినట్లేనని.. ఇప్పటికైనా సిట్‌కు స్వేచ్ఛ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి లొంగితే సిట్ అధికారులకు ఉన్న క్రెడిబిలిటీ పోతుందన్నారు. కేటీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదని, ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్ నా ఛాలెంజ్ కు సిద్ధమా? అని సవాల్ విసిరారు. దేవుడి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాణం చేసే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. మావోయిస్టుల జాబితాలో హీరోయిన్లు, వ్యాపారులతోపాటు బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోన్ నెంబర్లను చేర్చింది నిజం కాదా? అన్నారు. ఆఖరికి కేసీఆర్ బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ఆ జాబితాలో చేర్చి ఫోన్ ట్యాపింగ్ చేయించలేదా?అని నిలదీశారు. హైదరాబాద్ నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో బండి సంజయ్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయి**

సింగరేణి సంస్థను కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి దోచుకుంటున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. గతంలో కేసీఆర్ కుటుంబమే దోచుకుంటే...కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటున్నారన్నారని విమర్శించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే... బీఆర్ఎస్ అవినీతిపై కూడా విచారణ జరుపుదామా? అని ఉప ముఖ్యమంత్రి భట్టి చెబుతున్నారని...సింగరేణిలో రెండు పార్టీలు దోచుకున్న దోపిడీపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 2014 నుంచి ఇప్పటి వరకు సింగరేణిలో గనుల కేటాయింపు, జరిగిన దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని తెలిపారు. తెలంగాణలో జరిగిన దోపిడీపై మాట్లాడుతుంటే... గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని బండి సంజయ్ ప్రశ్నించారు. సింగరేణి కార్మికులు పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంటే.. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ గనుల దోపిడీ ఇప్పుడు కొనసాగుతోందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సింగరేణిని దోచుకుంది ఆయన కుటుంబమేనని.. ఆ సంస్థలో దోచుకున్న సొమ్ముతోనే బీఆర్ఎస్ పార్టీని ఇన్నాళ్లు నడిపించారని పేర్కొన్నారు. రూ.42వేల కోట్ల సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుని సింగరేణిని అప్పుల పాల్జేసిందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తెస్తామంటారు.. అధికారంలోకి వచ్చాక ఆ సొమ్మంతా దారి మళ్లించడం పరిపాటైందన్నారు. సింగరేణి ప్రజలు, కార్మికులు రెండు పార్టీల తీరును చూసి అసహ్యించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలేనని...మా భాగోతం మీరు బయటపెడితే... మీ భాగోతం మేం బయటపెడతామంటూ మాట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

## డాక్టర్, మేల్ నర్స్‌కు పదేళ్ల జైలు



**నిజామాబాద్ లీగల్:** నకిలీ రెమిడెసివిర్ ఇంజెక్షన్లను సరఫరా చేసి, రోగుల ప్రాణాలతో చెలగాటమాడిన మేల్ నర్సు, డాక్టర్‌కు నిజామాబాద్ ప్రిన్సిపల్ డ్రిస్టిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జీవీఎన్ భారతలక్ష్మి పదేళ్ల జైలు శిక్ష, చెరో రూ.లక్ష జరిమానా విధించారు. 2021లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం చేపూర్‌కు చెందిన కొండ్ర మహేశ్‌బాబు కరోనా చికిత్స కోసం ఆర్మూర్‌లోని లైఫ్ కోవిడ్ ఆస్పత్రిలో చేరాడు. అక్కడ డాక్టర్‌గా పనిచేస్తున్న అల్యాన సాయి కృష్ణ మార్కెట్‌లో ఆ ఇంజెక్షన్ల కొరత ఉండటంతో తానే వాటిని సమకూర్చుతానని పేషెంట్ తమ్ముడు రంజిత్ వద్ద రూ. 50 వేలు తీసుకొని రెండు ఇంజెక్షన్లు ఇచ్చాడు. అయినా మహేశ్‌కు కరోనా తీవ్రత తగ్గలేదు. మెరుగైన చికి త్స కోసం నిజామాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ డాక్టర్ ప్రవీ ణ్ పేషెంట్‌కు కోవిడ్ తీవ్రత ఎక్కువగా ఉన్నందువల్ల మూడు రెమిడెసివిర్ ఇంజెక్షన్లు అవసరమని, ఆ ఇంజెక్షన్లను తీసుకురావాల్సిందిగా కోరాడు. అయితే పేషెంట్ బంధువు డాక్టర్ సాయికృష్ణను సంప్రదించాడు. ధర పెరిగిందని 3 ఇంజెక్షన్లకు రూ.85 వేలు ఇవ్వాలని కోరాడు, అందుకు వారు అంగీకరించడంతో నిజామాబాద్‌లోని తిరుమల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మేల్ నర్స్‌గా పనిచేస్తున్న పులి సతీశ్‌గౌడ్‌తో కలిసి మూడు ఇంజెక్షన్లను రోగి బంధువుకు ఇచ్చారు. డాక్టర్ ప్రవీణ్ వాటిని నకిలీ ఇంజెక్షన్లుగా గుర్తించి తిరిగి వెనక్కి ఇచ్చేశాడు. రెండోసారి కూడా నకిలీ ఇంజెక్షన్లు ఇవ్వడంతో తాము మోసపోయామని గ్రహించిన రోగి సోదరుడు రంజిత్‌కుమార్ నిజామాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పులి సతీశ్‌గౌడ్, డాక్టర్ సాయికృష్ణపై కేసు నమోదైంది. దీనిపై విచారణ జరిపిన జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చారు.

ధర్మఘంట

# జీలకర్ర తింటే బరువు తగ్గుతారా..?



ఏవవతీజీ చిజీబివతీ: బరువు తగ్గడానికి రకరకాల డైట్లు, జిమ్ వర్కౌట్లు చేసి విసిగిపోయారా.. అయితే మీకో గుడ్ న్యూస్. మన వంటగదిలోని జీలకర్రతోనే సులభంగా బరువు తగ్గవచ్చని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అసలు వంటింట్లో ఉండే ఈ చిన్న గింజలు మీ పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును ఎలా కరిగిస్తాయి? ఏ టైమ్‌లో తింటే మంచి ఫలితాలు ఉంటాయి..? మన వంటింట్లో పోపుల పెట్టెలో తప్పనిసరిగా ఉండే పదార్థం జీలకర్ర. కేవలం రుచి కోసమే కాకుండా అరుగుదల కోసం పూర్వం నుండి దీనిని వాడుతున్నాం. అయితే ఇటీవల బయోఇంటెలిజెన్స్, ఫ్రాంటియర్స్ ఇన్ న్యూట్రిషన్ నివేదికల ప్రకారం.. జీలకర్ర బరువు తగ్గడంలో కీలక పాత్ర పోషిస్తుందని తేలింది. రాత్రి భోజనం తర్వాత జీలకర్ర తీసుకోవడం వల్ల కలిగే ఆశ్చర్యకరమైన మార్పులేంటో ఇప్పుడు చూద్దాం. కేవలం జీలకర్ర తినడం వల్లే బరువు తగ్గిపోతారని అనుకోవడం పొరపాటే కానీ, ఇది బరువు తగ్గే ప్రక్రియను వేగవంతం చేస్తుందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. మెరుగైన జీర్ణక్రియ: జీలకర్ర తినడం వల్ల శరీరంలో జీర్ణ ఎంజైమ్‌లు ఉత్తేజితమవుతాయి. దీనివల్ల మనం తిన్న ఆహారం త్వరగా జీర్ణమై, శక్తిగా మారుతుంది. ఇది ఉబ్బరం మరియు గ్యాస్ వంటి సమస్యలను తగ్గిస్తుంది. మెటబాలిజం బూస్టర్: జీలకర్రలోని కొన్ని సమ్మేళనాలు శరీరంలో పేరుకుపోయిన కొవ్వును, ముఖ్యంగా బెల్లీ ఫ్యాట్‌ను కరిగించడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. బ్లడ్ షుగర్ కంట్రోల్: భోజనం తర్వాత రక్తంలో ఇన్సులిన్ స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా జీలకర్ర నియంత్రిస్తుంది. ఇన్సులిన్ అదుపులో ఉంటే శరీరంలో కొవ్వు నిల్వలు పెరగవు. ఆకలిపై నియంత్రణ: రాత్రి పూట అనవసరంగా ఏదైనా తినాలనిపించే క్రేవింగ్స్‌ను జీలకర్ర తగ్గిస్తుంది. ఇది కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. రాత్రి భోజనం తర్వాత కొన్ని వేయించిన జీలకర్ర గింజలను నమలడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఒక స్పూన్ జీలకర్రను నీటిలో మరిగించి లేదా రాత్రంతా నానబెట్టి, భోజనం తర్వాత ఆ నీటిని తాగవచ్చు. జీలకర్ర ఆరోగ్యానికి మంచిదే అయినా, కొన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో తీసుకోవడం వల్ల గుండెల్లో మంట లేదా రక్తంలో చక్కెర స్థాయిలు పడిపోయే ప్రమాదం ఉంది. గర్భవతులు తమ ఆహారంలో ఇలాంటి మార్పులు చేసే ముందు తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించాలి. డయాబెటిస్ లేదా బీపీ మందులు వాడే వారు కూడా వైద్య సలహా తీసుకోవడం ముఖ్యం. బరువు తగ్గడానికి జీలకర్ర ఒక గొప్ప సహాయకారి మాత్రమే. కానీ అది పూర్తి పరిష్కారం కాదు. సరైన ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామంతో పాటు జీలకర్రను మీ జీవనశైలిలో భాగం చేసుకుంటే స్లిమ్‌గా మారడం ఖాయం.

# పుట్టగొడుగుల వల్ల అలర్జీ వస్తుందా?

కొంతమందికి పుట్టగొడుగుల అలెర్జీలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు ముందుగా ఉన్న ఆహారం లేదా పుప్పొడి అలెర్జీలు, బలహీనమైన రోగనిరోధక వ్యవస్థలు లేదా సున్నితమైన చర్మం ఉన్నవారు వీటికి దూరంగా ఉండాలని చెబుతున్నారు. పుట్టగొడుగులు ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయని అందరూ అనుకుంటారు. అందుకే చాలా మంది ఎక్కువ ధర ఉన్నప్పటికీ వారంలో ఒకసారి తినేందుకు ప్రయత్నిస్తుంటారు. రుచితోపాటు అనేక రకాలైన ప్రోటీన్లు, విటమిన్లు కలిగి ఉన్న పుట్టగొడుగులు ఆరోగ్యానికి మంచిదని వైద్యులు కూడా చెబుతుంటారు. పుట్టగొడుగు సూప్, స్టైర్ ఫ్రై, పిజ్జా లేదా సలాడ్ అంటూ ఇలా వివిధ రూపాల్లో వండేసి తినేస్తుంటారు. అయితే, కొందరికి మాత్రం పుట్టగొడుగులు అంటే పడదు. తమకు ఎలర్జీ ఉందంటూ వారి పుట్టగొడుగులకు దూరంగా ఉండాల్సి వస్తుంది. ఇంత ఆరోగ్యకరమైన పుట్టగొడుగులు వారికి ఎందుకు అలెర్జీని కలిగిస్తున్నాయి. అయితే, కొంతమందికి పుట్టగొడుగుల అలెర్జీలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు ముందుగా ఉన్న ఆహారం లేదా పుప్పొడి అలెర్జీలు, బలహీనమైన రోగనిరోధక వ్యవస్థలు లేదా సున్నితమైన చర్మం ఉన్నవారు వీటికి దూరంగా ఉండాలని చెబుతున్నారు. పరిశోధన ప్రకారం.. పుట్టగొడుగులలో కనిపించే ప్రోటీన్లు బూజు అలెర్జీ కారకాలతో పరస్పర చర్య చెందుతాయి. దీని వల్ల కొంతమంది సున్నితమైన వ్యక్తులలో అలెర్జీ ప్రతిచర్యలు సంభవిస్తాయి. సున్నితమైనవారు పుట్టగొడుగులు తిన్నప్పుడు.. వారి రోగనిరోధక వ్యవస్థ ఈ ప్రోటీన్లను హానికరమైన పదార్థాలుగా తప్పుగా భావించి అలెర్జీ ప్రతిచర్యను ప్రేరేపిస్తాయి. దీంతో హిస్టామిన్, ఇతర రసాయనాలను విడుదల చేస్తుంది. దీని వల్ల దురద, చర్మంపై దద్దుర్లు, వాపు, ముక్కు కారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కలుగుతాయి. పండించిన పుట్టగొడుగులతోపాటు అడవి పుట్టగొడుగులు కూడా అలెర్జీని కలిగించే ప్రోటీన్లు కలిగి ఉంటాయని అధ్యాయనాలు చెబుతున్నాయి. కానీ, అడవి పుట్టగొడుగులు తరచుగా అధిక మొత్తంలో ఉంటాయి. ఇంకా కొంతమందిలో క్రాస్-అలెర్జీలు వస్తాయి. పుప్పొడి అలెర్జీల చరిత్ర ఉన్నవారికి పుట్టగొడుగు అలెర్జీలు కూడా వచ్చే ప్రమాదం ఉంది. అలెర్జీలు ఉన్నవారు.. పుట్టగొడుగులు లేదా ఇతర శిలీంధ్ర ఉత్పత్తులకు అలెర్జీల చరిత్ర ఉన్నవారు వాటిని తినకుండా ఉండాలి. అలెర్జీ ప్రతిచర్యలు చర్మపు దద్దుర్లు, దురద, వాపు లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని కలిగిస్తాయి. బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ ఉన్న వ్యక్తులు.. మధుమేహం లేదా బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ ఉన్నవారిలో, పుట్టగొడుగులలో ఉండే ఫంగల్ ప్రోటీన్లు ఇన్ఫెక్షన్ లేదా అలెర్జీ ప్రతిచర్యలను పెంచుతాయి. జీర్ణ సమస్యలు ఉన్నవారు.. మలబద్ధకం, గ్యాస్ లేదా జీర్ణ సమస్యలు ఉన్నవారు పుట్టగొడుగులను ఎక్కువగా తింటే ఉబ్బరం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలను ఎదుర్కొంటారు. గర్భిణీలు లేదా పాలిచ్చే స్త్రీలు.. గర్భధారణ సమయంలో లేదా పాలిచ్చే సమయంలో కూడా పుట్టగొడుగులను తినడం మానుకోవాలని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.



# ఈ గడ్డి పెద్ద వ్యాధులకూ చెక్ పడతాయ్



నిమ్మగడ్డి (లెమన్ గ్రాస్) కేవలం గడ్డి మొక్క కాదు.. అద్భుత ఆరోగ్య ప్రయోజనాల నిధి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, రక్తపోటును నియంత్రిస్తుంది, జ్వరం, దగ్గు, జలుబు, కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతూ, చర్మం, కురుల ఆరోగ్యానికి తోడ్పడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. లెమన్ గ్రాస్ (నిమ్మగడ్డి) ఆరోగ్య ప్రయోజనాల నిధిగా పేర్కొంటారు. దీనిలో ఔషధ గుణాలతోపాటు.. ఎన్నో పోషకాలు దాగున్నాయి.. చాలామందికి నిమ్మగడ్డి గురించి తక్కువ అవగాహన ఉండవచ్చు.. కానీ ఇది కేవలం గడ్డి మొక్క మాత్రమే కాదు, ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలను అందించే అద్భుతమైన మూలికగా పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు? నిమ్మగడ్డిని వంటకాలలో, పరిమళాల తయారీలో, సౌందర్య చికిత్సలలో విస్తృతంగా ఉపయోగిస్తారు. ఇందులో పోషకాలతో పాటు సువాసన వెదజల్లే లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. నిమ్మగడ్డిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల జీర్ణ సమస్యలు, నొప్పి, మంట తగ్గుతాయి. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు రక్తపోటు నియంత్రణకు సహాయపడతాయి. ఇది జ్వరం, కడుపు సమస్యలు, పేగు పురుగులు, జలుబు, దగ్గు, ఆస్తమా, శ్వాసకోశ సమస్యలను తగ్గిస్తుంది. అదనంగా, ఇది బరువు తగ్గడానికి, చర్మం, కురుల ఆరోగ్యాన్ని కాపాడటానికి, నరాల బలహీనతను తగ్గించడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, కీళ్ల నొప్పులను నివారించడానికి తోడ్పడుతుంది. పేలు, చుండ్రు, ఆర్థరైటిస్, స్ప్రేన్ వంటి సమస్యలకు కూడా నిమ్మగడ్డి మంచి పరిష్కారం. స్త్రీలలో నెలసరి నొప్పులను, వేళ్ల మధ్య పుళ్లను తగ్గిస్తుంది. సులభంగా నిమ్మగడ్డి టీ తయారు చేసుకోవచ్చు. ఒక గిన్నెలో నీరు మరిగించి, నిమ్మగడ్డి పోసలు వేసి ఐదు నిమిషాలు మరగనివ్వాలి. రుచి కోసం బెల్లం, మెంతి ఆకులు కలుపుకోవచ్చు. స్టవ్ ఆపి, గోరువెచ్చగా మారిన తర్వాత వడకట్టుకుంటే ఆరోగ్యకరమైన నిమ్మగడ్డి టీ సిద్ధమవుతుంది. దీని సువాసన ఒత్తిడిని తగ్గిస్తుందని, టీ తాగడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు దూరమవుతాయని చెబుతారు. అయితే.. లెమన్ గ్రాస్ జ్యూస్ గా కూడా తాగొచ్చు..

# నెయ్యితో చెప్పలేనన్ని లాభాలు



నెయ్యిలో మన ఆరోగ్యానికి కావలసిన అనేక పోషకాలు ఉంటాయి. దీన్ని తినడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. అందుకే మన పూర్వీకుల నుంచి నేటి వరకు వంటకాల్లో నెయ్యిని వాడుతుంటారు. నెయ్యిని మన రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా మనకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. నెయ్యి మన ఆరోగ్యానికి అనేక రకాలు మేలు చేస్తుంది. నెయ్యిలో ఉండే పోషకాలు పేగు ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. మలబద్ధకం, మూలవ్యాధి వంటి కడుపు సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి. మీ శరీర శక్తి, జీవక్రియను పెంచుతాయి. మీరు మీ ఎముకలను బలోపేతం చేయాలనుకుంటున్నా, లేదా కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం పొందాలనుకుంటున్నా.. ప్రతి రోజూ ఉదయం ఖాళీ కడుపుతో 1-2 టీస్పూన్ల దేశీ నెయ్యిని తినండి. దీన్ని క్రమం తప్పకుండా పాటిస్తే ఈ సమస్యలను పూర్తిగా తొలగించుకోవచ్చు. ముఖ్యంగా శీతాకాలంలో నెయ్యి తీసుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. చలికాలంలో మన శరీరంలో రోగనిరోధక శక్తి అనేది క్షీణిస్తుంది. బలహీనమైన రోగనిరోధక శక్తి కారణంగా మీరు తరచుగా అనారోగ్యానికి గురవుతారు. కాబట్టి రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి మీరు నెయ్యిని ఆహారంలో చేర్చుకోవచ్చు. దేశీ నెయ్యి కంటి ఆరోగ్యానికి కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుందని నిరూపించబడింది. దేశీ నెయ్యి మెదడుపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది అలాగే పార్కిన్సన్స్, చిత్తవైకల్యం వంటి వ్యాధుల నుండి రక్షిస్తుంది. మీరు నెయ్యి పూర్తి ప్రయోజనాలు పొందాలి అనుకుంటే.. ఉదయం ఖాళీ కడుపుతో 1-2 టీస్పూన్ల ఆవు నెయ్యి తీసుకోండి. మీరు దానిని గోరువెచ్చని లేదా వేడి నీటితో త్రాగవచ్చు. కావాలంటే అందులోకి చిటికెడు పసుపు పొడిని కూడా యాడ్ చేసుకోవచ్చు. మొత్తంమీద, విటమిన్ ఎ, విటమిన్ డి, విటమిన్ ఇ , విటమిన్ కె, ఒమేగా-3 మరియు 9 కొవ్వు ఆమ్లాలు, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉన్న దేశీ నెయ్యిని మితంగా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఒక వరం లాంటిది. కానీ ఎక్కువగా తీసుకోవద్దు. నెయ్యి అలర్జీలు ఉన్న వారు దానికి దూరంగా ఉండడం మంచిది.



# రోగాలకు చెక్ పెట్టె దివ్యౌషధం..

వామాకుల్లో ఎన్నో ఔషధ గుణాలు, పోషకాలు దాగున్నాయి. వామాకు ఆకులు దగ్గు, జలుబు, బ్రాంకైటిస్, జ్వరం వంటి అనేక సాధారణ ఆరోగ్య సమస్యలకు సహజ నివారణ. మూత్రపిండాల్లో రాళ్ళు, గుండె ఆరోగ్యానికి మంచిది, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. పాలిచ్చే తల్లులకు, పిల్లలకు కూడా ప్రయోజనకరమైనది. పొట్టనొప్పి, ఆకలి లేకపోవడం, గాయాలు, దద్దుర్లకు ఔషధంగా పనిచేస్తుంది. వాము ఆకులలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. వాము ఆకులోని యాంటీ ఆక్సిడెంట్స్, పోషకాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అంతేకాకుండా.. వాము ఆకు సీజనల్‌గా వచ్చే జలుబు, దగ్గు సమస్యలను నియంత్రిస్తుంది.. అందుకే వీటిని తీసుకోవాలని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. పచ్చని, మందపాటి ఆకులతో కూడిన వాము మొక్కలను కిచెన్ గార్డెన్లలో సులభంగా పెంచుకోవచ్చు. దీని ఆకులు వాము గింజల వాసనను పోలి ఉంటాయి.. ఇవి ఎన్నో సమస్యలను నివారించడంలో సహాయపడతాయి.. ఈ ఆకులను సాధారణంగా బజ్జీల తయారీకి ఉపయోగిస్తారు.. కానీ వాటి ఆరోగ్య ప్రయోజనాలు విస్తృతంగా ఉన్నాయి. దగ్గు, జలుబు, బ్రాంకైటిస్, జ్వరం వంటి సమస్యలతో బాధపడుతున్నప్పుడు, 10 నుండి 12 వామాకు ఆకులను చిన్న ముక్కలుగా చేసి, నీటిలో వేసి, నాలుగో వంతు అయ్యే వరకు సిమ్ లో మరిగించి కషాయాన్ని తయారు చేయాలి. ఈ కషాయాన్ని తాగడం ద్వారా ఈ సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. మూత్రపిండాల్లో రాళ్ళు ఉన్నవారికి వామాకు మంచిది. పిల్లలకు జలుబు, దగ్గు వచ్చినప్పుడు, కొన్ని వామాకులను సైంధవ లవణంతో కలిపి నూరి, ఆ రసాన్ని నాకించినట్లయితే ఉపశమనం లభిస్తుంది. తల్లిపాలు తాగే పసిపిల్లలకు జలుబు, దగ్గు వచ్చినప్పుడు, వామాకు రసాన్ని కాస్త తేనెతో కలిపి తల్లి చనుమొనలకు రాస్తే ప్రయోజనకరంగా ఉంటుందని నమ్ముతారు. పాలిచ్చే తల్లులు ఒకటి లేదా రెండు వామాకు ఆకులను నేరుగా తినడం వల్ల పాలు పడటానికి సహాయపడుతుందని పేర్కొంటున్నారు. పొట్టనొప్పి ఉన్నా, ఆకలి లేకపోయినా, ఒంటిమీద దద్దుర్లు వచ్చినా ఈ ఆకులను తినడం ద్వారా ఉపశమనం పొందవచ్చు. వామాకు, అల్లం కలిపి బాగా నూరి తీసిన రసం తాగితే ఆకలి పెరిగి అజీర్తి తగ్గుతుంది. వామాకు గుండె ఆరోగ్యానికి మంచిదిగా పరిగణించబడుతుంది. ఈ ఆకులను సలాడ్లలో వేసుకొని తినడం వల్ల శరీరంలో అధికంగా ఉన్న నీటిని తొలగించి, తద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇది సహజమైన మూత్రవిసర్జన కారకంగా పనిచేసి, శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడంలో తోడ్పడుతుంది.

# ఆహార తయారీలో కల్తీలకు పాల్పడితే కఠిన చర్యలు

**వ్యక్తిగత పరిశుభ్రతను తప్పక పాటించాలి**
**సురక్షితమైన ఆహార పదార్థాలను భక్తులకు అందించాలి**
**అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి**

**ధర్మ ఘంట జనవరి 24**

నల్గొండ : బ్రహ్మోత్సవాలలో భక్తులకు సురక్షితమైన ఆహారాన్ని అందించే విధంగా చర్యలు చేపట్టాలని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి ఆహార తయారీదారులకు సూచించారు. వ్యక్తిగత శుభ్రతను పాటించకుండా కల్తీలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆహార పరిరక్షణ శాఖ అధికారులు 23 నుండి 23 నుండి 30 వరకు చెరువుగట్టులో భక్తులకు నాణ్యమైన,పరిశుభ్రమైన అన్నప్రసాదం అందే విధంగా ఆహార పరిరక్షణ పర్యవేక్షణ తనిఖీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పర్యవేక్షణ తనిఖీలలో భాగంగా,ఆలయ ఈవో, ఆలయ సిబ్బందితో కలిసి ఆహార పరిరక్షణ శాఖ అధికారులు ఆలయ ప్రసాదం తయారీ కేంద్రాన్ని సమగ్రంగా తనిఖీ చేశారని తెలిపారు.ప్రసాదం తయారీకి సంబంధించిన ముడి పదార్థాల స్వీకరణ,నిల్వ విధానాలు,తయారీ ప్రక్రియలు,పరికరాల శుభ్రత,నీటి వినియోగం,వ్యర్థాల నిర్వహణ,సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత తదితర అన్ని అంశాలను సవివరంగా పరిశీలించారు. భక్తులకు అందిస్తున్న లడ్డూ,పులిహోరలను బ్యాచ్ వారీగా తనిఖీ చేయడం జరిగిందన్నారు.ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ మొబైల్






ప్రయోగశాల ద్వారా తక్షణ స్పాట్ పరీక్షలు చేపట్టామన్నారు. తనిఖీల సందర్భంగా లోపాలు,మెరుగుపరచాల్సిన అంశాలను నమోదు చేసి, ఆహార భద్రత, పరిశుభ్రతను మరింత మెరుగుపరచేందుకు అవసరమైన పరిశీలనలు, సవరణ చర్యలను చేపట్టాలని ఆలయ ఈవోకు సూచనలు జారీ చేశామని తెలిపారు.ప్రసాదం తయారీ కేంద్రాల నిర్వాహకులు,సిబ్బందికి ఆహార తయారీ సమయంలో అనుసరించాల్సిన ప్రామాణిక విధానాలు, పరిశుభ్రత, శానిటేషన్, భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించామని పేర్కొన్నారు.ఆలయ పరిసరాలలో ఉన్న తినుబండారాలు విక్రయించే వ్యాపారులను కూడా తనిఖీ చేసి, ఆహార భద్రతకు సంబంధించిన సూచనలు పాటించాలని సూచించడం జరిగిందన్నారు. కొన్ని ఆహార పదార్థాల నమూనాలను సేకరించి, ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ ద్వారా స్పాట్ పరీక్షలు నిర్వహించడంతో పాటు, మరింత పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించామని నాసిరకమైన, కల్తీకి లోనయ్యే అవకాశం ఉన్న ఆహార పదార్థాలను విక్రయించకుండా, నాణ్యమైన మరియు సురక్షితమైన ఆహార పదార్థాలను మాత్రమే విక్రయించాలని వ్యాపారులకు అవగాహన కల్పించమని తెలిపారు.ఆలయ పరిసర ప్రాంగణంలో విక్రయ దారులు నిషేధిత పదార్థాలను,హానికరమైనటువంటి రసాయనాలతో కూడిన ఆహార పదార్థాలను విక్రయించవద్దని,గుట్కా పొగాకు లాంటివి నమిలి ఆలయ పరిసర ప్రాంతాలను అపరిశుభ్రం చేయకూడదని ఒకవేళ ఇలాంటి నిబంధనలను ఉల్లంఘించిన ఎడల ఆహార పరిరక్షణ ప్రమాణాల చట్టం ప్రకారం కఠినంగా శిక్షించబడతారని ఆమె హెచ్చరించారు.

# విద్యను సహసృష్టించడంలో యువత శక్తి

**యువత - విద్య: గ్లోబల్ నాయకత్వ నిర్మాణానికి బలమైన పునాది**
(అంతర్జాతీయ విద్యా దినోత్సవం – 2026 సందర్భంగా)

హైదరాబాద్, జనవరి 23, 2026: అంతర్జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా, వ్యక్తుల జీవితం మాత్రమే కాదు – సమాజ భవిష్యత్తు, ప్రపంచ నాయకత్వాన్ని కూడా రూపుదిద్దే విద్య యొక్క కీలక పాత్రపై మనం ఆలోచించాల్సిన అవసరం ఉంది. విద్యాసంస్థలు ఆధునిక సమాజానికి ఆలయాల్లాంటివి. ఇవి విద్యార్థులను జ్ఞానవంతులుగా, నైపుణ్యాలతో కూడిన బాధ్యతాయుత పౌరులుగా మలిచి, వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేలా సిద్ధం చేస్తున్నాయి. ఈ ఏడాది అంతర్జాతీయ విద్యా దినోత్సవం థీమ్ "విద్యను సహసృష్టించడంలో యువత శక్తి". ఈ అంశం భవిష్యత్ విద్య రూపకల్పనలో యువత పాత్ర ఎంత కీలకమో స్పష్టంగా తెలియజేస్తోంది. యువత విద్యకు కేవలం లబ్ధిదారులు మాత్రమే కాదు; వారి ఆలోచనలు, సృజనాత్మకత, వినూత్న దృక్పథంతో విద్యను మరింత అర్థవంతంగా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దగల సక్రియ భాగస్వాములు. విద్య ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ప్రధాన స్థానం పొందింది. ముఖ్యంగా లక్ష్యం – 4: నాణ్యమైన విద్య పేదరిక నిర్మూలన, అసమానతల తగ్గింపు, ఆర్థిక–సామాజిక అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తోంది. నాణ్యమైన, నైపుణ్యాధారిత విద్యే సుస్థిర అభివృద్ధికి మార్గం. భారతదేశంలో అపారమైన మేధస్సు మరియు ప్రతిభ ఉన్నది అనడంలో సందేహం లేదు. ఇది ప్రపంచ వేదికపై భారత మూలాల నాయకుల విజయాలతో స్పష్టమవుతోంది. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, ఆల్ఫాబెట్ (గూగుల్) సీఈఓ సుందర్ పిచాయ్, అడోబ్ సీఈఓ శాంతను నారాయణ్, ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ, యూట్యూబ్ సీఈఓ నీల్ మోహన్, షానెల్ సీఈఓ లీనా నాయర్, ఫెడ్ఎక్స్ సీఈఓ రాజ్ సుబ్రమణియం, ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా వంటి ప్రముఖులు భారత విద్యా శక్తికి ప్రతీకలుగా నిలుస్తున్నారు. వారి ప్రయాణాలు ప్రపంచవ్యాప్తంగా యువతకు ప్రేరణగా మారాయి. అయితే, ఉన్నత విద్య మరియు పరిశోధన రంగంలో పాశ్చాత్య దేశాలతో పోలిస్తే భారత్ ఇంకా వెనుకబడి ఉందనే వాస్తవాన్ని అంగీకరించాల్సిందే. అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, స్లోవేనియా వంటి దేశాలు ప్రతి సంవత్సరం భారత్‌తో పోలిస్తే ఎక్కువ మంది పీహెచ్‌డీ పట్టభద్రులను తయారు చేస్తున్నాయి. విద్యార్థుల డ్రాప్‌ఔట్ రేటు ఇంకా ఆందోళనకర స్థాయిలో ఉండగా, ఫిన్లాండ్, డెన్మార్క్ వంటి దేశాల మాదిరిగా పరిశోధనాభిముఖ విద్యకు భారత్‌లో తగిన ప్రోత్సాహం అవసరం.జాతీయ విద్యా విధానం – 2020 ద్వారా విద్యా రంగంలో సంస్కరణలకు బలమైన పునాది






పడింది. బహుళ నైపుణ్యాల అభ్యాసం, పరిశోధనకు ప్రాధాన్యం, డిజిటల్ విద్య విస్తరణ, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, గ్రీన్ టెక్నాలజీ వంటి రంగాల్లో అవకాశాలు యువతకు కొత్త దారులు చూపుతున్నాయి. విద్యార్థుల భాగస్వామ్యం, యూత్ ఇన్నోవేషన్ హబ్‌లు, స్టార్ట్–అప్ సంస్కృతి ద్వారా విద్య మరింత సమకాలీనంగా మారగలదు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది. విద్యను తొలి ప్రాధాన్యంగా స్వీకరించి, నైపుణ్యాధారిత అభ్యాసాన్ని అలవర్చుకుని, విద్యా వ్యవస్థ రూపకల్పనలో చురుకుగా పాల్గొనగలిగితే భారత యువత జ్ఞానవంతమైన, వినూత్నమైన, ప్రపంచ గౌరవం పొందిన దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగలదు. జాతీయ విద్యా విధానం – 2020 ద్వారా భారత్‌లో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సమగ్ర విద్య, బహుళ నైపుణ్యాల అభ్యాసం, పరిశోధనకు ప్రాధాన్యం, డిజిటల్ విద్య విస్తరణ వంటి అంశాలు యువతకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి. ఆన్‌లైన్ లెర్నింగ్, కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ – ఏఐ), డేటా సైన్స్, గ్రీన్ టెక్నాలజీ వంటి రంగాల్లో యువత చురుకుగా పాల్గొనడం ద్వారా విద్య మరింత సమకాలీనంగా మారుతోంది. అదేవిధంగా, విద్యా వ్యవస్థ రూపకల్పనలో యువత భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉంది. విద్యార్థి ప్రతినిధిత్వం, యూత్ పాలసీ ఫోరమ్‌లు, స్టార్ట్–అప్ కల్చర్, ఇన్నోవేషన్ హబ్‌లు ద్వారా యువత తమ ఆలోచనలను అమలులోకి తీసుకురాగలరు. ఉపాధి ఆధారిత విద్య, పరిశోధనాభిముఖ దృష్టి, సామాజిక బాధ్యతతో కూడిన అభ్యాసం ద్వారా భారత విద్యా వ్యవస్థ ప్రపంచస్థాయిలో పోటీ పడగలదు. మాధ్యమిక విద్య అయిన 910 తరగతుల్లో డ్రాప్‌అవుట్ రేటు సుమారు 1114 శాతం ఉంటుంది. 10వ తరగతి పరీక్షల భయం, చదువుకు అయ్యే ఖర్చులు మరియు తల్లిదండ్రుల ఒత్తిడి కారణంగా చాలామంది విద్యార్థులు ఈ దశలోనే చదువును మానేస్తున్నారు. ముఖ్యంగా 10వ తరగతి తర్వాత డ్రాప్‌అవుట్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఉన్నత మాధ్యమిక విద్య అయిన ఇంటర్మీడియట్ (1112 తరగతులు) స్థాయిలో డ్రాప్‌అవుట్ రేటు 610 శాతం వరకు ఉంటుంది. చాలా మంది విద్యార్థులు 10వ తరగతి పూర్తయ్యాక చదువును కొనసాగించకుండా ఉద్యోగాలు లేదా ఇతర పనుల వైపు వెళ్లిపోతున్నారు. ఉన్నత విద్య అయిన డిగ్రీ లేదా గ్రాడ్యుయేషన్ స్థాయిలో డ్రాప్‌అవుట్ రేటు అత్యధికంగా 3040 శాతం వరకు ఉంటుంది. ముఖ్యంగా కాలేజీ మొదటి సంవత్సరాల్లో చదువు భారంగా అనిపించడం, ఆర్థిక సమస్యలు మరియు సరైన మార్గదర్శకత లేకపోవడం వంటివి విద్యార్థులు చదువును మధ్యలోనే వదిలేయడానికి కారణాలుగా మారుతున్నాయి.

ప్రభుదాస్ గండమళ్ల ఇండియన్ గ్రీన్ గ్యాస్ ఎక్విప్‌మెంట్స్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఎకనామిక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ మరియు ప్రపంచ బ్యాంకు సివిల్ సొసైటీ పాలసీ ఫోరమ్ సభ్యుడు, వాషింగ్టన్ డి.సి, అమెరికా.
9441464767 ; 9390381267

# ప్రవీణ్ కుమార్ యూ టర్న్...



**హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణాధికారిగా ఉన్న సజ్జనార్‌పై తాను చేసిన వ్యాఖ్యలకు సంబంధించి పోలీసులు నోటీసులు జారీ చేయడంపై ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ స్పందించారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలకు మద్దతుగా ప్రెస్ మీట్ పెట్టిన 12 గంటల వ్యవధిలోనే, అర్ధరాత్రి తన ఇంటికి వచ్చి పోలీసులు నోటీసులు ఇవ్వడాన్ని ఆయన తప్పుబట్టారు. కేటీఆర్, హరీష్ రావు వంటి నాయకులను విచారణ పేరిట వేధిస్తున్న తీరును ప్రశ్నించినందుకే ప్రభుత్వం తనపైకి పోలీసులను పంపిందని ఆయన ఆరోపించారు. బెదిరింపులకు తాను భయపడబోనని, తన వద్ద ఉన్న సమాచారంతోనే నోటీసులకు సమాధానం ఇస్తానని స్పష్టం చేశారుప్రవీణ్ కుమార్ తన వివరణలో ప్రధానంగా నైతికత అంశాన్ని తెరపైకి తెచ్చారు. గతంలో ఓటుకు నోటు కేసు సమయంలో తెలంగాణ ఇంటెలిజెన్స్ విభాగం ఆంధ్రప్రదేశ్ నేతల ఫోన్లను ట్యాప్ చేసిందంటూ 2015లో ఏపీలో పలు కేసులు నమోదయ్యాయని ఆయన గుర్తు చేశారు. ఆ సమయంలో సజ్జనార్ ఇంటెలిజెన్స్ విభాగంలో కీలక అధికారిగా ఉన్నందున, ఇప్పుడు అదే ఫోన్ ట్యాపింగ్ అంశంపై ఏర్పాటైన సిట్‌కు ఆయన నేతృత్వం వహించడం నైతికంగా సరికాదని తాను అభిప్రాయపడినట్లు తెలిపారు. నోటీసులో పేర్కొన్నట్లుగా తాను సజ్జనార్‌పై కేసులు ఉన్నాయని అనలేదని, గతంలోని కేసుల కారణంగా ఆయన విచారణాధికారిగా ఉండటాన్ని మాత్రమే ప్రశ్నించానని సమర్థించుకున్నారుఫోన్ ట్యాపింగ్ అనేది దేశ రక్షణ , వ్యవస్థీకృత నేరాల నియంత్రణ కోసం చట్టబద్ధంగా జరిగే ప్రక్రియ అని, దీనిపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ప్రవీణ్ కుమార్ వాదించారు. గతంలో యూపీఏ ప్రభుత్వం, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా గతంలో ట్యాపింగ్ గురించి చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. కేవలం రాజకీయ ప్రతీకారంతోనే బీఆర్ఎస్ నేతలను ఇబ్బంది పెడుతున్నారని, ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలపై గొంతెత్తడం తన రాజ్యాంగబద్ధమైన హక్కు అని ఆయన ఉద్ఘాటించారు. తన వ్యాఖ్యలు ఏ అధికారి లేదా రాజకీయ నాయకుడి వ్యక్తిత్వ హననానికి ఉద్దేశించినవి కావని ఆయన క్లారిటీ ఇచ్చారు. బహిరంగంగా సజ్జనార్‌పై తీవ్ర విమర్శలు చేసి, తీరా నోటీసులు అందగానే తాను అలా అనలేదు అని వివరణ ఇచ్చుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సజ్జనార్ ఇచ్చిన రెండు రోజుల గడువులోగా ప్రవీణ్ కుమార్ సమర్పించే సమాచారం ఏ విధంగా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఆ సమాచారం పోలీసులను సంతృప్తి పరచకపోతే, ఆయనపై సివిల్ , క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ పరిణామాలతో ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ఇప్పుడు అధికారులకు మరియు రాజకీయ నేతలకు మధ్య సవాలుగా మారింది

## అంగరంగ వైభవంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలు





**అనంతరం అన్నదాన కార్యక్రమం**
**పాల్గొన్న సర్పంచ్, ఉప సర్పంచ్**

**ధర్మఘంట, జనవరి 24, యాదాద్రి (భువనగిరి జిల్లా బ్యూరో):**

రామన్నపేట మండలంలోని నిర్నెంల గ్రామంలో శ్రీ గౌరీ సహిత చంద్రశేఖర స్వామి బ్రహ్మోత్సవాలు శ్రీ శివరామాంజనేయులు ఆలయంలో పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలకు గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ అవుల శ్రీశైలం లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హాజరైన గ్రామ ప్రజలు భక్తులకి అన్నదాన వితరణ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఏటా నిర్వహించే స్వామి వారి కళ్యాణ మహోత్సవం ను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉంటూ పంట బాగా పండుతూ సిరులతో సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు ఆవుల నరసింహ, చల్ల సత్య ప్రకాష్, వల్లే శేఖర్ రెడ్డి, 6వ వార్డ్ సభ్యులు ముత్యాల కిషన్, ముత్యాల శివ, చిప్పలపల్లి జితేందర్, నోముల విష్ణు, నోముల మల్లేష్, చిప్పలపల్లి సత్తయ్య,తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల అడ్మిషన్ పోస్టర్ ఆవిష్కరణ

**చేసిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



**ధర్మఘంట, జనవరి 24(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో):**

తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల అడ్మిషన్ల పోస్టర్ ఆవిష్కరించిన స్థానిక సంస్థల, రెవిన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, డిఆర్ఓ &డిఎం డబ్ల్యూఓ జయమ్మ, ఆర్సిఓ శ్రీకాంత్ ఉర్దూ మైనార్టీ ఆఫీసర్ ఫౌజియా, మైనార్టీ రెసిడెన్షియల్ సంస్థల ప్రిన్సిపల్ బాలకృష్ణ, శ్రీనివాస్ కవిత తో కలిసి పోస్టరును ఆవిష్కరించారు. శనివారం ఛాంబర్ లో మైనారిటీ అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్ ను ఆయన విడుదల చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ముస్లిం మైనారిటీలందరూ స్కూల్, ఇంటర్మీడియట్ కళాశాలలో మైనారిటీ రెసిడెన్షియల్ అడ్మిషన్ల కోటను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

## ఫర్టిలైజర్ యాప్ వచ్చినా రైతులకు యూరియా కష్టం తీరలే

**ఆన్లైన్ విధానాన్ని రద్దు చేయాలని తహసీల్దార్ కు వినతి**



**ధర్మ ఘంట జనవరి 24 మర్రిగూడ :**

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో అన్నదాతలకు యూరియా గోస తప్పడం లేదు.యాసంగి సీజన్ ఊపందుకోవడంతో రైతులు యూరియా కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది.వానాకాలంలో యూరియా కొరత నేపథ్యంలో రైతాంగం పడిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలో యూరియా కొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా యాప్‌ను తీసుకొచ్చింది.ఈ యాప్‌తో యూరియా కష్టాలకు చెక్ పడినట్టేనని ప్రచారం జరిగింది.కానీ తీరా క్షేత్రస్థాయిలో చూస్తే మాత్రం యూరియా కష్టాలు షరా మాములుగానే మారాయి.యూరియా కష్టాలు తారస్థాయికి చేరాయి.ఒక్క యూరియా బస్తా కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది.నేరుగా ఎరువుల దుకాణాల్లో యూరియా ఇచ్చే పరిస్థితి లేకపోవడం,యాప్ ద్వారా బుక్ చేసుకోవాల్సి వస్తుండడం వల్ల ఆ ఆన్‌లైన్ విధానంపై రైతాంగానికి అవగాహన లేక ముప్పుతిప్పలు పడుతున్నారు.మరోవైపు యూరియా మాత్రం ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చినా మాయమవుతూనే ఉంది. యూరియా ఆన్లైన్ విధానాన్ని రద్దు చేయాలని శనివారం స్థానిక మండల తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులకు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బుర్ర శేఖర్,చిట్యాల రంగన్న, యాదగిరి రెడ్డి,ఎరుకల నిరంజన్,జక్కలి అంజయ్య,తదితరులు పాల్గొన్నారు.

ధర్మఘంట

## బిజినెస్

# అన్ని అవసరాలకూ ఒకటే కార్డ్.. డెబిట్ కమ్ క్రెడిట్ కార్డు తేనున్న వీసా

## కొత్త పన్ను విధానంలో ఏటికేడు కొత్త మార్పులు!



ఆదాయపు పన్నుకు సంబంధించి కొత్త విధానం అనే కాన్సెప్టును తీసుకొచ్చింది ప్రధాని మోదీ సర్కారు. మినహాయింపులను పూర్తిగా తొలగిస్తూ సరళంగా రిటర్నులు ఫైల్ చేయడం కోసం తొలుత దీన్ని ఆప్షనల్‌గా తీసుకొచ్చారు. తర్వాత డిఫాల్ట్‌గా మార్చారు. గతేడాది (2025-26) ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్త పన్ను విధానంలో పన్ను మినహాయింపు పరిమితిని రూ.12 లక్షలకు పెంచుతూ మధ్యతరగతికి ఊరటనిచ్చారు. ఇది కొత్త పన్ను విధానంవైపు మళ్లేందుకు దోహదపడింది. ఈ పన్ను విధానం తీసుకొచ్చినప్పటి నుంచి కాలక్రమంలో జరిగిన మార్పులేంటో ఓసారి చూద్దాం..

**కొత్త పన్ను విధానంలో మార్పులిలా..**

దేశంలో 2020-21 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్త పన్ను విధానాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీన్ని తొలుత ఐచ్ఛికంగా పేర్కొన్నారు. రూ.5 లక్షల వరకు సున్నా (రిబేట్‌తో కలిపి); రూ.5- 7.5 లక్షల వరకు 10%; రూ.7.5 -10 లక్షల వరకు 15%; రూ.10- 12.5 లక్షల వరకు 20%; రూ.12.5- 15 లక్షల వరకు 25%; రూ.15 లక్షలు దాటితే 30% శాతం పన్ను వర్తిస్తుందని పేర్కొన్నారు. పన్ను మినహాయింపులను పూర్తిగా ఇందులో తొలగించారు. 2021-22 బడ్జెట్‌లో ఆదాయపు పన్నుకు సంబంధించి ఎలాంటి మార్పులూ చేయలేదు. 75 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు ఐటీ రిటర్నుల దాఖలును నుంచి మినహాయింపు పొందేందుకు అవసరమైన వాంగ్మూల పత్రాలను ఐటీ విభాగం నోటిఫై చేసింది. పింఛను ఆదాయం, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ ఒకే బ్యాంకు నుంచి పొందుతుంటే ఆదాయపు పన్ను రిటర్నులు సమర్పించాల్సిన అవసరం లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

**2022-23 బడ్జెట్‌లోనూ ఆదాయపు పన్నుకు సంబంధించి ఎలాంటి మార్పులూ చేయలేదు.**

మళ్లీ 2023-24 బడ్జెట్‌లో కొత్త పన్ను విధానాన్ని డిఫాల్ట్ చేశారు. శ్లాబు రేట్లను కూడా సవరించారు. రూ.0-3 లక్షలు సున్నా; రూ.3-6 లక్షలు 5%; రూ.6-9 లక్షలు 10%; రూ.9-12 లక్షలు 15%; రూ.12-15 లక్షలు 20%; రూ.15 లక్షలుపైబడి 30% పన్ను వర్తిస్తుంది. స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50వేలు చేశారు. సెక్షన్ 87ఏ కింద లభించే రిబేట్‌ను పెంచి రూ.7 లక్షల వరకు ఆదాయపు పన్ను చెల్లించక్కర్లేదని పేర్కొన్నారు. 2024-25 బడ్జెట్‌లో స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75 వేలకు పెంచడంతో పాటు శ్లాబు రేట్లను సవరించారు. రూ.3 లక్షల వరకు సున్నా; రూ.3-7 లక్షల వరకు 5%; రూ.7- 10 లక్షల వరకు 10%; రూ.10- 12 లక్షల వరకు 15%; రూ.12-15 లక్షలు 20%; రూ.15 లక్షలు దాటితే 30% పన్ను విధించారు. కొత్త పన్నుకు సంబంధించి 2025-26 బడ్జెట్‌లో విప్లవాత్మక మార్పును తీసుకొచ్చారు. రూ.12 లక్షల వరకు ఎలాంటి పన్ను (స్టాండర్డ్ డిడక్షన్‌తో కలుపుకొంటే రూ.12.75 లక్షలు చెల్లించాల్సిన అవసరం లేకుండా రిబేట్‌ను పెంచారు. పన్ను శ్లాబులనూ సవరించారు.

రవి ఏటీఎంకి వెళ్లి తన డెబిట్ కార్డుతో కొంత నగదు విత్‌డ్రా చేశాడు. ఆపై షాపింగ్‌కు వెళ్లాడు. అక్కడ రూ.10వేలు విలువైన వస్తువులను కొనుగోలు చేశాడు. పెద్ద మొత్తం కావడంతో తన పర్సులో ఉన్న క్రెడిట్ కార్డును వినియోగించాడు. అలా తనకు నాలుగైదు బ్యాంకులకు సంబంధించి క్రెడిట్, డెబిట్ కార్డులున్నాయి. దీంతో పర్సు మొత్తం వాటితోనే నిండిపోయింది. ఇలాంటి సందర్భంలో రెండింటికీ ఒకటే కార్డు ఉంటే ఎంత బాగుణ్ణో అనుకున్నాడు. ఒక్క రవికే కాదు.. మనలో చాలామందిదీ ఇదే పరిస్థితి. అలాంటి వారి కోసమే ప్రముఖ కార్డు నెట్‌వర్క్ సంస్థ వీసా.. క్రెడిట్ అండ్ డెబిట్ కార్డును తీసుకురాబోతోంది. ఈ తరహా కార్డు జపాన్‌లో విజయవంతం కావడంతో భారత్‌కూ తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. వీసా ఫ్లెక్సిబుల్ క్రెడిన్షియల్ (వీసా ఫ్లెక్స్) పేరుతో వీసా తీసుకురాబోయే ఈ కార్డును క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డులా వినియోగించుకోవచ్చు. లావాదేవీ విలువను బట్టి, మర్చంట్ టైప్‌ను బట్టి, వ్యక్తుల అవసరాలను బట్టి మీకు నచ్చిన విధంగా మార్చుకోవచ్చు. కార్డుపై ఉండే 16 నంబర్ల సంఖ్యలో మాత్రం ఎలాంటి మార్పూ ఉండదు. చిన్న చిన్న లావాదేవీలకు డెబిట్ కార్డు.. పెద్ద లావాదేవీలకు క్రెడిట్ కార్డు అని సంబంధిత మొబైల్ బ్యాంక్ యాప్‌లో సెట్ చేసుకోవచ్చు. అవసరమైతే దీన్నో ప్రీపెయిడ్, ఫారెక్స్ కార్డు గానూ వినియోగించు కోవచ్చు. దీనివల్ల వేర్వేరు అవసరాల కోసం వేర్వేరు కార్డులు వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండబోదని ఉండబోదని వీసా ఇండియా అండ్ సౌత్ ఏషియా కంట్రీ మేనేజర్ సందీప్ ఘోష్ 'బిజినెస్ స్టాండర్డ్'తో పేర్కొన్నారు.



**టెకీలూ.. భారత్‌కొచ్చేయండి**

జపాన్‌లో సుమిటోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్, సుమిటోమో మిత్సుయి కార్డ్ కంపెనీతో కలిసి వీసా సంస్థ ఆలివ్ పేరిట ఈ తరహా కార్డును లాంచ్ చేసింది. దీనిద్వారా డెబిట్, క్రెడిట్, రివార్డు పాయింట్స్‌ను యాక్సెస్ చేసుకునే వెసులుబాటును కల్పిస్తోంది. సుమారు 50 లక్షల మంది కస్టమర్లు దీన్ని వినియోగిస్తున్నారు. వియత్నాంలోనూ ఇలాంటి సేవలనే వీసా నెట్‌వర్క్ ప్రారంభించింది. భారత్‌లోనూ ఈ కార్డును తీసుకొచ్చేందుకు నియంత్రణ సంస్థల ఆమోదం కోసం వేచి చూస్తోంది. వివిధ బ్యాంకులతో కలిసి ఈ కార్డును తీసుకొచ్చే అవకాశం ఉంటుంది. గతంలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ డెబిట్ కమ్ క్రెడిట్ కార్డును లాంచ్ చేసింది. ఇందులో రెండు చిప్‌లు, రెండు వేర్వేరు నంబర్లు ఉంటాయి. ఒకవైపు డెబిట్ కార్డులా, ఇంకోవైపు క్రెడిట్‌కార్డులా ఉపయోగించుకోవచ్చు.

# 168 గంటల్లో రూ. 16వేలు పెరిగిన గోల్డ్ రేటు!

బంగారం ధరలు బ్రేకుల్లేని బండిలా దూసుకెళ్తోంది. ఉదయం ఒక రేటు కనిపిస్తే.. సాయంత్రానికే ధరల్లో వ్యత్యాసం కనిపిస్తోంది. మొత్తానికి గోల్డ్ రేటు భారీగా పెరిగిపోయింది. ఈ కథనంలో వారం రోజుల్లో (జనవరి 18 నుంచి 24 వరకు) పసిడి ధరలు ఎంత పెరిగాయో వివరంగా తెలుసుకుందాం. జనవరి 18న 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు హైదరాబాద్, విజయవాడలలో రూ. 1,43,780 వద్ద ఉండేది. ప్రస్తుతం ఈ రేటు రూ. 160260 వద్దకు చేరింది. అంటే 7 రోజుల్లో (168 గంటల్లో) బంగారం ధర రూ. 16వేలు కంటే ఎక్కువ పెరిగింది. 22 క్యారెట్ల పసిడి ధర రూ. 1,31,800 వద్ద నుంచి 1,46,900 రూపాయల వద్దకు (రూ. 15వేలు కంటే ఎక్కువ) చేరింది. చెన్నైలో కూడా గోల్డ్ రేటు వారం రోజుల్లో భారీగా పెరిగింది. 24 క్యారెట్ల 10 గ్రాముల రేటు రూ. 1,44,870 వద్ద నుంచి 1,59,490 రూపాయల వద్దకు చేరింది. దీన్నిబట్టి చూస్తే వారం రోజులో 14620 రూపాయల వ్యత్యాసం కనిపిస్తోంది. 22 క్యారెట్ల గోల్డ్ రేటు విషయానికి వస్తే.. ఇది 1,32,800 రూపాయల నుంచి రూ. 1,47,500 వద్దకు చేరింది. ఢిల్లీలో జనవరి 18న రూ. 1,43,930 వద్ద ఉన్న 10 గ్రాముల 24 క్యారెట్ల రేటు ఈ రోజుకు (శనివారం) రూ. 1,60,410 వద్దకు (రూ. 16480 తేడా) చేరింది. 22 క్యారెట్ల బంగారం విషయానికి వస్తే.. ఇది 131950 రూపాయల నుంచి 147050 రూపాయల వద్దకు చేరింది.



**వెండి ధరలు**

భారతదేశంలో వెండి ధరలు చాలా వేగంగా ఎగబాకాయి. గత ఆదివారం (జనవరి 18) రూ. 3.10 లక్షల వద్ద ఉన్న కేజీ సిల్వర్ రేటు.. శనివారం నాటికి రూ. 3.65 లక్షలకు చేరింది. అంటే వారం రోజుల్లో వెండి రేటు రూ. 55వేలు పెరిగిందన్న మాట.

## స్పోర్ట్స్

# అండర్-19 వరల్డ్ కప్.. భారత్ హ్యాట్రిక్ విజయం

**బులవాయో:** అండర్-19 ప్రపంచ కప్ (ఖ-19 ఔశీతీశ్రీస జబజూ 2026)లో భారత్‌కు విజయం సాధించింది. గ్రూప్ బిలో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో(డక్‌వర్త్‌లూయిస్ పద్ధతి) టీమ్‌ఇండియా గెలిచింది. యువ భారత్‌కు ఇది హ్యాట్రిక్ విజయం. వర్షం కారణంగా మ్యాచ్‌ను 37 ఓవర్లకు కుదించారు. కివీస్ 36.2 ఓవర్లలో 136 పరుగులకు ఆలౌటైంది. ఋూూ ప్రకారం భారత్ లక్ష్యం 130పరుగులుగా నిర్దేశించారు. టార్గెట్‌ని ఇండియా 13.3 ఓవర్లలోనే ఛేదించింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (53; 27 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో మెరవగా.. వైభవ్ సూర్యవంశీ (40; 23 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) అదరగొట్టాడు. విహాన్ మల్హోత్రా (17ౖ), వేదాంత్ త్రివేది (13ౖ) పరుగులు చేశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్.. మన బౌలర్ల ధాటికి కివీస్ ఒక దశలో 22 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. జాకబ్ కాటర్ (23), జస్కరన్ సంధు (18) నిలవడంతో ఆ జట్టు కాస్త కోలుకుంది. వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔటవడంతో కివీస్ 69/7తో మళ్లీ కష్టాల్లో పడింది. ఈ దశలో కల్లమ్ శాంసన్ (37ౖ), సెల్విన్ సంజయ్ (28) కివీస్‌ను ఆదుకున్నారు. భారత బౌలర్లలో ఆర్ఎస్ అంబరీష్ (4/29), హెనిల్ పటేల్ (3/23) అదరగొట్టగా.. ఖిలాన్ పటేల్, మహ్మద్ ఎనాన్, కనిష్క్ చౌహాన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.



## న్యూజిలాండ్ చిత్తు చిత్తు.. భారత్ హ్యాట్రిక్ విజయం



**బులావాయో::** ఐసీసీ అండర్ 19 వరల్డ్‌కప్‌లో భారత్ మరో విజయాన్ని నమోదు చేసింది. ఈరోజు(శనివారం, జనవరి 24వ తేదీ) న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఘన విజయం నమోదు చేసింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో టీమిండియా ఏడు వికెట్ల తేడాతో గెలుపును అందుకుంది. దాంతో ఈ వరల్డ్‌కప్‌లో భారత్ హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 36.2 ఓవర్లలో 135 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆపై 136 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్ 13.3 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. ఆ సమయంలో వర్షం రావడంతో మ్యాచ్‌లో విజేతను డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నిర్ణయించారు. ఫలితంగా భారత్ ఏడు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై విజయాన్ని అందుకుంది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం భారత్ 17 ఓవర్లలో 90 పరుగులు చేస్తే విజయం సాధించినట్లు. దాంతో భారత్ అప్పటికే ముందంజలో ఉండటంతో విజయం అడ్డుకోవడానికి కివీస్‌కు ఎటువంటి చాన్స్ లేకుండా పోయింది. భారత బ్యాటర్లలో వైభవ్ సూర్యవంశీ(40: 23 బంతుల్లో 2 ఫోర్లు, 3సిక్సర్లు) మరోసారి విజృంభించి ఆడాడు. అతనికి జతగా కెప్టెన్ ఆయుష్(53: 27 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. దాంతో భారత్ స్కోరు 9.5 ఓవర్లలోనే 100 పరుగుల మార్కును దాటేసింది. అంతకుముందు భారత బౌలర్లలో అంబ్రిష్ నాలుగు వికెట్లతో కివీస్ పతనాన్ని శాసించగా, హెనిల్ పటేల్ మూడు వికెట్లతో మెరిశాడు.

## దిగ్గజాలకు షాక్!.. అది నిజమే: బీసీసీఐ

ఆటగాళ్ల వార్షిక కాంట్రాక్టు గ్రేడ్‌లలో మార్పులపై భారత క్రికెట్ నియంత్రణ మండలి స్పందించింది. గ్రేడ్‌ను ఎత్తివేస్తున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా శనివారం ధ్రువీకరించారు.

బోర్డు సంతృప్తితో లేదు

గ్రేడ్‌ను తొలగించే విషయంలో త్వరలోనే తుది నిర్ణయం తీసుకోబోతున్నాం. ప్రస్తుతం ఈ కేటగిరిలో ఉన్న ఆటగాళ్లు మూడు ఫార్మాట్లు కాకుండా.. కేవలం ఒకే ఒక్క ఫార్మాట్ ఆడేందుకు సుముఖంగా ఉన్నారు. గ్రేడ్‌లో కొనసాగేందుకు కావాల్సిన అర్హతలు ఇప్పుడు ఎవరూ కలిగిలేరు. ఈ విషయంలో బోర్డు సంతృప్తితో లేదు. ఈ గ్రేడ్‌లో ఉన్న కొంతమంది ఆటగాళ్లు మూడు ఫార్మాట్లు ఆడవద్దని నిర్ణయించుకున్నారు. మా నిబంధనలకు అనుగుణంగా ఎవరూ లేరు కాబట్టి ఈ గ్రేడ్‌ను తీసివేయాలని ఫిక్సయిపోయాం" అని దేవజిత్ సైకియా స్పోర్ట్స్‌స్టార్‌తో పేర్కొన్నారు.





**రో-కో వన్డేలలో మాత్రమే**

కాగా గతేడాది ప్రకటించిన సెంట్రల్ కాంట్రాక్టులలో బ్యాటింగ్ దిగ్గజాలు, మాజీ కెప్టెన్లు విరాట్ కోహ్లి రోహిత్ శర్మలతో పాటు.. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా పేస్ దళ నాయకుడు జస్‌ప్రీత్ బుమ్రా మాత్రమే గ్రేడ్‌లో ఉన్నారు. వీరిలో కోహ్లి, రోహిత్ ఇప్పటికే అంతర్జాతీయ టీ20లు, టెస్టుల నుంచి రిటైర్ అయ్యారు.



# జనాలతో నాకేం సంబంధం?


అక్కినేని నాగచైతన్య ను వివాహం చేసుకున్న తర్వాత సినిమాలకు దూరంగా ఉంటూ, ఇంటి బాధ్యతల్లో నిమగ్నమైన శోభిత ధూళిపాళ్ల మళ్లీ వార్తల్లో నిలిచింది. పెళ్లి తర్వాత ఆమె నటించిన తొలి చిత్రం 'చీకటిలో' జనవరి 23 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. సురేష్ బాబు నిర్మాణంలో, శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈక్రమంలో.. తాజాగా, శోభిత ప్రమోషన్స్‌లో పాల్గొని ఆసక్తికర కామెంట్స్ చేసింది. తన వ్యక్తిగత అభిప్రాయాలను, వృత్తిపరమైన నిర్ణయాలను పంచుకున్నారు.'పెళ్లైన తర్వాత వస్తున్న మొదటి సినిమా కదా.. జనాలు మిమ్మల్ని ఎలా రిసీవ్ చేసుకుంటారని భావిస్తున్నారు?' అని యాంకర్ ప్రశ్నించగా, శోభిత చాలా స్పష్టమైన సమాధానం ఇచ్చింది. "జనాలు ఏమనుకుంటారో అని ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే, నాకంటూ ఒక వ్యక్తిత్వం ఉండదు. వైజాగ్‌లో చదువుకున్నప్పటి నుంచి ఇప్పటివరకు నాకు నచ్చిన పనులే చేస్తున్నాను. సినిమాల్లోకి వచ్చిన తర్వాత కూడా నా మనసుకి నచ్చిన పాత్రలనే ఎంచుకుంటున్నాను. నేను నమ్మిన ప్రాజెక్ట్‌ను ఎప్పుడూ నిజాయితీగా చేస్తాను. నేను చేసే పని వల్ల జనాలు మెచ్చుకుంటారా లేదా నొచ్చుకుంటారా అని నేను ఎప్పుడూ ఆలోచించను. ఒక నటిగా నాకు నచ్చిన పాత్రకు న్యాయం చేయడమే నా బాధ్యత" అని శోభిత చెప్పింది. సమాజం లేదా ప్రేక్షకుల అభిప్రాయాల కోసం తన నిర్ణయాలను మార్చుకోనని ఆమె చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి.



# బాలయ్య- గోపీచంద్ కాంబినేషన్‌లో మరో సినిమా

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ వరుస విజయాలతో బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతున్నారు. 'వీరసింహా రెడ్డి' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత బాలయ్య – గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. మొదట ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో కూడిన పీరియాడికల్ డ్రామాగా తెరకెక్కించాలని ప్లాన్ చేశారు. కానీ, బడ్జెట్ పరిమితులు దృష్ట్యా ఈ కథను పక్కన పెట్టి, బాలయ్య ఇమేజ్‌కు సరిపోయే పక్కా మాస్ యాక్షన్ కథను గోపీచంద్ మలినేని సిద్ధం చేశారు. ఇప్పుడు మారిన పరిస్థితుల దృష్ట్యా ఒక పవర్‌ఫుల్ సోషల్ కథతో రాబోతున్నదని తెలుస్తోంది. ఎవరి ఊహకూ అందని రీతిలో ఈ కథ ఉంటుందని సమాచారం. ఇటీవలే ఈ కొత్త స్టోరీ లైన్‌ను బాలయ్యకు చెప్పగా దానికి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సినిమా సెట్స్‌పైకి వెళ్లేందుకు ముహూర్తం ఖరారైంది. వచ్చే మార్చి నెల నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం. తొలి షెడ్యూల్‌లోనే బాలయ్య మార్క్ హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేందుకు దర్శకుడు ప్లాన్ చేస్తున్నారట. కథ మారిన నేపథ్యంలో, గతంలో అనుకున్న నయనతారే హీరోయిన్‌గా కొనసాగుతారా లేదా కొత్త కథకు తగ్గట్టుగా మరో హీరోయిన్‌ను తీసుకుంటారా అనే విషయంపై త్వరలోనే స్పష్టత రానుంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రంపై నందమూరి అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలయ్య మార్క్ డైలాగులు, గోపీచంద్ మలినేని టేకింగ్ కలిసి మరోసారి బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టించడం ఖాయమని అభిమానులు అంచనా వేస్తున్నారు.

# ఎట్టకేలకు ఓటీటీలోకి 'ఛాంపియన్'




టాలీవుడ్ సీనియర్ హీరో శ్రీకాంత్ తనయుడు రోషన్ మేక, 'పెళ్లి సందడి' వంటి హిట్ తర్వాత నటించిన లేటెస్ట్ మూవీ 'ఛాంపియన్'. పీరియాడికల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రం, గతేడాది డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా థియేటర్లలో విడుదలైంది. నేషనల్ అవార్డ్ విన్నర్ ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా, బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్నప్పటికీ, రోషన్ నటనకు సినిమాలోని ఎమోషన్స్‌కు మంచి మార్కులే పడ్డాయి. ఇప్పుడు నెల రోజుల తర్వాత ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. తాజాగా, ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా వెల్లడిస్తూ.. ఓ పోస్ట్ పెట్టారు. జనవరి 29 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ అందుబాటులోకి రాబోతున్నట్లు తెలిపారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి అందుబాటులోకి రానుంది. అయితే హిందీ వెర్షన్ మాత్రం కొంచెం ఆలస్యంగా స్ట్రీమింగ్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా..ఈ సినిమాలో రోషన్ సరసన అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించగా.. అర్చన, నరేష్, కోవై సరళ, వెన్నెల కిశోర్ వంటివారు కీలక పాత్రలు పోషించారు. స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ వంటి ప్రతిష్టాత్మక బ్యానర్లు ఈ సినిమాను నిర్మించాయి. ఒక యంగ్ బాక్సర్ తన లక్ష్యం కోసం చేసే పోరాటాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించిన ఈ చిత్రాన్ని థియేటర్లో మిస్ అయిన వారు, ఇప్పుడు ఓటీటీలో చూసి ఎంజాయ్ చేయవచ్చు.



# ప్రతి విరామానికి ఓ అర్థం

అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో ఎమోషనల్ డ్రామా నేపథ్యంతో రూపొందిన చిత్రం 'లాక్‌డౌన్'. ఏఆర్ జీవా దర్శకత్వం వహించారు. గతేడాది విడుదల కావాల్సిన ఈ సినిమాని తమిళనాడులోని పలు ప్రాంతాల్లో సంభవించిన తుపానుతో పాటు పలు కారణాలతో విడుదలను వాయిదా వేసింది నిర్మాణసంస్థ. ఎట్టకేలకు ఈ సినిమా కొత్త విడుదల తేదీని ఖరారు చేసుకుంది. ఈ సినిమా ఈ నెల 30 థియేటర్లలో విడుదల కానుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ సామాజిక మాధ్యమాలలో 'ప్రతి విరామానికి ఓ అర్థం ఉంటుంది' అంటూ ఓ పోస్టర్‌తో అధికారికంగా ప్రకటించింది. నాయికా ప్రాధాన్యంగా తెరకెక్కిన ఈ చిత్రంలో అనుపమ అనిత అనే పాత్రలో కనిపించనుంది. కరోనా లాక్‌డౌన్ సమయంలో ఎదురైన సమస్యలతో సతమతమవుతున్న ఓ యువతిగా ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌తో వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని రూపొందించినట్లు స్పష్టంచేసింది చిత్రబృందం.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

ధర్మఘంట

# బాధ్యతతో సురక్షితమైన ప్రయాణం సాగించాలి






**సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి**

**ధర్మఘంట జనవరి 24 సత్తుపల్లి:**

ప్రతి ఒక్కరూ బాధ్యతతో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితమైన ప్రయాణం సాగించాలని సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలో భాగంగా పోలీస్ శాఖ నిర్వహిస్తున్న అరైవ్-అలైవ్ కార్యక్రమాన్ని ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో శనివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలోని జీవి షాపింగ్ మాల్ లో పనిచేస్తున్న సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ.. అతివేగం,మద్యం మత్తు,ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీంతో రహదారులు నెత్తురోడుతుండగా విలువైన ప్రాణాలు కోల్పోయి, బాధిత కుటుంబాల్లో విషాదం అలుముకుంటోందన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ జిల్లాలో ప్రమాదాల నివారణపై దృష్టి సారించిందని,కాబట్టి వాణిజ్య,వర్తక వ్యాపారులు తమ వద్ద పనిచేస్తున్న వారికి కూడా తమవంతు భాద్యతగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు.

## రామగుండం పోలీస్ కమిషనరేట్లో లొంగిపోయిన 8మంది మావోయిస్టులు..



**రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా**

**ధర్మఘంట జనవరి 24,రామగుండం :**

నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఎనిమిది మంది మిలీషియా, కోరియర్, సాంస్కృతిక విభాగం, లోకల్ కమిటీ సభ్యులు రామగుండం కమిషనరేటు పోలీసుల ఎదుట శనివారం లొంగిపోవడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ ప్రజలకు చేస్తున్నటువంటి వివిధ రకాల సహాయ సహాకారాలు మరియు లొంగిపోయిన మావోయిస్టుల పట్ల చూపిస్తున్న ఆదరణను గురించి తెలుసుకుని, తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించుకొని, కమీషనర్ ఆఫ్ పోలీస్ రామగుండం ఎదుట కమిషనరేటు కార్యాలయంలో లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ధర్మాజీ శ్రీకాంత్ ఒక్కడే తెలంగాణ రాష్ట్రానికి చెందింన వాడు మిగిలిన వాళ్ళందరూ చతిస్ ఘడ్ రాష్ట్రం,బీజాపూర్ జిల్లా, గంపూర్ గ్రామం, గాంగేలురు పోలీస్ స్టేషన్ పరిధికి చెందినవారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులను జనజీవన స్రవంతిలోకి రావాల్సిందిగా కోరుచున్నాము తెలంగాణ మావోయిస్టులు వారి గ్రామాలకు తిరిగి రావాలని తెలంగాణ అభివృద్ధికి తోడ్పడాలని కోరుతున్నాం. అజ్ఞాత మావోయిస్టులు వారి గ్రామాలకు తిరిగి వచ్చినట్లయితే తెలంగాణ ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టులకు ఇచ్చే పునరావాస పథకాలు ఇతర సహాయ సహకారాలు అందిస్తుంది. లొంగిపోయిన సభ్యులకు జీవనోపాధి పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వం తరఫున అందవలసిన అన్ని ప్రతిఫలాలను అందజేయడానికి రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ శాఖ ఎల్లప్పుడు కృషి చేస్తుంది అని హామీ ఇస్తున్నాం. ప్రస్తుత సమాజంలో యువత చైతన్య వంతంగా వ్యవహరిస్తున్నది చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వారు దూరంగా ఉంటున్నారు. మావోయిస్టు పార్టీలోకి రిక్రూట్మెంట్ పూర్తిగా తగ్గిపోయింది చదువుతున్న వారు ఎవరు మావోయిస్టు పార్టీలోకి వెళ్లడం లేదు అజ్ఞాతంలో ఉన్న ఆదిలాబాద్ కరీంనగర్ జిల్లా మావోయిస్టులు కూడా వారి గ్రామాలకు తిరిగి రావాలని కోరుతున్నాం . పోరు వద్దు ఊరు ముద్దు ఆయుధాలను, అజ్ఞాతాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవండి అని పోలీస్ శాఖ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్,ఏఆర్ ఏసిపి ప్రతాప్, ఇన్స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, భీమేష్, ఆర్ ఐ శేఖర్, ఆర్ ఎస్ ఐ లు వెంకట్, శివ తదితరులు పాల్గొన్నారు.



## భీం డ్రమ్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద "ఎల్లుదామ ఎల్లుదామ జాతర" సమ్మక్క సారక్క పాట 2026 ఫుల్ సాంగ్ ఘన విడుదల.



**ధర్మఘంట, జనవరి 24, హైదరాబాద్ :**

సమ్మక్క సారక్క జాతర యొక్క విశిష్టతను, ఆదివాసీ సంస్కృతి గౌరవాన్ని ప్రతిబింబించే "ఎల్లుదామ ఎల్లుదామ జాతర" సమ్మక్క సారక్క పాట 2026 ఫుల్ సాంగ్‌ను భీం డ్రమ్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో శనివారం డి.బి.ఎస్.ఏ, భీం డ్రమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. నలిగంటి శరత్ చమార్ మరియు జబర్దస్త్ ఫేమ్ జీవన్ మరియు ఓయూ విద్యార్థి సంఘాల సమక్షంలో ఘనంగా విడుదల చేశారు. ఈ పాటను డి.బి.ఎస్.ఏ, భీం డ్రమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. నలిగంటి శరత్ చమార్ గానం అందించారు. ఈ పాటకు చికోడు నర్సన్న సాహిత్యం అందించగా, సంగీతాన్ని ప్రశాంత్, కాస్టు జబర్దస్త్ ఫేమ్ జీవన్ సమకూర్చారు. ఈ గీతానికి డి.ఓ.పి కృష్ణ మెరుగు నిర్వహించగా, అసిస్టెంట్ డీ.ఓ.పీగా నవీన్, నిర్మాతగా ముప్పరపు ప్రకాష్, కో ఆర్డినేటర్‌గా కల్లెపల్లి సతీష్, పోస్టర్ డిజైన్‌ను వర్షిత్ బామర్ రూపొందించారు. ఈ సందర్భంగా డి.బి.ఎస్.ఏ, వ్యవస్థాపక అధ్యక్షుడు డా. నలిగంటి శరత్ చమార్ మాట్లాడుతూ... సమ్మక్క సారక్క జాతరలోని పోరాట చరిత్ర, ఆదివాసీ స్వరం, సాంస్కృతిక విలువలను ఈ పాట ప్రభావవంతంగా ప్రతిబింబిస్తోందని, ఇలాంటి సాంస్కృతిక గీతాలు యువతకు తమ మూలాలను గుర్తు చేస్తాయని, ఆదివాసీ సంస్కృతి పరిరక్షణకు బలమవుతాయని వారు అభిప్రాయపడ్డారు.

జబర్దస్త్ ఫేమ్ జీవన్ మాట్లాడుతూ,ఇది కేవలం ఒక పాట కాదు, ఆదివాసీ జీవన శైలిని గుండెతో అనుభూతి చెందే ప్రయత్నమని అన్నారు. సమ్మక్క సారక్క జాతర అస్థితాన్ని యువతకు చేరవేసే శక్తి ఈ పాటకు ఉందని, ఇలాంటి సృజనాత్మక ప్రయత్నాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఎల్లుదామ ఎల్లుదామ జాతర సమ్మక్క సారక్క పాట 2026 ఫుల్ సాంగ్ విడుదలై శ్రోతల నుంచి విశేష స్పందనను పొందుతోంది. ఈ కార్యక్రమంలో డి.బి.ఎస్.ఏ స్టేట్ కో ఆర్డినేటర్ జంగిలి దర్శన్, టి.ఎస్.పి. జాక్ వ్యవస్థాపక అధ్యక్షుడు వలిగొండ నర్సింహా, బి.ఎస్.ఎఫ్.ఐ నేషనల్ కో ఆర్డినేటర్ కరుణాకర్ బహుజన్, బి.ఎస్.యూ రాష్ట్ర అధ్యక్షుడు కత్తి వీరన్న, అంసా ఓయూ అధ్యక్షుడు నామ సైదులు, ఏ.ఐ.ఎస్.ఆఫ్ ఓయూ అధ్యక్షుడు ఉదయ్, ఎస్.ఎస్.యూ రాష్ట్ర అధ్యక్షుడు నవీన్, ఎస్.ఎస్.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేదాంథ్ మౌర్య, డి.బి.ఎస్.ఏ విద్యార్థి నాయకులు కాసర్ల సైదులు, రవీందర్, ప్రణయ్, మరియు శ్రీను కుషాల్ తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ లాకప్ డెత్ ఘటనపై ఎన్‌హెచ్ఆర్సీ సీరియస్

**మేజిస్టీరియల్ విచారణకు ఆదేశాలు**

**ధర్మఘంట జనవరి 24 కోదాడ:**

సూర్యాపేట జిల్లా కోదాడలో చోటుచేసుకున్న దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ ఘటనపై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్.హెచ్.ఆర్.సీ) తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనను అత్యంత గంభీరంగా పరిగణించిన ఎన్‌హెచ్ఆర్సీ, మేజిస్టీరియల్ విచారణ నిర్వహించాలని ఆదేశిస్తూ తెలంగాణ డీజీపీ,సూర్యాపేట జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీకి నోటీసులు జారీ చేసింది. గత ఏడాది నవంబర్ నెలలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ విషయంలో తనకు అన్యాయం జరిగిందంటూ కర్ల రాజేష్ కోదాడ పోలీసులను ఆశ్రయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాజేష్‌ను కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి,అక్కడ పోలీసులు చిత్రహింసలకు గురిచేశారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. కోదాడ రూరల్ సీఐ, చిలుకూరు ఎస్ఐ,ఏఎస్ఐ వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కలిసి రాజేష్‌పై అమానుషంగా దాడులు చేశారని ఫిర్యాదుదారు ఆరోపించారు. పోలీసుల చిత్రహింసలు తట్టుకోలేక కర్ల రాజేష్ మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రసంచలనంగా మారింది. ఈ లాకప్ డెత్ ఘటనపై ఢిల్లీ యూనివర్సిటీలో లా విద్యను అభ్యసిస్తున్న,రంగారెడ్డి జిల్లాకు చెందిన సభావత్ కళ్యాణ్ జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. బాధితుడికి న్యాయం జరగాలన్న ఉద్దేశంతో ఈ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సభావత్ కళ్యాణ్ ఫిర్యాదుపై స్పందించిన ఎన్‌హెచ్ఆర్సీ,ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరపాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఎనిమిది వారాల లోపు ఈ ఘటనకు సంబంధించిన పూర్తి చర్యల నివేదికతో పాటు,మేజిస్టీరియల్ విచారణ నివేదికను కూడా సమర్పించాలని స్పష్టంగా పేర్కొంది. లాకప్ డెత్ వంటి ఘటనలు ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయని,మానవ హక్కుల ఉల్లంఘనలకు తావు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని న్యాయవాదులు, మానవ హక్కుల కార్యకర్తలు అభిప్రాయపడు తున్నారు. కర్ల రాజేష్ కుటుంబానికి న్యాయం జరగాలని,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై ప్రభుత్వ చర్యలు,విచారణ ఫలితాలపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది.



## ప్రజల అభీష్టమేరకు కంటోన్మెంటును జిహెచ్ఎంసిలో విలీనం చేయాల్సిందే





**టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్,మాజీ ఎంపీ మధు యాష్కి గౌడ్**

**కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ చేపడుతున్న దీక్షకు సంఘీభావం**


**ధర్మఘంట జనవరి 24 హైదరాబాద్:**

కంటోన్మెంట్ బోర్డును జిహెచ్ఎంసి లో విలీనం చేయాలన్న డిమాండ్ తో గత నాలుగు రోజులుగా దీక్ష నిర్వహిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ కు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్,మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ మద్దతు తెలిపారు. శనివారం శ్రీగణేష్ చేపడుతున్న దీక్షా శిబిరం వద్దకు వెళ్లిన మధుయాష్కీ తన సంఘీభావని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కంటోన్మెంట్ ను జిహెచ్ఎంసిలో విలీనం చేయాలన్న డిమాండ్ న్యాయ సమ్మతమైనదన్నారు. కంటోన్మెంట్లో నివసిస్తున్న ప్రజలకు సకాలంలో ఇంటి అనుమతులు, తాగునీరు,రోడ్లు,డ్రైనేజీ తదితర కనీస మౌలిక వసతులకు పొందాలంటే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితిలో ఏర్పడ్డాయన్నారు. ఈ విషయంలో స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఒకప్పుడు నగరానికి శివారులో కంటోన్మెంటు ఉండేదని,ఇప్పుడు నగర విస్తరణతో జిహెచ్ఎంసిలో భాగమైందన్నారు. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు పలు రాష్ట్రాలలోని కంటోన్మెంట్ ప్రాంత ఎంపీలతోనూ మాట్లాడి కంటోన్మెంట్ల విలీనంపై చర్చించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ విషయంపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల అభీష్టం మేరకు ప్రభుత్వాలు పనిచేయాల్సిందేనని పేర్కొన్నారు. కంటోన్మెంట్ ను జిహెచ్ఎంసిలో విలీనం చేసే వరకు జరిగే పోరాటంలో,నా సంపూర్ణ మద్దతు ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ కూడా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ఐఏఎస్ఐపీఎస్ అధికారుల ఆదర్శ వివాహం

**యాదాద్రి భువనగిరి జిల్లాలో పెళ్లి వేడుక**

**ధర్మఘంట జనవరి 24 భువనగిరి:**



యాదాద్రి భువనగిరి జిల్లాలో ఐఏఎస్,ఐపీఎస్ అధికారుల వివాహం ఆదర్శంగా నిలిచింది. చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎలాంటి ఆడంబరం లేకుండా అధికారులు రిజిస్టర్ వివాహం చేసుకున్నారు. చౌటుప్పల్ మండలం లింగారెడ్డిగూడెంకి చెందిన యువ ఐపీఎస్ అధికారి శేషాద్రిని రెడ్డిని,కడప జిల్లాకు చెందిన ఐఏఎస్ అధికారి శ్రీకాంత్ రెడ్డి వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం శేషాద్రిని రెడ్డి కుత్బుల్లాపూర్ డీసీపీగా విధులు నిర్వహిస్తుండగా,శ్రీకాంత్ రెడ్డి ప్రస్తుతం ఐఏఎస్ శిక్షణలో ఉన్నారు. సాధారణ ప్రజలకు ఆదర్శంగా నిలిచే విధంగా ఎలాంటి హంగులు,ఆర్భాటాలు లేకుండా జరిగిన ఈ వివాహానికి పలువురు ఉన్నతాధికారులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

## ఆర్థిక దారిద్ర్యం మానసిక రుగ్మతలకు దారితీస్తుందా...?



మన సమాజంలో ఆర్థిక వెనుకబాటుతనం మానసిక రుగ్మతలకు దారితీయవచ్చు. మన దేశంలో ఆర్థిక వెనుకబాటుతనం ఒక పెద్ద సమస్యగా మారుతుంది. ఇది కేవలం డబ్బు లోపం మాత్రమే కాదు,మానసిక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఒక ఇటీవలి అధ్యయనం ప్రకారం,దారిద్ర్యం మరియు మానసిక రుగ్మతల మధ్య అవినాభసంబంధం సంబంధం ఉంది. దారిద్ర్యాన్ని గృహాయామం, ఉద్యోగాయామం మరియు సామాజిక డెప్రివేషన్ ఆధారంగా కొలుస్తారు. దారిద్ర్యం మానసిక రుగ్మతలకు మరియు మానసిక రుగ్మతలు దారిద్ర్యానికి దారితీయడం జరుగుతుందని అధ్యాయనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా దారిద్ర్యం అటెన్షన్ డెఫిసిట్ హైపరాక్టివిటీ డిసార్డర్ రిస్క్‌ను 3.43 రెట్లు,మేజర్ డిప్రెసివ్ డిసార్డర్)ను 1.49 రెట్లు,మరియు స్కిజోఫ్రీనియాను 1.53 రెట్లు పెంచుతుంది. అయితే, అనోరెక్సియా నెర్వోసా విషయంలో దారిద్ర్యం రక్షణాత్మక ప్రభావాన్ని చూపుతుంది (ఓఆర్=0.50) కాగ్నిటివ్ ఎబిలిటీ దారిద్ర్యం ప్రభావాన్ని భాగంగా వివరిస్తుంది. కానీ, అడ్జస్ట్‌మెంట్ తర్వాత కూడా ప్రభావం కొనసాగుతుంది. ఈ అధ్యయనం జెనెటిక్ డేటా మరియు మెండెలియన్ రాండమైజేషన్ పద్ధతులను ఉపయోగించింది. ఇది యూరోపియన్ డేటా ఆధారంగా నిరూపితం అవుతుంది. మన దేశంలోనూ ఇలాంటి సమస్యలు ఉన్నాయి. దేశంలో గ్రామీణప్రాంతాలలో దారిద్ర్యం వల్ల ఒత్తిడి, పోషకాహార లోపం మానసిక సమస్యలను పెంచుతున్నాయి. ప్రభుత్వం క్యాష్ ట్రాన్స్‌ఫర్స్,విద్యా కార్యక్రమాలు ద్వారా దారిద్ర్యాన్ని తగ్గించాలి. ఇది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. అయితే,ఈ అధ్యయనం జెనెటిక్ డేటా మాత్రమే ఉపయోగించింది,క్లినికల్ ట్రయల్స్ లేవు,కాబట్టి మరిన్ని పరిశోధనలు అవసరం ఉంది. కాబట్టి సమస్యల సంబంధం మరియు చర్యలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. ఆర్థిక దారిద్ర్యం మానసిక రుగ్మతలకు దారితీయడం వల్ల దేశ అస్థిరతకు దారితీసే అవకాశం ఉంది. దారిద్ర్యం వల్ల ఒత్తిడి పెరిగి మానసిక సమస్యలు వస్తాయని రుజువు అవుతుంది. అందుకే దేశ ప్రజల స్థితిగతుల్లో మార్పు వచ్చేలా దేశాధినేతలు ప్రణాళికలు రూపొందించాలి.

**గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.**

ధర్మఘంట

# పోలీస్ సిబ్బందికి,కుటుంబ సభ్యులకు వైద్య శిబిరం





**600 మందికి పైగా పోలీసు, వారి కుటుంబాలకు వైద్య పరీక్షలు**
**పోలీస్ ఫిట్ గా ఉన్నప్పుడే సమాజం ఫిట్ గా ఉంటుంది**
**సూర్యాపేట జిల్లా కలెక్టర్**
**తేజస్ నందలాల్ పవార్**
**శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
**పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తాం**
**సూర్యాపేట జిల్లా ఎస్పీ**
**కె.నరసింహ**

**ధర్మఘంట జనవరి 24 సూర్యాపేట:**జిల్లా పోలీసు కార్యాలయం నందు పోలీసు సిబ్బందికి వారి కుటుంబ సభ్యుల సంక్షేమంలో భాగంగా శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ జిల్లా ఎస్పీ కె.నరసింహ ముఖ్య అతిధులుగా హాజరై కార్యక్రమ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది, సూర్యాపేట పట్టణానికి చెందిన హెల్తీపై ఆస్పటల్ యాజమాన్య సహకారంతో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలని, పోలీస్ ఫిట్ గా ఉన్నప్పుడే సమాజం ఫిట్ గా ఉంటుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు.పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యుల సంక్షేమంలో జిల్లా ఎస్పీ నరసింహ చొరవ ప్రశంసనీయమన్నారు.పోలీసు సిబ్బంది విరామం లేకుండా విధులు నిర్వర్తిస్తూ కుటుంబాల ఆరోగ్యం పట్ల,వ్యక్తిగత ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేస్తుంటారని,పని భారం కారణంగా సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోలేక పోతున్నారని,సిబ్బంది సంక్షేమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ఉచిత మెగా వైద్య శిభిరం పోలీసు సిబ్బందికి వారి కుటుంబాలకు ఎంతగానో ఉపయోగకరమని అన్నారు. సిబ్బంది సంక్షేమ కోసం ఆలోచన చేసి ఇంత పెద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసిన జిల్లా పోలీసు శాఖకు ఎస్పీకి అభినందనలు తెలిపారు.జిల్లా పోలీసు సంక్షేమం కోసం ఎస్పీ ఆధ్వర్యంలో అత్యాధునిక సదుపాయాలతో జిమ్ సెంటర్, సెంట్రల్ ప్రోవిజినల్ క్యాంటీన్ కూడా ఏర్పాటు చేశారని,క్రీడా మైదానాలు అభివృద్ధి చేశారని గుర్తు చేశారు.అనంతరం జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం నిరంతరంగా కృషి చేస్తానని తెలిపారు.పని ఒత్తిడి,పని భారంతో సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకోక చాలామంది సిబ్బంది అనారోగ్యాలతో బాధపడుతున్నారన్నారు.విధులు నిర్వహిస్తూనే కుటుంబ బాధ్యతలను,వ్యక్తిగత ఆరోగ్యాన్ని శ్రద్ధ వహించాలని తెలిపారు.సరైన సమయంలో దూరప్రాంతాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోలేక పోతున్నారని,దీనిలో భాగంగానే జిల్లా పోలీస్ కార్యాలయం నందు సిబ్బంది సంక్షేమ దృష్ట్యా కార్పొరేట్ స్థాయి వైద్య పరీక్షలు అందుబాటులోకి తెచ్చామని,ఉచిత వైద్య శిబిరం నిర్వహించి సిబ్బందికి మరియు సిబ్బంది కుటుంబాలకు వైద్య పరీక్షలు చేయించడం జరుగుతుందన్నారు.గడచిన కొద్ది రోజులుగా పోలీసు సిబ్బంది నిరంతరాయంగా కృషి చేస్తున్నారని అభినందించారు. దీర్ఘకాలిక వ్యాధులకు సైతం ఈ వైద్య శిబిరం ద్వారా చికిత్స అందించడం జరిగిందని తెలిపారు.పరీక్షల అనంతరం అవసరమైన మందులు అందజేయడం జరిగిందన్నారు. ఈ వైద్య శిబిరం నిర్వహించడం కోసం సూర్యాపేట పట్టణానికి చెందిన హెల్తీపై హాస్పిటల్ యాజమాన్యం,సూర్యాపేట జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్,జిల్లా ప్రభుత్వ వైద్య శాల వైద్యులు కృషి చేశాయని,వారందరికీ జిల్లా పోలీస్ శాఖ తరపున అభినందనలు,ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.ఈ శిబిరం ద్వారా జనరల్ మెడిసిన్, గైనకాలజి, ఎముకలు, నర్సింగ్ సేవలు,క్రిటికల్ కేర్,పిల్లలు వైద్యనిపుణులు,పంటి వైద్య నిపుణులు,వినికిడి నిపుణులు పాల్గొని వైద్య సేవలు అందించారన్నారు.అలాగే రక్త పరీక్షలు,గుండె పరీక్షలు,కిడ్నీ, కాలేయం,కొలస్ట్రాల్ పరీక్షలు చేయడం జరిగిందన్నారు.జిల్లా ప్రభుత్వ వైద్యశాల వైద్యబృందం, హెల్తీ ఫై హాస్పటల్ వైద్య బృందం, జిల్లా మరియు సూర్యాపేట పట్టణ కెమిస్ట్రీ అండ్ డ్రగిస్ట్, ఫార్మాస్యూటికల్ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ వారు సహాయ సహకారాలు అందించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవీందర్ రెడ్డి,జనార్దన్ రెడ్డి,జిల్లా వైద్యాధికారి వెంకటరమణ,జిల్లా ఆసుపత్రి వైద్యులు గీతాలక్ష్మి, డిఎస్పీలు ప్రసన్న కుమార్, నర్సింహాచారి,సిఐలు వెంకటయ్య, రాజశేఖర్,ఆర్ఐలు ప్రవీణ్ కుమార్, జానయ్య,వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం,సురేష్, అశోక్,పోలీస్ సంఘం అధ్యక్షుడు రామచందర్ గౌడ్, సభ్యులు వెంకన్న,అంజన్ రెడ్డి, వెంకయ్య,సైదాబి,హెల్తీ ఫై అస్పటల్ నిర్వాహకులు చలపతిరావు,జిల్లా మరియు సూర్యాపేట పట్టణ కెమిస్ట్రీ అండ్ డ్రగిస్ట్,ఫార్మాస్యూటికల్ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ వారు యానా ప్రభాకర్,పెండెం విజయ్,ముషం హరి,శ్రీనివాస్, వైద్య బృందం,సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి సంస్థను అధోగతి పాలు చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వమే..



**కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితుల్లోకి నెట్టిన ఘనత నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ దే**
**రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్**

**ధర్మఘంట జనవరి 24, రామగుండం :**
పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సింగరేణి సంస్థను అధోగతి పాలు చేసింది టిఆర్ఎస్ ప్రభుత్వమేనని కార్మికుల జీతాలు చెల్లించలేని పరిస్థితిలోకి నెట్టినా ఘనత నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుంది అని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014 నుండి ఎంక్వైరీ కమిషన్ వేసి సింగరేణి సంస్థను దోచుకున్నది ఎవరో తేల్చుకుందామని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. భూగర్భ గనులను పాతర పెట్టి రామగుండం ఊరు మధ్యలో ఉపరితల గనులను తెరిచి ఊరిని బొందల గడ్డగా మార్చారని ఆయన ఆసహనం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు అబద్దాలను ప్రచారం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. నియోజకవర్గానికి కొత్త విద్యుత్తు పరిశ్రమలను తీసుకువస్తే జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు రేట్ల పేరుతో రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సింగరేణి సంస్థను విస్తృత పరుస్తున్న కాంగ్రెస్ నాయకులపై చౌకబారు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే డైవర్షన్ పాలిటిక్స్ ప్లే చేస్తున్నారన్నారు. తెలంగాణలో బిఆర్ఎస్ పతనం మొదలైందని, అసత్యపు ప్రచారాలను ప్రజలు నమ్మరని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు పద్ధతి మార్చుకోవాలని... లేని పక్షంలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.ఈ ప్రెస్ మీట్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులున్నారు

## రోడ్డు భద్రతా ట్రాఫిక్ రూల్స్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం..

**తల్లిదండ్రులు హెల్మెట్ సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించేలా చూసుకోవటం పిల్లల బాధ్యత.**



**గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి**

**ధర్మఘంట, జనవరి 24 రామగుండం:**
జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు, అరైవ్ -అలైవ్ కార్యక్రమం లో భాగంగా ఈరోజు గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో గుడ్ మార్నింగ్ స్కూల్ లో పిల్లలకు రోడ్ భద్రత, ట్రాఫిక్ రూల్స్, మైనర్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ పై, మద్యం సేవించి వాహనాలను నడపడం వల్ల కలుగు ప్రమాదాలపై, పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో తల్లిదండ్రులు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించేలా చేయడం పిల్లల బాధ్యత అని గుర్తుచేశారు. రోడ్డు భద్రతా నియమాల ప్రాధాన్యతను వివరించారు. వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ మాట్లాడకూడదని, అధిక వేగంతో వాహనం నడపకూడదని, మైనర్స్ వాహనాలు నడపకూడదు అని చట్టరీత్యా నేరం అని తెలిపారు. అలాగే మద్యం సేవించి వాహనం నడవడం ప్రాణాలకు ప్రమాదకరమని మీమీ కుటుంబ సభ్యులకు తెలుపాలి అని అన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ నిబంధనలు క్రమంగా పాటిస్తూ గమ్యాన్ని చేరుకోవాలని తెలిపారు. మీమీ కుటుంబ సభ్యుల, మీ ఇంట్లో ఉండే వాహనాలకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ ఇన్సూరెన్స్ పేపర్స్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, లేకుంటే తప్పనిసరిగా చేపించాలని మీరు బాధ్యత గా తల్లితండ్రులకు తెలుపాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, ఎస్ ఐ అనూష, స్కూల్ డైరెక్టర్ సమ్మ రెడ్డి టీచర్ లు రజిత, మమతా, చందు, బ్లూ క్లోట్స్ సిబ్బంది మహేష్, సతీష్ పాల్గొన్నారు.

## జాతీయ బాలిక దినోత్సవం పై అవగాహన సదస్సు

**ధర్మఘంట, జనవరి 24,కరీంనగర్**
జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బొమ్మకల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్ ఆధ్వర్యంలో చట్టాల పై అవగాహన సదస్సు నిర్వహించారు, భారత రాజ్యాంగం బాలికలకు కల్పిస్తున్న హక్కుల గురించి, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలికల పై లైంగిక వేధింపుల ను ఎదుర్కోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు, విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు ఇట్టి కార్యక్రమంలో ఎలాంటి న్యాయపరమైన సహాయాన్ని అందించడానికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు ఇట్టి కార్యక్రమంలో లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తణుకు మహేష్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు




## ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం : జిల్లా ఎస్పీ మహేష్ బి గితే.






**ధర్మఘంట జనవరి 24, రాజన్న సిరిసిల్ల :**
ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని,ఓటు హక్కును వినియోగించుకోవడం మన అందరి బాధ్యత అని జిల్లా ఎస్పీ అన్నారు.జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం రోజున జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అధికారులు,సిబ్బందితో కలసి ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని,ప్రతి ఎన్నికలలో తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని సూచించారు.ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయవచ్చున్నారు. ప్రపంచ దేశాలలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం కలిగిన భారతదేశంలో ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికి తెలియజేయాల్సిన బాధ్యత పౌరులుగా మనందరి పైనా ఉన్నదన్నారు. ప్రజలను చైతన్యం చేయడం, వారికి ఓటు విలువ గురించి అవగాహన కల్పించడం ద్వారా ప్రజలంతా ఓటర్లుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య,సి.ఐ లు రవి, నాగేశ్వరరావు, ఆర్.ఐ లు మధుకర్,యాదగిరి,ఎస్.ఐ లు,పోలీస్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాలిక బాట భారత భవిత మాట

**వ్యక్తిత్వ వికాస నిపుణులు మాచన రఘునందన్**

**ధర్మఘంట జనవరి 24 సికింద్రాబాద్:**బాలికల సృజనాత్మకతకు తగిన ప్రోత్సాహం లభిస్తే చదువుతో పాటు కళలపై కూడా పట్టు సాధించే అవకాశం ఉంటుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు,పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటీ మాచన రఘునందన్ స్పష్టం చేశారు.జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ..ఆలోచనలకు సాక్షర రూపం ఇచ్చేది అభిరుచి అని,నృత్యం, సాహిత్యం,సంగీతం, ఆర్ట్,వంటి రంగాల్లో బాలికల కు ఉన్న ఆసక్తిని గమనించి, తదనుగుణంగా ప్రోత్సహించాల్సిన అవసరం తల్లిదండ్రులకు ఉందని గుర్తు చేశారు.మానసిక ఉల్లాసానికి, ఆలోచనలో పరిణతికి బాలికల మేధ,ప్రతిభ,పాటవాల రూపంలోనే ఆవిష్కృతం అవుతుందని "మాచన" స్పష్టం చేశారు.పద్మశ్రీలు మొదలుకుని, త్రివిధ దళాల్లో,రాజకీయాల్లో తమదైన స్థాయిలో,శైలిలో ఔరా అనిపించేలా స్త్రీ శక్తి ముందడుగు వేస్తున్నారంటే వారికి బాలికలుగా ఎంతో ప్రోత్సాహం ఉంటేనే సాధ్యం అవుతుందని రఘునందన్ అన్నారు.సికింద్రాబాద్ ఓల్డ్ సఫిల్ గూడాలో నివసించే నందకిశోర్ అనితలు మాచన ప్రశంస,అభిజ్ఞల ప్రతిభను ప్రోత్సహించడం పట్ల రఘునందన్ హర్షం వ్యక్తం చేస్తూ చిన్నారులను అభినందించారు.

## ప్రతి ప్రాణం విలువైనదే అందరూ బాధ్యతగా వ్యవహరించాలి జిల్లా ఎస్పీ మహేష్ బి గితే






**ధర్మఘంట జనవరి 24 ,రాజన్న సిరిసిల్ల జిల్లా :**
ప్రతి ప్రాణం విలువైనదే అని అందరూ బాధ్యతగా వ్యవహరించాలి అనిట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రాణాలకు భద్రత రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు.రోడ్డు భద్రతే లక్ష్యంగా సిరిసిల్ల పట్టణ కేంద్రంలో "అరైవ్అలైవ్" రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిరిసిల్ల పట్టణ పోలీస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన "అరైవ్అలైవ్" రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై వాహనదారులకు,విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గారు మాట్లాడుతూ పోలీసులు ఎంత అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా,ప్రజలు రోడ్లపై ప్రయాణించే సమయంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తేనే ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు.మనం నిబంధనలు పాటించినప్పటికీ, ఎదుటివారి నిర్లక్ష్యం వల్ల కూడా ప్రమాదాలు జరిగే అవకాశముందని, అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతతో వాహనాలు నడపాలని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. అనంతరం వాహనాలకు రోడ్ సేఫ్టీ అవగాహన పోస్టర్లు అట్టించి అధికారులు,వాహనదారులతో కలసి ఎస్పీ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# బస్టాండ్ బాత్రూం లో నవజాత శిశువు మృతదేహం

**ధర్మ ఘంట కామారెడ్డి జనవరి 24:**
ఆడ పిల్లలను ఎదగనిద్దాం వారికి అండగా ఉందాం అన్న నినాదాలు కేవలం మాటలకే పరిమితం అవుతున్నాయన్న విషయం లో ఎలాంటి సందేహం లేదు.అప్పుడే పుట్టిన నవజాత శిశువు మృత దేహం బస్టాండ్ చెత్త కుప్పలో దర్శనమిచ్చింది.నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చిన తల్లి ఈ దారుణానికి ఒడిగట్టిందా,లేక మరే కారణమా తెలియదు కానీ ఆడబిడ్డ పై ఇంత చులకన భావం ఇంకా సమాజం లో కొనసాగడం పై ప్రజలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. బాన్సువాడ లొ అమానవియ ఘటన జరిగింది.ఆర్టిసి బస్టాండ్ లోని మహిళల బాత్రూమ్ లో మృతి చెందిన నవజాత శిశువు మృత దేహం లభ్యం అయింది.మాతృత్వం లేని మహిళ అప్పుడే పుట్టిన నవజాత శిశువును బాత్రూమ్ లో విడిచి వెళ్ళారు.నవజాత శిశువుతో బాత్రూం లోకి తీసుకెళ్లిన వ్యక్తినీ చూసిన వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు.పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి శిశువు మృత దేహాన్ని మార్చూరి గదికి తరలించి విచారణ చేపట్టారు.అనేక కోణాలలో ఈ విషయం పై ఆరా తీస్తున్నారు.బస్టాండ్ లోని సీసీ కెమెరాల దృశ్యాలను తిలకిస్తున్నారు.ఏది ఏమైనా ప్రస్తుత సమాజం లో ఆడపిల్లల పై వివక్షత అనేది అందరినీ కంట తడి పెట్టిస్తుంది.

ధర్మఘంట

# ప్రజోపయోగ పనులకు అనువైన స్థలాలను గుర్తించాలి

**ధర్మ ఘంట నిజామాబాద్, జనవరి 24 :**

ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే అభివృద్ధి పనుల నిర్మాణాల కోసం అనువైన భూముల గుర్తింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని ప్రధాన సమావేశ మందిరంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ళు, కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, నర్సింగ్ స్కూల్/కాలేజీలు, అంగన్వాడి కేంద్రాలు, గ్రంథాలయాలు తదితర వాటికి సొంత భవనాల నిర్మాణాల కోసం ప్రభుత్వ అనుమతి లభించినందున, అనువైన స్థలాలను తక్షణమే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే స్థల నిర్ధారణ పూర్తయిన చోట వెంటనే పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు స్థల సమస్య కారణంగా ల్యాప్స్ కాకూడదని అన్నారు. ఆయా భవనాల నిర్మాణాల కోసం కేటాయించిన స్థలాలను





పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ఒకవేళ ఎక్కడైనా ఈ స్థలాలు కబ్జాకు గురైతే అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని హెచ్చరించారు. కాగా, నిజామాబాద్ నగరం, బోధన్ వంటి పట్టణాలలో అభివృద్ధి పనులకు తగిన స్థలాలు అందుబాటులో లేకపోతే సమీప మండలాల్లో అనువైన భూములను గుర్తించాలని అన్నారు. ప్రజోపయోగ పనులకు స్థల సేకరణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, మంజూరీలు లభించిన అన్ని భవనాల నిర్మాణాల కోసం తగిన స్థలాన్ని గుర్తిస్తూ కేటాయింపులు చేయాలని తహసిల్దార్లకు స్పష్టం చేశారు. భూముల గుర్తింపు విషయంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ 'ప్రజా బాట'షురూ..
# వారంలో మూడు రోజులు క్షేత్రస్థాయి పరిశీలన

**నాంపల్లి ఏడీఈ సాగర్ రెడ్డి**

**ధర్మ ఘంట జనవరి 24 మర్రిగూడ :**

విద్యుత్ శాఖ అధికారులు ఇంటింటికీ తిరిగి వినియోగదారుల విద్యుత్ సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం కోసమే' ప్రజా బాట' కార్యక్రమం చేపట్టినట్లు నాంపల్లి ఏడీఈ సాగర్ రెడ్డి తెలిపారు.నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామంలో శనివారం సర్పంచ్ లపంగి నర్సింహా ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు 'ప్రజా బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ...ప్రజలకు నిరంతరాయంగా, ప్రమాద రహితంగా విద్యుత్ సరఫరా అందించాలనే సంకల్పంతో విద్యుత్ శాఖ వినూత్న కార్యక్రమానికి తెరవేసింది.ప్రతి మంగళవారం,గురువారం,శనివారం వారంలో మూడు రోజులు గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించబడు తుందన్నారు.ఓల్టేజ్ సమస్యలు,లూస్ వైర్లు,విద్యుత్ సరఫరాలో అంతరాయం,ట్రాన్స్‌ఫార్మర్లలో లోపాలు,కరెంట్ వైర్లపై ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడం,ఇండ్లపై నుంచి వెళ్తున్న లైన్లు,రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ స్థంభాల సమస్యలను పరిష్కరించాలని,అవసరమైన చోట నూతన స్తంభాల ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని సమస్యలు పరిష్కరించేందుకే 'ప్రజా బాట'వంటి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడు తాయన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లపంగి నర్సింహా,ఏఈ సందీప్,మాజీ ఎంపీపీ పాముల యాదయ్య,ఫోర్ మెన్ రవికుమార్,లైన్ ఇన్స్పెక్టర్ రవీందర్, లైన్మెన్ వెంకన్న,వార్డు మెంబర్స్ లపంగి మహేందర్,కొత్త లింగస్వామి,గ్రామ ప్రజలు లొంకయ్య, భీమనగోని యాదయ్య,పగిళ్ల శంకర్,అయితగోని రాములు,కొత్త శంకర్, బేత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ విద్యారంగ సంస్కరణలు దేశానికి ప్రమాదకరం

**శాస్త్రీయ,ప్రజాస్వామ్య విద్య కోసం సమాజమంతా సంఘటితం కావాలి**

**పి.డి.ఎస్.యు.తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలో హెచ్.సి.యు.ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ**

**ధర్మఘంట జనవరి 24 ఖమ్మం:**

కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు విద్య రంగంలో వ్యాపార లావాదేవీలే ధ్యేయంగా,పెట్టుబడిదారి వర్గాల ప్రయోజనాలే లక్ష్యంగా చేస్తున్న సంస్కరణల దేశానికి తీవ్ర ప్రమాదకరంగా మారాయని, దేశంలో శాస్త్రీయ,ప్రజాస్వామ్య విద్య ద్వారానే సమానత్వ సమాజ ఏర్పాటు సాధ్యమని దీనికోసం విద్యార్థులు, మేధావులతో పాటు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు సంఘటితంగా పోరాడాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) తెలంగాణ రాష్ట్ర 23వ,మహాసభల నిర్వహణలో భాగంగా రాష్ట్ర వ్యాప్త విద్యార్థి ప్రతినిధులతో రెండవ రోజు కొనసాగింది.ఈ మహాసభ ప్రారంభానికి ముందు పి.డి.ఎస్.యు.బిగిపిడికిలి జెండాను తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ ఆవిష్కరించగా,విద్యార్థి అమరవీరులను స్మరిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.మహాసభ ప్రతినిధులు విద్యార్థి అమరులకు రెండు నిమిషాలు ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం జరిగిన మహాసభలో ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు,ప్రముఖ విద్యావేత్త ఐ.వి.రమణారావు తొలి పలుకులు పలుకుతూ సమాజ మార్పులో విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించాలని, వివిధ దేశాల్లో విద్యార్థులు నిర్వహించిన పోరాటాలు ప్రపంచ దశ,దిశ లనే మార్చి వేశాయని గుర్తు చేశారు.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ మహాసభలను ప్రారంభిస్తూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో సామాజిక శాస్త్రాలను పథకం ప్రకారం సమాధి చేస్తూ,మార్కెట్ ఓరియెంటెడ్ కోర్సులను ప్రవేశ పెడుతూ విద్య రంగాన్ని పూర్తిగా వ్యాపారమయంగా మార్చి వేస్తున్నారని,దీంతో ఆర్థిక బలహీనతతో ఉన్న పేద కుటుంబాల విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవు తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆర్థిక విధానాల ఫలితంగానే దేశంలో పేదరికం, నిరుద్యోగం, అణచివేతలు,సామాజిక,ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రేషనలైజేషన్ పేరిట వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూసివేస్తున్నదని,ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధిని పూర్తిగా విస్మరిస్తూన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎమ్మెల్యే,ఎంపీల కాంట్రాక్ట్ కమిషన్ల కోసం, కార్పొరేట్ పెట్టుబడిదారి బహుళ జాతి కంపెనీల లాభాల కోసం మాత్రమే స్కిల్ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్,స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్నారని




తీవ్రంగా ఆక్షేపించారు.ఎన్నికల ముందు విద్యారంగానికి 15% నిధులు కేటాయిస్తామని చెప్పి నేడు ముఖ్యమంత్రి ముఖం చాటేసారన్నారు.కేంద్రంలో నరేంద్ర మోడీ తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం-2020 అమలు వలన దేశ లౌకిక వ్యవస్థ,భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తి,ప్రజాస్వామిక లక్ష్యాలు ప్రమాదంలో పడ్డాయని అన్నారు.విద్యారంగంలో కాషాయీకరణ విధానాలను వేగంగా తీసుకువస్తూ, ప్రశ్నించలేని మెదళ్లను తయారు చేయడమే పనిగా పెట్టుకొని, భారత రాజ్యాంగ లక్ష్యాలకు విరుద్ధంగా,మత రాజ్యాన్ని స్థాపించే కుట్రలకు మోడీ ప్రభుత్వం పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.నేటి విద్యార్థులు ప్రగతిశీల భావజాలాన్ని అలవర్చుకొని, కుల,మతోన్మాద దోపిడి భావజాల వ్యాప్తిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. టి.పి.టి.ఎఫ్.రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వి.మనోహర్ రాజ్ మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధ సంస్థలను తన చెప్పు చేతుల్లో పెట్టుకొని ప్రజల హక్కులను, ప్రశ్నించే గొంతులను అణచివేస్తూ,దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య మనుగడను ప్రశ్నార్థకంగా మార్చి వేస్తున్నదని అన్నారు.ఈ మహాసభలో వివిధ వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని సందేశం ఇచ్చారు.మహాసభలో అరుణోదయ కళాకారులు ఆలపించిన



విప్లవ గేయాలు, సంస్కృతిక కార్యక్రమాలు మహాసభ ప్రతినిధులను ఉత్తేజపరిచాయి.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు,ఎర్ర అఖిల్ కుమార్,ఎం. నరేందర్, ఎస్.రాకేష్,సహాయ కార్యదర్శులు ఎం.సాయి,కర్క గణేష్, జి.సురేష్,వి.వెంకటేష్,రాష్ట్ర నాయకులు హాలో అలువాల నరేష్,ఎల్.అనిల్,అంగిడి కుమార్,మునిగేల శివప్రసాద్, బి.అజయ్,అషూర్,వి.కావ్య,పి.అనూష,గుమ్మడి చైతన్య, దీక్షీత,సీతారాం,మధు,అశోక్ తదితరులు పాల్గొన్నారు.




## రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలి





**కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి**

**ధర్మఘంట జనవరి 24:**

37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని, "ూ==×ఎజు - ూూ×ఎజు" అవగాహనా కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు."హెల్మెట్ ధారణ ప్రాణరక్ష - కలెక్టర్ పమేలా సత్పతి" ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. డీజీపీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'ూ==×ఎజు -ూూ×ఎజు' కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా అమలు అవుతోందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధికంగా మన దేశంలో 22 కోట్ల 10 లక్షల బైక్‌లు ఉన్నాయని, ప్రమాదాలు జరిగినప్పుడు తలకి గాయం కాకుండా ఉంటే ప్రాణాపాయం తప్పుతుందని గుర్తుచేశారు. వాహనదారులు వ్యక్తిగత భద్రత పాటిస్తూనే, ఇతరులను కూడా చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో పాల్గొన్న వారికి పోలీస్ శాఖ తరపున హెల్మెట్లను పంపిణీ చేశారు."90 శాతం ప్రమాదాలను నివారించవచ్చు - సీపీ గౌష్ ఆలం" కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ గతేడాది గణాంకాలను వివరించారు. గత ఏడాది కమిషనరేట్ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో 200 మంది మరణించగా, అందులో 40 శాతం (80 మంది) టూ వీలర్ వాహనదారులే. మరణించిన వారిలో 90 శాతం మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రతా నియమాలను తూచా తప్పకుండా పాటిస్తే 90 శాతం ప్రమాదాలను నివారించవచ్చని, ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కొనసాగిన ర్యాలీ మార్గం: పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ.. బస్ స్టేషన్, ప్రతిమ మల్టీప్లెక్స్, గీతాభవన్ చౌరస్తా, మంకమ్మతోట, శివ థియేటర్ సర్కిల్, కెమిస్ట్ భవన్, కోర్ట్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, కమాన్ చౌరస్తా మీదుగా సాగి తిరిగి పరేడ్ గ్రౌండ్‌లో ముగిసింది.ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం, అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు వెంకటస్వామి, యాదగిరిస్వామి, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, తిరుమల్ మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కానిస్టేబుల్ ను పరామర్శించిన కలెక్టర్



**ధర్మ ఘంట నిజామాబాద్, జనవరి 24 :**

నిజామాబాద్ నగర శివారులో తనిఖీలు నిర్వహిస్తున్న సందర్భంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులు కారుతో ఢీకొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడి నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ జి.సౌమ్యను కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి ఆసుపత్రి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సౌమ్య కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. సౌమ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో ఉన్న ఎక్సైజ్ వుమెన్ కానిస్టేబుల్ పై హత్యా యత్నానికి పాల్పడడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, బాధ్యులైన వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని పోలీస్ కమిషనర్ ను కోరతామని అన్నారు. సౌమ్య వెంటిలేటర్ పై ఉన్నారని, ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ 48 గంటల పాటు అబ్జర్వేషన్ లో ఉంచాలని వైద్యులు తెలిపారని కలెక్టర్ వెల్లడించారు. సౌమ్య ఆరోగ్యం సహకరించిన వెంటనే ఉన్నత స్థాయి వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించేలా ఏర్పాట్లు చేశామని, ఆమె వైద్యం కోసం అయ్యే ఖర్చును ప్రభుత్వ పరంగా అందించడం జరుగుతుందని తెలిపారు. కాగా, సంఘటన జరిగిన వెంటనే ఘటనా స్థలంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ స్వప్న తక్షణమే స్పందించి సౌమ్యకు సీ.పీ.ఆర్ చేయడం ఎంతగానో ఉపకరించిందని ఈ సందర్భంగా స్వప్నను కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ వెంట ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, సూపరింటెండెంట్ మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.



### విధి నిర్వహణలో స్వీయ భద్రత పాటించాలి

కాగా, ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు అందరూ విధి నిర్వహణ సమయంలో స్వీయ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. అభివృద్ధి పనుల ప్రగతిపై కలెక్టరేట్ లో శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంగా కలెక్టర్ ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ఘటనను ప్రస్తావించారు. విధి నిర్వహణలో ఉన్న తరుణంలో హత్యా యత్నానికి గురై తీవ్రంగా గాయపడిన సౌమ్య ఘటన తనను ఎంతగానో కలిచివేసిందని అన్నారు. విధులు నిర్వర్తించే సమయాలలో ఉద్యోగులు అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ధర్మఘంట

# సెక్యూరిటీ కౌన్సిల్ లోగో ప్రారంభించిన డీజీపీ

**ధర్మ ఘంట నిజామాబాద్ జనవరి 24:**

నిజామాబాద్ జిల్లా కేంద్రం లో సెక్యూరిటీ కౌన్సిల్ లోగో 'ను రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి ఆవిష్కరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో హెల్మెట్ల పంపిణీ , బైక్ ర్యాలీ నిర్వహణ చేపట్టారు. పోలీస్ స్టేషన్ల ఆధునికరణతో ప్రజలకు చేరువగా సేవలు అందుతాయన్నారు. నిజామాబాద్ జిల్లా పౌరుల భద్రతే లక్ష్యంగా, ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల సమన్వయంతో రూపుదిద్దుకున్న 'నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్' ప్రారంభమైంది. నగరంలోని జిల్లా మెడికల్ కళాశాల వేదికగా జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, కౌన్సిల్ లోగోను ఆవిష్కరించారు. అనంతరం కౌన్సిల్ చైర్మన్‌గా సిపి.సాయి చైతన్య, కన్వీనర్‌గా అదనపు డిసిపి బస్వారెడ్డి, జనరల్ సెక్రటరీగా కవితా రెడ్డితో పాటు ఇతర సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రధానంగా మహిళా,చిన్న పిల్లల రక్షణ, ట్రాఫిక్ భద్రత, మౌలిక సదుపాయాల రక్షణ, సైబర్ సెక్యూరిటీపై దృష్టి సారిస్తుందన్నారు. కార్పొరేట్ సంస్థలు, విద్యా సంస్థలు, గృహ సంఘాలు వ్యాపార వర్గాలను భాగస్వాములను చేస్తూ. నగరాన్ని సురక్షితమైన ప్రాంతంగా మార్చడమే దీని అంతిమ ఉద్దేశం అన్నారు. హైదరాబాద్, సైబరాబాద్ తరహాలో నిజామాబాద్‌లో కూడా ఇటువంటి కౌన్సిల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం 8 ప్రధాన విభాగాలతో ఈ కౌన్సిల్ పని చేస్తుంది. ముఖ్యంగా సైబర్ నేరాలు పెరిగిపోతున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలో జుమ్మేరాత్ బజార్‌లో దొంగలించిన సొత్తు అమ్మేవారు, ఇప్పుడు 'డార్క్ వెబ్' అటువంటి అడ్డాగా






మారిందనీ తెలిపారు. ఆధార్, క్రెడిట్ కార్డు వివరాలు సేకరించి మోసాలకు పాల్పడుతున్నారనీ,ఇటీవల 'డిజిటల్ అరెస్ట్' పేరుతో పోలీస్ డ్రెస్సుల్లో మొబైల్ ఫోన్లలో కనిపిస్తూ వీడియో కాల్స్ చేసి మోసగిస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయన్నారు .ప్రజలు ఇలాంటి ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని డిజిపి సూచించారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ మధ్యకాలంలో" అరైవ్ అలైవ్" కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇందులో ప్రధానంగా రోడ్డు ప్రమాదాల నుండి ప్రజలను రక్షించాలని ప్రధాన ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదలు ఎక్కువగా జరుగుతుండడంపై డిజిపి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏటా సగటున 800 హత్యలు జరుగుతుంటే , రోడ్డు ప్రమాదాల్లో హత్యల కన్నా 9 నుండి 10 రెట్లు ఎక్కువగా సుమారు 7,000 మందికి పైగా మరణించడం విచారకరమన్నారు. అందుకే ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు కేవలం డ్రైవర్ మాత్రమే కాకుండా వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలనీ అన్నారు. కార్లలో ప్రయాణించే వారందరూ తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలి. ఓవర్ టేకింగ్ ఎప్పుడూ కుడి వైపు నుంచే చేయాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు పరిసరాలపై దృష్టి సారించాలని కోరారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.
శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రాణరక్షణ కోసం ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత " అని పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో పోలీసు ఉన్నతాధికారులు , సిబ్బంది మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హెల్మెట్లు ధరించి , ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మల్టీజోన్ 1 ఐజిపి ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య , అదనపు డీసీపీ అడ్మిన్ జి. బస్వారెడ్డి , అదనపు డీసీపీ ఏ.ఆర్ రామచంద్ర రావు, నిజామాబాద్ , ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్, సి టి సి ఎసిపిలు, సిఐలు , ఎస్సైలు కౌన్సిల్ సభ్యులు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## బోధన్ లో లయన్స్ జనరల్ ఆసుపత్రిని ప్రారంభించిన ప్రభుత్వ సలహాదారు, కలెక్టర్







**ధర్మ ఘంట నిజామాబాద్, జనవరి 24:**

బోధన్ పట్టణంలో లయన్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నెలకొల్పిన లయన్స్ జనరల్ ఆసుపత్రిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ప్రారంభించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి, అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, పేదలకు నామమాత్రపు రుసుముతో నాణ్యమైన రీతిలో ఆరోగ్య సేవలను అందుబాటులోకి తేవాలనే ఉద్దేశ్యంతో లయన్స్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేయించామని అన్నారు. గడిచిన పాతిక సంవత్సరాల నుండి లయన్స్ కంటి ఆసుపత్రి ద్వారా సంతృప్తికరమైన రీతిలో సేవలు అందిస్తున్నారని, దీనికి అనుసంధానంగా ప్రస్తుతం కొత్తగా ఏర్పాటు చేసిన జనరల్ ఆసుపత్రి ద్వారా కూడా మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల్లో మంచి పేరు పొందాలని అన్నారు. ప్రజలకు సేవలందించే సంస్థలకు ప్రభుత్వం తరపున సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, పేదలకు వైద్య సేవలు భారంగా మారకుండా మానవతా దృక్పథంతో సేవలు అందించాలని హితవు పలికారు. అనారోగ్యాలతో వైద్యం కోసం వచ్చే వారికి సరైన విధంగా పరీక్షలు చేసి, అవసరమైన మేరకు టెస్టులు, మందులు రాయాలని సూచించారు. సేవాభావంతో పనిచేసే స్వచ్ఛంద సంస్థలకు జిల్లా యంత్రాంగం తరపున తోడ్పాటుగా నిలుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, లయన్స్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కానిస్టేబుల్ ను పరామర్శించిన కలెక్టర్



**ధర్మ ఘంట నిజామాబాద్, జనవరి 24 :**

నిజామాబాద్ నగర శివారులో తనిఖీలు నిర్వహిస్తున్న సందర్భంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులు కారుతో ఢీకొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడి నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ జి.సౌమ్యను కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి ఆసుపత్రి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సౌమ్య కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. సౌమ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో ఉన్న ఎక్సైజ్ వుమెన్ కానిస్టేబుల్ పై హత్యా యత్నానికి పాల్పడడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, బాధ్యులైన వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని పోలీస్ కమిషనర్ ను కోరతామని అన్నారు. సౌమ్య వెంటిలేటర్ పై ఉన్నారని, ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ 48 గంటల పాటు అబ్జర్వేషన్ లో ఉంచాలని వైద్యులు తెలిపారని కలెక్టర్ వెల్లడించారు. సౌమ్య ఆరోగ్యం సహకరించిన వెంటనే ఉన్నత స్థాయి వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించేలా ఏర్పాట్లు చేశామని, ఆమె వైద్యం కోసం అయ్యే ఖర్చును ప్రభుత్వ పరంగా అందించడం జరుగుతుందని తెలిపారు. కాగా, సంఘటన జరిగిన వెంటనే ఘటనా స్థలంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ స్వప్న తక్షణమే స్పందించి సౌమ్యకు సీ.పీ.ఆర్ చేయడం ఎంతగానో ఉపకరించిందని ఈ సందర్భంగా స్వప్నను కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ వెంట ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, సూపరింటెండెంట్ మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

### విధి నిర్వహణలో స్వీయ భద్రత పాటించాలి

కాగా, ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు అందరూ విధి నిర్వహణ సమయంలో స్వీయ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. అభివృద్ధి పనుల ప్రగతిపై కలెక్టరేట్ లో శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంగా కలెక్టర్ ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ఘటనను ప్రస్తావించారు. విధి నిర్వహణలో ఉన్న తరుణంలో హత్యా యత్నానికి గురై తీవ్రంగా గాయపడిన సౌమ్య ఘటన తనను ఎంతగానో కలిచివేసిందని అన్నారు. విధులు నిర్వర్తించే సమయాలలో ఉద్యోగులు అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



# రాజేష్ హత్యపై గులాబీ గర్జన



**లాఠీల బెదిరింపులకు, కాంగ్రెస్ తాటాకు చప్పుళ్ళకు భయపడేది లేదు**
**వారి కుటుంబానికి న్యాయం చేసేంత వరకు ఉద్యమం ఆపేది లేదు**
**కోదాడ బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ హెచ్చరిక**

**ధర్మ ఘంట,జనవరి 24,కోదాడ:-**

కోదాడ పట్టణం రాజకీయ వేడితో ఉక్కిరిబిక్కిరైంది. దళిత యువకుడు కర్ల రాజేష్ లాక్‌అప్ డెత్ ఘటనను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన ప్రదర్శన పట్టణాన్ని కుదిపేసింది. వేలాదిమంది కార్యకర్తలు, నాయకులు బైకులు, కార్లు, ఇతర వాహనాల్లో తరలివచ్చి గులాబీ దండు సైన్యంలా ముందుకు సాగారు. ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఈ ఉద్యమానికి మరింత ఊపు తెచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, పోలీసుల అత్యుత్సాహాన్ని ఖండిస్తూ పట్టణమంతా నినాదాలతో మార్మోగింది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ పాలనకు ఇది గట్టి హెచ్చరికగా మారిందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని తీవ్ర స్థాయిలో ప్రసంగించారు.నిరసన ప్రదర్శనకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ రాజేష్ హత్య జరిగి 60 రోజులు గడుస్తున్నా స్థానిక ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించకపోవడం ప్రజాస్వామ్యంలో దురదృష్టకరమని విమర్శించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. కోదాడ, హుజూర్నగర్ నియోజకవర్గాలు కాంగ్రెస్ నేతలకు టూరిస్టు ప్రాంతాలుగా మారాయని, పట్టణంలో షాడో ఎమ్మెల్యేల మాఫియా రాజ్యం నడుస్తోందని మండిపడ్డారు. పోలీసుల ఆగడాలు అదుపు తప్పుతున్నాయని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పట్టణ సీఐ శివశంకర్ వ్యవహారశైలి కాకి చొక్కా తొడిగిన చందంగా మారిందని విమర్శించిన ఆయన, ఇసుక, మద్యం, మట్టి మాఫియాలతో పోలీసులకు ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు గుప్పించారు.రాజేష్‌ను విచారణ పేరుతో పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అతని మృతికి చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డి ప్రత్యక్ష కారణమని ఆరోపిస్తూ, ఇప్పటివరకు అతనిపై చర్యలు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్టగా పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధారాలతో సహా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని, అధికారాన్ని ఉపయోగించి బాధ్యులను వెనకేసుకొస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రాజేష్ మరణంతో వృద్ధ తల్లి అనుభవిస్తున్న వేదనకు కారణమైన వారంతా తగిన సమయంలో శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు.కాంగ్రెస్ పాలనలో అధికారులకు మాత్రమే భద్రత ఉందని, సామాన్య ప్రజల ప్రాణాలకు రక్షణ కరువైందని విమర్శించారు. ఇకపై బీఆర్ఎస్ కార్యకర్తలపై ఏ చిన్న దాడి జరిగినా సహించబోమని స్పష్టం చేశారు. పోలీసులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి ప్రజలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు, దోషులపై కఠిన చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ నిరసన కోదాడ రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతకు నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల నాయకులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కోదాడ లేబర్ కార్యాలయంలో ఏసీబీ దాడులు..

**ధర్మ ఘంట,జనవరి 24,కోదాడ:-**




కోదాడ పట్టణంలోని లేబర్ కార్యాలయంలో శనివారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. లేబర్ కార్డుల మంజూరులో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఈ సోదాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పట్టణంలోని ఓ మీసేవ కేంద్రం వేదికగా లేబర్ కార్డుల జారీ ప్రక్రియలో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో లేబర్ కార్యాలయంతో పాటు సంబంధిత రికార్డులను పరిశీలించారు. సోదాల్లో భాగంగా పలు కీలక ధ్రువపత్రాలు, అధికారిక దస్త్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అక్రమ లావాదేవీలకు సంబంధించి మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా, విచారణ కొనసాగుతోందని ఏసీబీ అధికారులు వెల్లడించారు

## జాన పహాడ్ దర్గా సర్వ మత సమ్మేళ్యానికి ప్రతీక





**రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్**
**దర్గాను దర్శించుకొని, సైదులు బాబుకు భక్తి శ్రద్ధలతో చాదర్,దట్టీనీ కప్పిన మంత్రి**


**ధర్మఘంట జనవరి 24 సూర్యాపేట:**

జాన్ పహాడ్ దర్గా సర్వ మత సమ్మేళ్యానికి ప్రతీక అని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ, పబ్లిక్ ఎంటర్ ప్రైజస్ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు.పాలకవీడు మండలం జాన్ పహాడ్ దర్గాను మంత్రి శనివారం దర్శించుకున్నారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ శుక్రవారం ఉర్స్ జరిగిందని, శనివారం ఆయన జియారత్ (దర్శనం) కోసం వచ్చానని ఇక్కడ ఉండటం నాకు చాలా సంతోషంగా ఉందని,ఇక్కడికి హిందూ,ముస్లిం,సిక్కు,క్రైస్తవ అన్ని వర్గాల ప్రజలు వస్తారని, అందరూ ఇక్కడికి వచ్చి తమ మొక్కులు తీర్చుకుని వెళ్తుంటారని తెలిపారు.మీ అందరి మధ్యకు రావడం నాకు చాలా సంతోషాన్ని ఇచ్చిందని అల్లా దయవల్ల అవకాశం దొరికితే మళ్ళీ వస్తానని,నేను కోరుకునేది ఒక్కటేనని మీరందరూ ఇక్కడ కలిసిమెలిసి ఉండాలని మంచి పనులు చేయాలని,అన్ని వర్గాలు కలిసి ఉంటేనే పని బాగా జరుగుతుందని,ఇక్కడికి బయటి నుంచి కూడా చాలా మంది వస్తుంటారని ఇది చాలా పెద్ద దర్గా షరీఫ్,ఇక్కడ గొప్ప మహనీయులు(బుజుర్గాన్-ఏ-దీన్) కొలువై ఉన్నారన్నారు.చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ ఉర్స్ ప్రతి ఏటా చాలా బాగా జరుగుతుందని,ఇన్షా అల్లాహ్ వచ్చే ఏడాది కూడా ఇంకా బాగా జరుగుతుందని ఆశిస్తున్నానన్నారు.ఈ కార్యక్రమానికి ఆర్డీఓ శ్రీనివాసులు,డిఎస్పీ ప్రసన్న కుమార్,మైనార్టీ సంక్షేమ అధికారి నరసింహ రావు, తహసీల్దార్ కమలాకర్,వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ మహబూబ్, ముజవర్ జానీబాబా,ప్రజా ప్రతినిధులు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు సైబర్ నేరస్తులను అరెస్టు

**రిమాండ్ కు ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు**
**వివరాలు వెల్లడించిన**
**ఖమ్మం పోలీస్ కమిషనర్ సునిల్ దత్**

**ధర్మఘంట జనవరి 24 ఖమ్మం:**



ఆన్లైన్లో ట్రేడింగ్,ఇన్వెస్ట్మెంట్ లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించిన రెండు వేర్వేరు కేసుల్లో ముగ్గురిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరు సిటీలో అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునిల్ దత్ తెలిపారు.శనివారం కమిషనర్ వెల్లడించిన కేసు వివరాలలోకి వెళితే..ఖమ్మం జిల్లాకు చెందిన వ్యాపార వేత్తకు ఫోన్ చేసి ఆన్లైన్ లో ట్రేడింగ్,ఇన్వెస్ట్మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి వాట్సప్,ట్రేడింగ్ లింకుల ద్వారా సుమారు 30 లక్షలు రూపాయలు ఇన్వెస్ట్మెంట్ చేసి మోసపోయిన కేసులో సైబర్ నిందుతులు మధు (38) రూప (36) జాయింట్ అక్కౌంట్ కి 7 లక్షల వెళ్లినట్లు తెలిపారు.మరో కేసులో ఖమ్మం జిల్లాకు చెందిన ప్రైవేట్ ఉద్యోగికి పార్ట్ టైమ్ జాబ్,ఇన్వెస్ట్మెంట్ లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి,సుమారు రూ.9 లక్షలు ఇన్వెస్ట్మెంట్ చేసి మోసపోయిన కేసులో నిందుతుడు సెంథిల్ కుమార్ (46) అక్కౌంట్ కు 25 వేల రూపాయిలు వెళ్లినట్లు పేర్కొన్నారు.ముగ్గురు నిందుతులను బెంగుళూరులో అరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి,రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు.ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డిఎస్పీ సిహెచ్.ఆర్.వి.ఫణిందర్,ఇన్స్పెక్టర్ నరేశ్,ఎస్సైలు రంజిత్ కుమార్,విజయకుమార్ లను, కానిస్టేబుల్స్ భానుమూర్తి,కిషన్ రావు,కృష్ణారావు,నాగేంద్రమ్మ, సుప్రియా,సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని సీపీ అభినందించారు.